జన రాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 7 సంచిక - 10 పక్షపత్రిక మే 16-31, 2016



# మూడో ఏడులోకి...







# అధికార వికేంద్రీకరణ, స్థానిక ప్రభుత్వాల సాధికారత కోసం జీవితమంతా పోరాడిన ప్రజాస్వామ్యవాది: రాజేశ్వరరావుకు జేపీ నివాళి

దేశ నిర్మాణం కోసం, తెలుగు ప్రజల ప్రగతి కోసం, తెలంగాణ భవిష్యత్తు కోసం అహర్నిశలూ తపించి శ్రమించిన కాకలు తీరిన మహాయోధుడు చెన్నమనేని రాజేశ్వరరావు అని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

కులం, మతం, ప్రాంతం అన్న తేడా లేకుండా అందరి అభ్యున్నతిని కాంక్షించిన నిరంతర సామ్యవాది, ప్రజల చేతుల్లోనే అధికారం ఉండాలని స్థానిక ప్రభుత్వాల సాధికారత కోసం జీవితమంతా కష్టపడిన ప్రజాస్వామ్యవాది రాజేశ్వరరావు అని జేపీ సజల నయనాలతో నివాళులర్పించారు.

దేశంలో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు ఎవరికి తీసిపోనంత కీర్తి, ప్రతిష్ఠ, ప్రజాదరణ ఉన్నా ఆయనలో అతిశయంగాని, అహంభావంగాని మచ్చుకు కూడా కనిపించవని జేపీ అన్నారు. స్నేహశీలత, నిరాడంబరత, వినమ్రత రాజేశ్వరరావుకు ఆభరణాలన్నారు.

## లోక్‌సత్తా ఎలాంటి కార్యక్రమం పెట్టినా సంతోషంగా పాల్గొనేవారు

వ్యక్తిగతంగా తాను, ఉద్యమంగా లోక్‌సత్తా ఒక గొప్ప మిత్రుడ్ని, శ్రేయోభిలాషిని కోల్పోయామని జేపీ అన్నారు. అనారోగ్యాన్ని, వయోభారాన్ని కూడా లెక్కచేయకుండా లోక్‌సత్తా ఎప్పుడు ఎలాంటి కార్యక్రమం పెట్టినా రాజేశ్వరరావు సంతోషంగా పాల్గొనేవారన్నారు. పరిణతిగల ఆలోచన, ముందుచూపుతో ఆయనిచ్చే సూచనలు, సలహాలు ఎంతో విలువైనవన్నారు. రాజేశ్వరరావు మృతితో ఒక గొప్ప నాయకుడ్ని, ప్రజాస్వామ్యవాదిని, సమసమాజం కోసం, అధికార వికేంద్రీకరణ కోసం నిరంతరం పాటుపడిన మహాయోధుడ్ని తెలుగుజాతి కోల్పోయిందన్నారు.

రాజేశ్వరరావు లక్ష్యాలు నెరవేరే రోజు త్వరలో వస్తుందని, మన సమాజంలోని ఆలోచనాపరులంతా కదిలి మనం గర్వించే రాజ్యవ్యవస్థ నిర్మాణంలో భాగస్వాములవుతారని మనసారా ఆశిస్తున్నట్టు జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక మే 16-31, 2016

సంపుటి - 7 సంచిక - 10

## లోపలి పేజీల్లో...

మూడో ఏడులోకి మోదీ ప్రభుత్వం ................ 5
గుజరాత్ మోదీ, న్యూఢిల్లీ మోదీ .................. 10
నేల విడచి సాములేల............................... 12
చదువులో సగటు కంటే దిగువనే తెలుగు ....... 14
జనం జీవితాల ఎత్తు పెంచే పాలన కోసం....... 15
బుద్ధుడి జీవితం - ప్రజాస్వామిక నాయకత్వం... 17
ప్రత్యేక హోదాపై తెదేపా, బీజేపీ రాజకీయ...... 21
ఏపీ పరిశ్రమల శాఖలో భారీ అవినీతి............. 22
లైబ్రరీల పునరుజ్జీవనానికి లోక్‌సత్తా పార్టీ ..... 23
విద్యా విజ్ఞానాలకు మిషన్ వట్టికోట ............. 24
జేపీ ఆనాడే హెచ్చరించినా నిద్ర నటించిన ....... 27
పౌరులు గాలికొదిలేస్తే తప్ప నగరాలు ........... 29
జేపీ లెటర్ ........................................... 30
ఒక (అవి) నీతి కథ ................................. 32
ఆరోగ్యశ్రీలో 72.64% నిధులు ప్రయివేటుకే... 34

## సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

### సంపాదక వర్గం

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి






# కార్టూన్ కార్నర్




In this 'money-go-round' probe, we'll know exactly where the buck stopped.

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ప్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**


*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.



# మూడో ఏడులోకి మోదీ ప్రభుత్వం

**జా**తీయస్థాయిలో నరేంద్ర మోదీ ప్రభుత్వం మూడో ఏడులోకి అడుగుపెడుతోంది. పదవీకాలానికి మధ్యలో ఉన్న ఈ సంవత్సరాన్ని దాటితే అధికార పార్టీకి ఇక 2019 ఎన్నికల అవసరాలు మొదలవుతాయి. ఎన్నో ఆశలతో ప్రజలు గెలిపించిన మోదీ ఏమైనా ప్రజలకు చేయాలంటే ఇక పరిమిత అవకాశాలే మిగిలిఉన్నాయి. ఈ పరిమిత అవకాశాలను వినియోగించుకుని తనకు ప్రజలిచ్చిన తీర్పుకి కొంతయినా న్యాయం చేయాలంటే నరేంద్ర మోదీ ఒక రుషిలా స్థితప్రజ్ఞతతో గత రెండేళ్ల తప్పొప్పులను సమీక్షించుకోవాలి.

వేగంగా ఆర్థికాభివృద్ధి, ప్రజలందరినీ భాగస్వాముల్ని చేయటం, యువతను బలమయిన శక్తిగా వినియోగించుకోవటం, అవినీతిని అంతం చేయటం, సుపరిపాలన వంటి అంశాలతో ప్రజల్లో వేగంగా ప్రాచుర్యం పొంది నిస్తేజమైన యూపీయే పాలన మీద అద్భుత విజయాన్ని సాధించిన మోదీ.. ఆచరణలో ఇంకా మొదటి అంశం చుట్టూనే తిరుగుతున్నారు.

ఆర్థికాన్ని కొంత మినహాయిస్తే, ఏ ఇరవై శాతం అంశాలను మార్చే సంస్కరణలను తెస్తే ఈదేశంలో మిగిలిన ఎనభై శాతం అంశాలు కూడా వేగంగా మారిపోయి సమూల పరివర్తన సాధ్యమవుతుందో ఆ మౌలిక సంస్కరణల జోలికి మోదీ పోవటం లేదు. ఇంకా ఆయన బండరాయిని బండ పద్ధతులతోనే, తలతోనే ఢీకొంటున్నారు తప్ప ఒక పొడవాటి తులాదండాన్ని తెచ్చి గరిమనాభి వద్ద పెట్టి బండను ఖచ్చితంగా, వేగంగా కదలించే ప్రయత్నం చేయటం లేదు. దాంతో ఆయన ఎంత తపన పడుతున్నా, ఎంత కష్టపడుతున్నా, ఎంత వ్యక్తిగత నిజాయతీని ప్రదర్శిస్తున్నా ఏదో పెద్ద వెలితి కనిపిస్తోంది. ప్రధాన ప్రత్యర్థి జాతీయపార్టీ కాంగ్రెస్ నాయకత్వ స్వయంకృత ఘోరవైఫల్యమే మోదీకి శ్రీరామరక్షగా ఉంటోంది. మరోవైపు, సొంత ఎజెండా చుట్టూ గిరిగీసుకున్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సహా తృతీయ కూటమి పార్టీలు పంథా మార్చుకుంటున్నామని చెబుతున్నా వారికి మోదీకున్నంత పెద్ద వేదిక లేదు, జనం కూడా అంతగా విశ్వసించటం లేదు. దీంతో మోదీ వ్యక్తిగత హవా ఇంకా గణనీయంగానే కొనసాగుతోంది. కానీ ఇందాక చెప్పుకున్నట్టు, ఏదో పెద్ద వెలితి. రిజర్వుబ్యాంకు గవర్నర్ రఘురాం రాజన్ 'గుడ్డిలో మెల్ల' అన్న వ్యాఖ్యను తేలిగ్గా కొట్టిపారేయలేని పరిస్థితి.

మోదీకి మరికొంత సమయం కావాలి, మోదీయే కాదు, ఎవరొచ్చినా ఇంతకంటే ఏమీ చేయలేరు వంటి సమర్థింపులు వినటానికి బాగుండొచ్చుగానీ విశ్లేషణలకు నిలబడవు. కాంగ్రెస్ పార్టీ దశాబ్దాలపాటు నాశనం చేసిన దేశాన్ని పునర్నిర్మించి అగ్రరాజ్య స్థాయికి తేవటానికి 60 నెలలు సమయం ఇవ్వండి అని మోదీ ఎన్నికల సమయంలో అడిగారు. కానీ అంతకు కొన్నిరెట్లు సమయం ఇచ్చినా ఆయన చెప్పిన మాటను నెరవేర్చుకోగలరన్న నమ్మకం కలిగేలా పరిపాలన లేదు. ఇప్పటికీ మోదీకి మద్దతిస్తున్నవారు కూడా.. ఈ రెండేళ్లలో తమ జీవితాలు మారాయని భావించటం లేదు. మోదీ గెలుపోటముల ప్రభావం ఆయన సొంత పార్టీ బీజేపీకే పరిమితమైతే మనం పెద్ద చర్చించనక్కర్లేదు. కానీ దేశానికి కీలకమైన సమయంలో, ప్రజల తీర్పుతో ప్రధాని పదవిలోకి వచ్చిన వ్యక్తిగా ఆయన జయాపజయాలు ఈదేశం మీద పెనుప్రభావం చూపిస్తాయి. అందుకే మోదీ పనితీరుని క్షుణ్ణంగా పరిశీలించాలి. అందునా మూడో ఏడులోకి పాలన ప్రవేశించేసింది.

తాను కూడా ఊహించని రీతిలో పూర్తి మెజారిటీతో అధికారంలోకి రావటంతో మోదీ ఎన్నికల సమయంలో అనుకున్న రాజకీయ, పాలనా వ్యూహాలను మార్చుకున్నారు. బీజేపీ గెలుపులో తన పాత్రే కీలకం కావటంతో తాను గుజరాత్‌లో అమలుచేసిన

ఆర్థికాభివృద్ధి నమూనాను, పాలనా పద్ధతుల్ని అమలుచేయటం, వ్యక్తిగత ఇమేజ్‌ను పెంచుకోవటం ప్రారంభించారు. మంత్రిమండలిలో పెద్దగా అవగాహన, దూరదృష్టి లేనివారిని ఎక్కువమందిని తీసుకుని ఐఏఎస్‌ల మీద ఆధారపడటం ఆయనకు గుజరాత్‌లో రాజకీయ లాభాల్ని ఆర్జించిపెట్టింది. ఢిల్లీలో కూడా అదే తీరుగా ఉన్నతాధికారుల మీద ఆధారపడి మోదీ నిర్ణయాలు తీసుకుంటున్నారు. మోదీకి నచ్చే, మోదీ స్టయిల్‌కు నప్పే నిర్ణయాలను డిజైన్ చేయటమే తప్ప, దేశ ప్రయోజనాల గురించి అక్కడ ఆలోచించేవారు తక్కువగా ఉన్నారు. ప్రజలతో సంబంధమున్నవారు, ప్రజాజీవితాలను మార్చే కృషి చేసినవారు మోదీ చుట్టూ ఉన్న ఐఏఎస్‌లలో కనిపించరు. దాంతోపాటు మోదీ విదేశాంగమంత్రి, కార్యదర్శి స్థాయి పర్యటలను కూడా తానే చేస్తూ విదేశాలను చుట్టిరావటం, బీజేపీని దేశమంతా విస్తరించే కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రచార సభలకు హాజరవుతుండటంతో ఢిల్లీలో ఐఏఎస్‌ల హవా పెరిగిపోయింది. అధికారులు వేగంగా నిర్ణయాలు తీసుకుంటూ రోజూ పనిచేసేలా మోదీ పర్యవేక్షిస్తున్నారుగానీ, దేశ నిర్మాణం ఆ గుమాస్తా పనుల వల్ల జరగదనే స్పృహలోకి ఇంకా ఆయన రాలేదు. ఇంత గొప్ప తీర్పుని పొందిన ప్రధానమంత్రిగా తాను చేయాల్సిన పనుల గురించి స్పష్టత లేకుండా, కేవలం తన వ్యక్తిగత ఇమేజ్, తన కార్యాలయంలో ఫైళ్లు వేగంగా కదలటం, తన పార్టీని విస్తరించటం వంటి అంశాలకే పరిమితమయ్యారు. సెల్ఫీలు ఎక్కువ తీసుకోవటం మానసిక వ్యాధిగ్రస్తుల లక్షణం అని ఎవరో చెప్పటంతో వాటిని తగ్గించారుకానీ, మిగతా సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యక్తిగత ప్రచారానికి ఇంకా గరిష్టంగానే వినియోగిస్తున్నారు... ఇదీ వెలితికి మూలం.

మరి ఈ వెలితి గురించి మోదీకి తెలియదా అంటే తెలిసుండొచ్చుగానీ, గుజరాత్ ముఖ్యమంత్రిగా సాధించానని జనం చెప్పుకుంటున్న విజయాల్ని భారత ప్రధానిగా కూడా సాధించగలనని, ఈ వెలితిని అధిగమించగలనని ఆయన అపోహపడుతూ ఉండవచ్చు. ఇటీవల డా॥ బీఆర్ అంబేద్కర్ 125వ జన్మదినోత్సవం సందర్భంగా ఆయన స్ఫూర్తితో గ్రామ స్వరాజ్యానికి బాటలు వేసే గ్రామ్ ఉదయ్ సే భారత్ ఉదయ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు మోదీ ప్రకటించటం ఏకాస్త చరిత్ర పరిజ్ఞానమున్నవారెవరికైనా చాలా ఎబ్బెట్టుగా అనిపిస్తుంది. గ్రామస్వరాజ్య ప్రభావాన్ని గుర్తించటంలో అంబేద్కర్ విఫలమైనా, ఆయన ఆశయాల సాధనకు ఆ లక్ష్యం సాకారం కావటం అవసరమని ప్రధాని హేతుబద్ధంగా వివరించాల్సింది పోయి అలవోకగా చరిత్ర వక్రీకరణ చేసేశారు. కాస్త పట్టి చూస్తే ఉత్తరాఖండ్‌లో రాష్ట్రపతి పాలన సహా ఇలాంటి పొరపాట్లు, వక్రభాష్యాలు, అపచారాలు ఆయన పాలనలో తేలిగ్గా దొరుకుతాయి. ప్రజలు తనకిచ్చిన తీర్పుని ఎన్నికల సమయంలో ఉన్నంత విశాల, సమన్వయ దృక్పథంతో ఆలోచించి అర్థం చేసుకుని ఉంటే భిన్నమైన పంథాను, ఎజెండాను మోదీ ఎంచుకుని ఉండేవారు.

ప్రధానిగా మోదీ పంథాని ఇంకొంచెం లోతుగా అర్థం చేసుకోవటానికి ఆయనకు పూర్తిస్థాయి మెజారిటీతో మొదలుపెట్టి ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, చమురు ధరలు తగ్గటం తదితర అంశాలను కూడా పరిగణలోకి తీసుకోవాలి.

లోక్‌సభలో సంపూర్ణ మెజారిటీ, ప్రజలలో పలుకుబడి ఉన్నా కూడా తాను అనుకున్నట్టు విదేశాల నుంచి నల్లధనం తీసుకొచ్చి ఇంటికి రూ. 15లక్షల చొప్పున పంచలేనని, పాకిస్థాన్‌ను ఛాతీతో ఢీకొట్టలేనని, చైనాను అధిగమించలేనని, అందరికీ ఉద్యోగాలను ఇవ్వగలిగేలా పెట్టుబడులను తేలేనని మోదీ అధికారంలోకొచ్చిన స్వల్పవ్యవధిలోనే అర్థమైంది. తాననుకున్నట్టు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ లేదని, దేశీయంగా డిమాండ్ కూడా మందకొడిగానే ఉందని ఆర్థికాంశాల మీద గట్టి దృష్టి పెట్టిన మోదీకి అవగతమైంది. అనుకోకుండా కలిసొచ్చిన పెట్రో ధరల తగ్గింపు మాత్రమే ఆయనకు ఊరట. సమీప భవిష్యత్తులో కూడా పెద్దగా ప్రపంచవ్యాప్త ఆర్థిక బూమ్ ఉండదని తేలిపోయిన నేపథ్యంలో ఉన్నవ్యవస్థనే కాస్త అటూ ఇటుగా మార్పులు చేసి కొత్తరంగులద్దుతూ ఆర్థికరంగాన్ని వీలున్నంత బలోపేతం చేయటం, తనకంటూ ఓ ముద్రని ఏర్పరుచుకోవటం, బీజేపీని బలోపేతం చేయటం మీదే ప్రధానంగా మోదీ దృష్టి పెట్టారు. అంటే గతంలోలాగా ఆర్థికంగా దేశం బలంగా ఎదిగినా కూడా అవకాశాలు కొద్దిమందికే లభిస్తుంటాయి. మిగతావారు ప్రభుత్వం ఇచ్చే దయాదాక్షిణ్యాల స్కీములు, అగమ్యమైన స్టార్టప్‌ల చుట్టూ తిరుగుతుండాల్సిందే.

కొందరికేమో పుట్టుకతోనే అవకాశాలనివ్వటం, మిగిలిన అత్యధికులకి ఆత్మవిశ్వాసం పెంచుకోండి, దృఢసంకల్పం ఉంటే గెలుపు తథ్యం వంటి మాటలు మాత్రమే చెప్పే వ్యవస్థనే కొనసాగిస్తే ఇక ప్రజాస్వామ్యానికి, మార్పుకి అర్థమేమిటి?

మిగతారంగాల్లో వారి కంటే ఏడురెట్లు తక్కువ ఆదాయం పొందుతూ వ్యవసాయరంగంలో దేశ జనాభాలోని అత్యధికులు 2022నాటికి రెట్టింపు ఆదాయం పొందేలా చూస్తామని మోదీ చెప్పటాన్ని బట్టి ఈ దేశ భవిష్యత్తు పట్ల ఆయనకఆశల స్థాయి అర్థమవుతుంది... ఆర్థిక వృద్ధి ఆయనకు సంక్లిష్ట సవాలే అయినప్పటికీ దేశంలో యథాస్థితిని మార్చేందుకు అవకాశాలు లేవా? .. అంటే ఖచ్చితంగా ఉన్నాయనే చెప్పాలి. కానీ గుజరాత్ స్థాయి ఆలోచనాతీరు, ఐఏఎస్‌ల కోటరీ ప్రభావం వల్ల మోదీ ఎంచుకోలేదు.

ఉదాహరణకు, రాబోయేకాలంలో కూడా పెద్దగా ఆర్థికవృద్ధి రేటు సాధ్యంకానప్పుడు, ప్రపంచ పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు దేశీయ మార్కెట్ మీద దృష్టి కేంద్రీకరించాలి. ప్రజలలో, ముఖ్యంగా యువతలో ఉన్న శక్తిసామర్థ్యాలను వెలికితీసే, అందరికీ సంపదసృష్టిలో అవకాశమిచ్చే నమూనాను రూపొందించాలి. అందుకోసం నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించటం మీద మోదీ ప్రభుత్వం గట్టిగా దృష్టి పెట్టాలి. ఆ పని ఇప్పటివరకూ చేయలేదు.



విద్యను వివాదాల చుట్టూ తిప్పటమే తప్ప.. వివాదాలు అక్కర్లేని గణితం, సైన్స్, ఆంగ్లం వంటి కీలక సబ్జెక్టులను బాగుచేయటం, బోధనను, మూల్యాంకనను ప్రక్షాళన చేయటం, నైపుణ్యాలను విద్యావ్యవస్థలోనే భాగం చేయటం మీద కూడా దృష్టి పెట్టలేదు. విద్యాహక్కు చట్టం లోపభూయిష్టంగా ఉంది, ఆ చట్టం వచ్చాక ప్రయివేటు బడులకు వెళ్లే విద్యార్థుల సంఖ్య భారీగా పెరుగుతోంది, చట్టాన్ని సవరించాలి అని లోక్‌సత్తా, కొందరు నిపుణులు ఎన్నిసార్లు మొత్తుకున్నా ప్రభుత్వం ఆ రంగంవైపే చూడటం లేదు. ఈదేశంలో అందరికీ మంచి చదువు అక్కర్లేదన్నట్టు వ్యవహరిస్తోంది.

దేశ ఉత్పాదక సామర్థ్యాన్ని దిగజారుస్తూ పేదరికాన్ని పెంచుతున్న వైద్య, ఆరోగ్య రంగాన్ని ప్రక్షాళన చేయటం కోసం మోదీ సర్కారు వద్ద తగిన ప్రయత్నమే లేదు. కేవలం ఆరోగ్య ఖర్చుల వల్ల దేశంలో ఏటా 5కోట్లమందికిపైగా పేదరికంలోకి జారిపోతున్నా అదో పెద్ద అంశం కాదన్నట్టు ప్రభుత్వం వ్యవహరిస్తోంది. జేబులో నుంచి రూపాయి ఖర్చు లేకుండా ఢిల్లీ నుంచి గ్రామం వరకూ దేశ ప్రజలందరికీ తక్కువ ఖర్చుతో, ఆచరణాత్మకంగా ఆరోగ్యం అందించే వినూత్న పథకాన్ని లోక్‌సత్తా రూపొందించి ప్రభుత్వం దృష్టికి తెచ్చింది. లోక్‌సత్తా నమూనా అమలుకోసం ఇంకా వేచిచూడాల్సి వస్తోంది.

గనుల బహిరంగ వేలం వంటి విధానాలు, మౌలిక వసతులతో ఆర్థికాభివృద్ధి కోసం ప్రశంసనీయంగా కృషి చేస్తున్న మోదీ ప్రభుత్వం ఆ ఫలితాలను కేవలం 15-20శాతం ప్రజలకే పరిమితం చేయకూడదనుకుంటే విద్య, ఆరోగ్యాన్ని ఎందుకు బాగుచేయటం లేదు? ఈ రెండు కీలక రంగాలలో ప్రపంచంలోనే అత్యంత అధ్వాన్నంగా ఉన్నాం మనం. విద్య, ఆరోగ్యం లేని దేశంలో పేదరికం, వివక్ష ఎలా పోతాయి, అందరికీ సమాన ఎదుగుదల అవకాశాలు ఎలా లభిస్తాయి?.. పరిమిత వనరుల్ని అపరిమిత ప్రజల అవసరాల మధ్య సమన్వయంతో వినియోగించి అందరికీ ఎదిగే అవకాశాలను అందించటానికి బదులు పరిమిత ప్రజలకే పంచే ప్రయత్నం చేయటం ద్వారా ఈ దేశాభివృద్ధికి మోదీయే పరిమితులు పెట్టేశారు.

అలాగే గత ప్రభుత్వాలలాగే మోదీ సర్కారు అధికారాన్ని కేంద్రీకరించటం, వీలున్న చోట పూర్తిస్థాయిలో గుప్పెట్లో పెట్టుకోవటం వల్ల ప్రజలకు సకాలంలో, సరైనరీతిలో ప్రభుత్వ సేవలు అందటం లేదు. రోజువారీ పనులు చేసుకోవటానికి కూడా తీవ్ర ప్రయాసకు గురికావాల్సి వస్తోంది. కీలకాంశాలలో రాష్ట్రాలకు కూడా స్వేచ్ఛ లేకపోవటం వల్ల ఆర్థిక సంస్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం కూడా పరిమిత ఫలితాలనే ఇస్తున్నాయి.

ఈదేశంలో చిన్నచిన్న విషయాలలో నిర్లక్ష్యం వల్ల చాలా నష్టం జరుగుతున్న మాట వాస్తవం. కానీ ఆ నిర్లక్ష్యాన్ని సరిచేసి కిందిస్థాయిలో రోజువారీ సమస్యల పరిష్కారం బాధ్యతను కూడా ప్రధానే తీసుకోవటం వల్ల ఫలితాలు రావు. అధికారాన్ని వికేంద్రీకరించి స్థానికంగా నిధుల్ని, అధికారాల్ని అందించి ప్రజల భాగస్వామ్యంతో పనులు జరిగేలా చూడాలిగానీ పంచాయతీలో ఏం చేయాలో ప్రధాని బోధించటం వల్ల ఫలితం ఉండదు. ఒక ఊళ్లోనో, వార్డులోనో, చివరికి ఓ రాష్ట్ర స్థాయిలో జరిగే పనుల్ని కూడా ప్రధాని పర్యవేక్షించలేరు. అలాగే ప్రధాని ఘనంగా చెప్పుకుంటున్న డిజిటల్ ఇండియా, వంటగ్యాస్, విద్యుత్తు కనెక్షన్లు వంటి వాటిని టెక్నోక్రాట్లు కూడా చేసేయగలరు. ఆధార్ వ్యవస్థను అలాగే నిర్మించారు. కాబట్టి ప్రధానికి ముందు తన బాధ్యతల పట్ల స్పష్టత ఏర్పడి, వాటి అమలుకు తగిన పాలనా, రాజకీయ వ్యవస్థ నిర్మాణానికి సంస్కరణలు తెస్తే తప్ప భారతదేశం సరైన కక్ష్యలోకి ప్రవేశించలేదు.

భారత్ వంటి సువిశాల, సంక్లిష్ట భిన్నత్వ దేశంలో ఢిల్లీలో కూర్చుని ప్రజల సమస్యలను పరిష్కరించటం ఎంత చిత్తశుద్ధి ఉన్నా కూడా సాధ్యం కాదని ప్రధాని ఇకనైనా గుర్తించాలి. అధికారాన్ని వికేంద్రీకరించి, ఎన్నికలలో ప్రజలు రాష్ట్రాల పాలనను చూసే ఓట్లు వేస్తున్నందున రాష్ట్రాలకు మరిన్ని అధికారాలను, పాలనా వెసులుబాటును ఇవ్వాలి. అదేసమయంలో స్థానిక ప్రభుత్వాలకు నేరుగా నిధుల్ని, అధికారాల్ని ఇచ్చే ఏర్పాటు ఉండాలి. లోక్‌సత్తా కృషి వల్ల స్థానిక ప్రభుత్వాలకు కేంద్రం ఇచ్చే వాటా సుమారు 2,50,000కోట్లకు పెరిగినా అది చాలదు. రాష్ట్రాలకు రూ.30-40లక్షల కోట్లు బదిలీ అవుతున్నప్పుడు కనీసం 8-9లక్షల కోట్లు స్థానిక ప్రభుత్వాలకు వెళ్లాలి. ఈ రకంగా రాష్ట్రాలకు, స్థానిక ప్రభుత్వాలకు వికేంద్రీకరణ జరిగితే ఇప్పుడు పాలనకు, రాజకీయానికి బైట ఉన్న 80శాతం మంది ప్రజలు కూడా భాగస్వాములై ప్రతి పథకాన్నీ విజయవంతం చేస్తారు. భారతదేశ నిజమైన పరివర్తన సాధ్యమవుతుంది. మోదీ ప్రభుత్వం వచ్చీరాగానే ప్రవేశపెట్టిన 'స్వచ్ఛ భారత్' కార్యక్రమానికి లోక్‌సత్తా కూడా మద్దతిచ్చింది. ఎందుకంటే లోక్‌సత్తా ప్రారంభం నుంచి పారిశుద్ధ్యం, మరుగుదొడ్ల నిర్మాణాన్ని ఒక ప్రధానాంశంగా ప్రచారం చేస్తూ వచ్చింది. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్‌తోపాటు పార్టీ సీనియర్ నేతల్లో కొందరు ఎంపిక చేసిన గ్రామాలలో మరుగుదొడ్ల నిర్మాణాన్ని రెండు దశాబ్దాల క్రితమే చేశారు. ఈ నేపథ్యంలోనే మరుగుదొడ్ల నిర్మాణంతో మొదలుపెట్టి ఈదేశంలో ప్రక్షాళన కొనసాగాలన్న ఆకాంక్షతో స్వచ్ఛ భారత్‌ను ప్రోత్సహించినా, మోదీ ప్రభుత్వం

ఆ కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యానికి అవకాశం లేకుండా రూపొందించటంతో అది విఫలమైంది.

సినిమాల్లోనో, అలాంటి మరోరంగంలోనో తప్ప నిజజీవితంలో ఎక్కడా ఈదేశానికి తగ్గ హీరోయిజంలేకపోయినా రాజకీయ కారణాలతో బ్రాండ్ అంబాసిడర్లుగా నియమితులవుతున్న సెలబ్రిటీలు మినహా ఎవరూ స్వచ్ఛ భారత్ సక్సెస్ అయిందని చెప్పరు. ఎన్ని వేలకోట్లు ఖర్చుచేశారు, చివరికి వచ్చిన ఫలితమెంత? ! రాష్ట్రాలకు, స్థానిక ప్రభుత్వాలకు అధికారాన్ని వికేంద్రీకరించి జనం చేతికి సాధికారత ఇచ్చి ఉంటే స్వచ్ఛ భారత్ పెద్ద విజయం సాధించివుండేది. అక్కడ తప్పు జరిగితే అంబుడ్స్‌మన్ వ్యవస్థతో ప్రభుత్వం చర్యలు తీసుకోవచ్చు. అంతేతప్ప పంచాయతీలో స్వచ్ఛ భారత్‌ను ఎలా అమలుచేయాలో కేంద్రప్రభుత్వం ఆదేశాలిస్తే, ఓ సెలబ్రిటీ పాల్గొంటే సమస్య పరిష్కారమవదు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలను సమర్థవంతంగా సాధించిన సంస్థగా ప్రధానే స్వయంగా అనేకమార్లు ప్రశంసించిన 'ఇస్రో' కేవలం జవాబుదారీతనమున్న అధికార వికేంద్రీకరణ, స్వతంత్ర ప్రతిపత్తి వల్లే ఈ విజయాల్ని సాధించగలిగింది.

ఈ కీలకాంశాలను విస్మరించటంతోపాటు పేదరిక నిర్మూలనకు, అందరికీ ఎదిగే అవకాశాలకు కీలకమైన అవినీతి అంతం, ఎన్నికల, న్యాయ సంస్కరణల విషయంలో కూడా మోదీ ప్రభుత్వం రికార్డు పేలవంగా ఉంది.

పశ్చిమ బెంగాల్‌లో శారదా కేసు కావచ్చు, తెలుగు రాష్ట్రాలో ఓటుకు కోట్లు కేసు కావచ్చు, అగస్టా ముడుపులు కావచ్చు.. రాజకీయ అవసరాల కోసం మాట్లాడటమే తప్ప వాటి మీద విచారణ జరిపి చర్యలు తీసుకునే యంత్రాంగం తన చేతుల్లోనే ఉందన్న విషయాన్ని మర్చిపోయినట్టు ప్రధాని వ్యవహరిస్తున్నారు. పనామా పత్రాల లీకుపై మోదీ స్పందనే లేదు. సాధారణ అవినీతి కేసుల విచారణకు లోక్‌పాల్ నియామకం, పటిష్ట యంత్రాంగం ఏర్పాటుపై ధ్యాసే లేదు. అవినీతి నిరోధక చట్టానికి ప్రతిపాదించిన '17 ఎ', గతిలేక లంచం ఇచ్చిన ప్రజలపై కేసులు వంటి సవరణలు అవినీతిని పెంచే విధంగా ఉన్నాయి. దీనిపై డా॥ జేపీ ఇప్పటికే మోదీకి లేఖ రాశారు, పార్లమెంటరీ కమిటీకి కూడా వివరించారు. మోదీ తాను వ్యక్తిగతంగా అవినీతికి పాల్పడకపోయినా అవినీతిపరులపై విచారణ, చర్యల విషయంలో, అవినీతి నియంత్రణ విషయంలో ఇప్పటివరకూ సాధించిందేమీ లేదు.

చట్టాల అమలులో వైఫల్యాలు, జాప్యాలు, అధికారుల వేధింపులు, లంచాల నుంచి ప్రజలను విముక్తి చేసి మెరుగైన సేవలను అందించేందుకు మోదీ ఆలోచనే చేస్తున్నట్టు కనిపించదు. ప్రభుత్వోద్యోగులకు జీతాలు పెంచటానికి హడావుడిపడుతున్నారుగానీ ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అవినీతి లేకుండా సేవలందించేందుకు లోక్‌సత్తా రూపొందించి పార్లమెంటు ముందున్న 'సర్వీస్ గ్యారంటీ' బిల్లును వేగంగా చట్టం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఉత్సాహం చూపటం లేదు.

అలాగే రిజర్వేషన్లు, ఎన్నికల్లో ప్రచారానికి నల్లడబ్బు సేకరణ, ఎన్నికయ్యాక యథేచ్ఛగా ఫిరాయింపులు వంటి కీలకాంశాలలో యథాస్థితిని కొనసాగించేలాగానే మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఉన్నత న్యాయమూర్తుల నియామకంలో పారదర్శకతకు, ప్రజాస్వామిక విలువలకు లోక్‌సత్తా కృషితో ఏర్పాటైన జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ (ఎన్‌జేఏసీ)ని సుప్రీంకోర్టు రాజ్యాంగ విరుద్ధంగా కొట్టివేసినా స్పందించే శక్తి మోదీ సర్కారులో కొరవడింది. న్యాయసంస్కరణలకు అందివచ్చిన స్థానిక న్యాయాలయాలు, ఎన్‌జేఏసీ వంటి అవకాశాలను జారవిడుస్తూ వేదికల మీద న్యాయవ్యవస్థ సమస్యల మీద సెంటిమెంట్ ఉపన్యాసాలిచ్చి ఉపయోగమేంటి?

కీలక చట్టాలు తేవటానికి రాజ్యసభలో మెజారిటీ లేకపోవటం ఆటంకంగా ఉందని మోదీ సర్కారు ఫిర్యాదులు చేస్తూ నానుస్తుంటే, ఆర్థికాంశాలతో ముడిపడిన బిల్లులపై లోక్‌సభకు తప్ప రాజ్యసభకు ఎటువంటి అధికారాలు లేకుండా సవరణ చేయాలని లోక్‌సత్తా నిర్మాణాత్మక సూచననిచ్చినా పెడచెవిన పెట్టారు. రాజ్యసభలో బలం పెంచుకోవటం సాకుతో రాష్ట్రాల్లో బీజేపీని గెలిపించే కార్యక్రమానికి ప్రధాని మితిమీరిన ప్రాధాన్యం ఇవ్వటం వల్ల చేపట్టటం వల్ల ఈదేశానికి చాలా సమయం వృధా అయింది.

ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మొండిబకాయిలు పెరగటం, వాతావరణ మార్పులు వంటి సమస్యలపై మోదీ ప్రభుత్వం ఇంకా సమర్థవంతంగా స్పందించాల్సి ఉంది.

ప్రణాళికా సంఘంలో ఏర్పడిన నీతి ఆయోగ్ ఏం చేస్తుందో ఇప్పటికీ స్పష్టత లేదు. తెలుగు రాష్ట్రాలకు విభజన చట్టంలో, పార్లమెంటులో, ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలకు దిక్కులేదు. ఏపీ ప్రత్యేక హోదాపై, వెనకబడిన జిల్లాలకు నిధులపై కేంద్రప్రభుత్వ తీరు ఫెడరలిజాన్ని బలహీన పరిచేలా ఉంది. కేంద్రమే ప్రకటించిన సహకార సమాఖ్య స్ఫూర్తికి తగ్గట్టు ఎక్కడా వికేంద్రీకరణ లేదు. రాష్ట్రాలకు నిధులు పెరిగాయిగానీ విద్య, ఆరోగ్యం సహా పలు కీలకరంగాలలో సమూల మార్పులకు వాటి చేతిలో అధికారాలు లేవు. ప్రధానిని మెప్పిస్తే, బీజేపీని గెలిపిస్తేనే రాష్ట్రాలకు నిధులు అనే భావనను ప్రోత్సహించటం తగదు.

మరోవైపు రామాయణంలో పిడకలవేటలాగా విశ్వవిద్యాలయాల్లో, ప్రజల ఆహారపు అలవాట్లలో అనుచిత జోక్యాలు. నీకు నీ దేశం గొప్పా, మతం గొప్పా అనే ప్రశ్నను దేశభక్తి గలవారెవరన్నా లేవనెత్తుతారా? ఈరకంగా ఏర్పడే ఓటుబ్యాంకుల చుట్టూ రాజకీయంతో ఏరకంగా ఆధునిక ప్రజాస్వామిక పాలనను అందించగలరు?

ఏతావాతా, ఒక్క ఆర్థికరంగంలో మినహాయించి, ప్రధాని కార్యాలయంలో ఫైళ్లు వేగంగా కదలటం మినహాయించి మిగతా రంగాల్లో యథాస్థితికే మోదీ ప్రభుత్వం ఆకర్షణీయ రంగులు


వేస్తోంది. దీనివల్ల దేశంలోని 80శాతం మంది ప్రజలకు అవకాశాలు అందకుండా పోయి ఇప్పటికే ఉన్న ఆర్థిక, సామాజిక అసమానతలు తీవ్రతరమవుతాయి. ప్రజలకు పాలనలో, రాజకీయాలలో భాగస్వామ్యం పెరగకపోవటం వల్ల ప్రజాస్వామ్యం పేరుకు మాత్రమే కొనసాగుతూ విపరీత ప్రాంతీయ, తాత్కాలిక ధోరణులకు దారితీస్తుంది. చివరికి ఇది దేశసమగ్రతకే ప్రమాదకరంగా పరిణమిస్తుంది. భారత్‌కున్న అవకాశాలు పరిమితం కాబట్టి ఇప్పుడున్నట్టు కొద్దిమందికే మంచి చదువులు, ఆరోగ్యం, వేగంగా ఎదిగే అవకాశాలు అందుతాయి, మిగతావారు వారి అభివృద్ధి చుట్టూ ద్వితీయ శ్రేణి పౌరుల్లా తిరగాలి అనే పంథాను ప్రధాని అనుసరించటం సరికాదు. పైస్థాయిలోని 10-20శాతం మందికి గొప్ప అవకాశాలు, మిగతావారికి చిట్కాలు, చిన్నచిన్న స్కీములు, పరిమిత బీమా సౌకర్యం అందిస్తే చాలని ప్రధాని భావించటం తగదు. వ్యవస్థను మార్చి ఆర్థికాభివృద్ధిని కొందరికే పరిమితం చేసే విధానాల స్థానంలో సంపద సృష్టిలో అందరికీ భాగస్వామ్యం కల్పించే విధానాలను మోదీ ప్రభుత్వం అనుసరించాలి. దేశంలో పుట్టుకతో అవకాశాలు అందుకుంటున్నవారికంటే తెలివైనవారు అవకాశాలు అందుకోలేని 80శాతంలో బోలెడు మంది ఉన్నారు. వారందరికీ ఎదిగే అవకాశాలు ఇస్తేనే దేశం సుస్థిర అభివృద్ధిని సాధిస్తుంది. అప్పుడు ప్రతి ఒక్కరూ కోట్లు సంపాదించనక్కర్లా, కానీ అందరికీ తలెత్తుకుని బతికే మంచి జీవితం లభిస్తుంది. అంతేతప్ప, పైస్థాయిలో సంపదసృష్టికి కొద్దిమందికి అవకాశాలు కల్పించటంతోపాటు దిగువస్థాయిలో అత్యధిక సంఖ్యాక ప్రజలకు చిట్కాలు, సలహాలుసూచనలు ఇవ్వటమే తన పని అని ప్రధానమంత్రి ఇప్పుడు అనుసరిస్తున్న విధానం వల్ల దేశం చాలా నష్టపోతుంది.

కాబట్టి ప్రధానమంత్రి ఆర్థికరంగంలో విజయవంతమైన తన విధానాలను కొనసాగిస్తూనే, మిగతా అన్ని రంగాలలో పాలనను సరిదిద్దుకోవాలి. నమూనాను, ప్రాథమ్యాలను మార్చుకుని అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ప్రజలకు భాగసామ్యం ఇచ్చేందుకు రాష్ట్రాలకు, స్థానిక ప్రభుత్వాలకు అధికార వికేంద్రీకరణ, పెద్దఎత్తున ఉద్యోగాల సృష్టి తదితర అంశాల మీద దృష్టి కేంద్రీకరించాలి. ఏదోకరకంగా జరుగుతున్న ఎన్నికల వ్యవస్థనే ప్రశ్నార్థకం చేస్తున్న ఎమ్మెల్యేల ఫిరాయింపులకు అవకాశం లేకుండా ముఖ్యమంత్రులను ఓటర్లే నేరుగా ఎన్నుకునేలా ప్రత్యక్ష ఎన్నికల పద్ధతిని ప్రవేశపెట్టాలి. ఐఏఎస్ అధికారుల వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసి సమాజంలో లోతైన అవగాహన, సేవా నేపథ్యం ఉన్నవారిని కూడా విధానాల రూపకల్పనలో భాగస్వాముల్ని చేసే ఉన్నతోద్యోగ వ్యవస్థను రూపొందించాలి. ప్రభుత్వోద్యోగంలో రిటైరవటమే తప్ప తొలగించటం ఉండదు అనే విధానాన్ని తొలగించాలి. కార్మిక విధానాల సంస్కరణను వేగవంతం చేసి దేశంలోని అసంఘటిత రంగ కార్మికులను సంఘటిత చట్రంలోకి తెచ్చి జీవన భద్రతను కలిగించాలి. నైపుణ్యాలకు, పనితీరుకు ప్రోత్సాహకాలను అమలుచేయాలి. ఇటీవల కేంద్రప్రభుత్వ సంస్థ లేబర్ బ్యూరో జరిపిన సర్వేలో ఎనిమిది కీలక ఆర్థిక రంగాలలో 2015లో వచ్చిన ఉద్యోగాలు గత ఏడేళ్లలోనే అతి తక్కువ అని తేలింది. ఏటా మనకు రెండు కోట్ల ఉద్యోగాలు కావాల్సి ఉంటే, ఈ రంగాలలో కేవలం 1,35,000 ఉద్యోగాలు వచ్చాయి. ఇదే ఒరవడి కొనసాగితే యువశక్తి ఒక అవకాశంగా ఉండాల్సిందిపోయి సంక్షోభంగా తయారవుతుంది. ఆ తర్వాత దేశం వృద్ధాశ్రమంలా తయారవుతుంది. కాబట్టి పెట్టుబడులు, ఉద్యోగాలు, విద్య, ఆరోగ్యం, ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలు తదితర కీలకాంశాలలో గణాంకాలను రహస్యాలు లేకుండా ఖచ్చితంగా ఎప్పటికప్పుడు ప్రజల ముందుంచి అవసరమైన మార్పుల్ని చేపడుతుండాలి. గ్రామాలకు-పట్టణాలకు మధ్య అంతరాన్ని తగ్గిస్తూ వ్యవసాయ అనుబంధ, వ్యవసాయేతర రంగాలలో పెద్దఎత్తున ఉపాధి అవకాశాల కోసం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. మేకిన్ ఇండియా ద్వారానో, మరోరూపంలోనో చైనా ఆర్థికవ్యవస్థలో శూన్యాన్ని భారత్ తనకనుకూలంగా ఉపయోగించుకోవాలి. చిన్న, మధ్యతరగతి పరిశ్రమలను భారీగా ప్రోత్సహించటంతోపాటు రోబో కార్మికుల సమస్యను అధిగమించేందుకు ఇప్పటి నుంచే ప్రయత్నాల్ని ప్రారంభించాలి.

మోదీ చెబితే శాసనమే అనే స్థాయిలో ఆయన ఈదేశ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఎలాంటి రాజ్యాంగ సవరణనైనా తేగలిగే అవకాశం, ఆమోదం ఆయనకు అప్పుడు ఉంది. కానీ సృజనాత్మక పరిష్కారాలతో ఆ అవకాశాల్ని సద్వినియోగం చేసుకునేందుకు ఆయన ప్రయత్నం చేయకపోవటంతోపాటు అనవసర వివాదాలు, చిట్కాల చుట్టూ సమయాన్ని వృథా చేయటంతో ఇప్పుడు అవకాశాలు, సమయం పరిమితమయ్యాయి. మోదీ చెప్పారు కాబట్టి.. అని ఆమోదించే పరిస్థితి లేదిప్పుడు. ప్రభుత్వం కేవలం ఆర్థికానికే పరిమితమవటానికి మనదేశంలో మిగతా కీలక వ్యవస్థలన్నీ బాగా అభివృద్ధి చెందిన దేశాల్లోలా పటిష్టంగా లేవు. ఈ వాస్తవం ఎన్నికల సమయంలో గుర్తుంది తప్ప, ప్రభుత్వం ఏర్పడ్డాక ఆచరణలో కనిపించటం లేదు. మోదీ ప్రభుత్వం ఇక ఏ మాత్రం ఆలస్యం లేకుండా విద్య, ఆరోగ్యం, వికేంద్రీకరణ, ఉద్యోగాలు, అవినీతిలేని ప్రభుత్వ సేవలు తదితర మౌలికాంశాలను తన ప్రధాన ఎజెండాలోకి తీసుకుంటుందని ఆశిస్తూ, ఢిల్లీ చుట్టూ తిరగాల్సిన అవసరం లేని నిజమైన రిపబ్లిక్‌గా దేశ నిర్మాణాన్ని వేగవంతం చేసే ఈ సంస్కరణల్లో తన వంతు పూర్తి సహాయసహకారాలను అందిస్తానని ఎటువంటి పదవులు లేకపోయినా ప్రజాజీవితంలో కొనసాగుతున్న లోక్‌సత్తా తెలియచేస్తోంది. ▪

# గుజరాత్ మోదీ, న్యూఢిల్లీ మోదీ

**- రామచంద్ర గుహ,**
చరిత్రకారుడు



గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్ర మోదీ, ఆ రాష్ట్రానికి సర్వాధినేతగా వ్యవహరించారు. రాష్ట్ర మంత్రిమండలిపై ఆయనకు పూర్తి నియంత్రణ ఉండేది. వివిధ మంత్రిత్వ శాఖల కార్యదర్శులతో ఆయన రోజూ సమావేశమై సంప్రదింపులు జరిపేవారు. కొత్త మదుపులను ఆకట్టుకోవటం, మరింత మెరుగైన రోడ్ల నిర్మాణం, రైతులకు సాగునీరు, విద్యుత్తు సమృద్ధిగా అందేలా చూడటం మొదలైన అంశాలపై మోదీ తన దృష్టిని కేంద్రీకరించేవారు. ఈ రంగాలలో మదుపులు చేసేవారు. ఎవరైనా తనతో నేరుగా సంప్రదించేందుకు మోదీ అవకాశం కల్పించారు. అధికారులతో ఏవైనా సమస్యలు ఏర్పడితే నేరుగా తనకు ఫోన్ చేయమని ప్రత్యేక సెల్ నెంబర్ కూడా అందరికీ ఇచ్చారు. నిరంతరం అందుబాటులో ఉండటం ద్వారా పారిశ్రామికవేత్తలకు మోదీ ఆరాధ్యుడయ్యారు.

అయితే ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ, భారత ప్రభుత్వ కార్యకలాపాలపై పూర్తిస్థాయి నియంత్రణ సాధించలేక పోతున్నారు. వివిధ మంత్రిత్వ శాఖలు తమ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నాయి. తమ నిర్ణయాలు, చర్యలు భారత ప్రభుత్వ, దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నప్పటికీ పలువురు మంత్రులు తమకు తోచినరీతిలో వ్యవహరించడానికి వెనుకాడటం లేదు. వివిధ మంత్రిత్వ శాఖల్లో పలు ఉన్నతస్థాయి ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. వాటిని భర్తీ చేయడంలో నెలల తరబడి జాప్యం జరుగుతోంది. ఎందుకో తెలుసా? సంబంధిత ఫైళ్లను పరిశీలించి సంతకం చేసేందుకు మోదీకి తగు వ్యవధి లభించకపోవడమే!

ముఖ్యమంత్రిగా మోదీ వ్యవహరించిన తీరుకు, ఇప్పుడు ప్రధానమంత్రిత్వ బాధ్యతలను ఆయన నిర్వహిస్తున్న తీరుకు మధ్య ఉన్న అంతరాన్ని ఎలా వివరించాలి? ఒక స్పష్టమైన వివరణ ఏమంటే, గుజరాత్ కంటే దేశం సువిశాలమైనది. భారతదేశం గుజరాత్ కాదు కదా. రాష్ట్రాలలో ఒక నాయకుడు తన వ్యక్తిత్వ ప్రభావంతో రాజకీయాలు, పాలనా యంత్రాంగంపై తన పట్టును సాధించుకోవచ్చు. అయితే ఇది రాష్ట్రాలలో సుసాధ్యమయినట్టుగా కేంద్రంలో సాధ్యం కాదు. ఎందుకంటే, ఈ దేశం సువిశాలమైనది. ఒక రాష్ట్ర ప్రభుత్వంలో కంటే భారత ప్రభుత్వంలో పలు విభాగాలున్నాయి. అంతేగాక

భారత ప్రభుత్వంలో ఉన్న చాలా విభాగాలకు, మంత్రిత్వ శాఖలకు తుల్యమైన విభాగాలు, మంత్రిత్వ శాఖలు రాష్ట్రాలలో లేవు.

గుజరాత్ ముఖ్యమంత్రిగా సమర్థ పాలకుడిగా పేరు పొందిన మోదీ ఢిల్లీలో ప్రధానమంత్రిగా పాలనాదక్షత చూపించలేకపోవడానికి కారణాలు ఏమిటి? దేశం సువిశాలమైనది కావడంతోపాటు, దేశ పాలనలో ఆయనకు గత అనుభవం లేకపోవడమేనని చెప్పవచ్చు. మరో కారణం కూడా ఉన్నది. ఇది, మొదటి రెండింటి కంటే ముఖ్యమైనది. మోదీ వ్యక్తిత్వంలో మార్పురావడమే ఈ మూడో కారణంగా చెప్పవచ్చు.

ప్రధానమంత్రిగా తన మొదటి సంవత్సరంలో మోదీ ఇంచుమించు 30 దేశాలలో పర్యటించారు. విదేశీ పర్యటనలకు వెళ్లనప్పుడు న్యూఢిల్లీలో ఉండేవారా అంటే అదీ లేదు. దేశంలో ఉన్నప్పుడు అత్యధిక భాగాన్ని ఎన్నికల ప్రచారానికే వినియోగించేవారు. ఆయన సభలకు ప్రజలు తండోపతండాలుగా వచ్చేవారన్నది సత్యం. ఇది ఆయన అహాన్ని బాగా సంతృప్తిపరచేది. మరి న్యూఢిల్లీకి వెలుపలే అత్యధిక సమయాన్ని గడపడమంటే తన మంత్రులు, ఎంపీలతో అంతగా సంబంధాలు లేకుండా ఉండటమే గదా. దీంతో మంత్రులు, ఎంపీలు ఎవరికివారు ఇష్టానుసారం మాట్లాడారు.

దేశపాలనకు ప్రధానమంత్రిగా మోదీ చేసిన ప్రధాన సేవ ఏమిటి? ఆ సేవ మాటల రూపంలోనే ఉందిగానీ చేతల్లో లేదు. గుజరాత్‌లో ఏ అభివృద్ధి కార్యక్రమం అమలులోనైనా ఆయన వ్యక్తిగత శ్రద్ధ చూపేవారు. ఢిల్లీలో పలు నినాదాలను ఇచ్చారు. అవి ప్రజలకు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయన్నది నిజం. అయితే అవి ఎంతవరకు ఆచరణలోకి వస్తున్నాయన్నది ప్రశ్నార్థకమే. ప్రణాళికాసంఘాన్ని రద్దు చేశారు. దాని స్థానంలో నీతి ఆయోగ్‌ని ఏర్పాటు చేశారు. ఈ కొత్త సంస్థను ఎందుకు ఏర్పాటు చేశారో, అదేమీ చేస్తుందో స్పష్టంగా తెలియదు (2016-17 కేంద్ర బడ్జెట్‌ను రూపొందించటంలో నీతి ఆయోగ్‌ని సంప్రదించకపోవటం గమనార్హం).

దేశాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి 'స్వచ్ఛ భారత్ అభియాన్'ని ప్రారంభించారు. ప్రధాని నియోజకవర్గమైన వారణాసి నగరం ఇప్పటికీ దేశంలో పది మురికి ప్రదేశాలలో ఒకటిగా ఉంది! ప్రకటించిన కార్యక్రమాల అమలు ఏవిధంగా ఉన్నదో సమీక్షించడంపై ప్రధాని మోదీ శ్రద్ధచూపడం లేదు. ఆయన శ్రద్ధ అంతా ఎప్పటికప్పుడు కొత్త కార్యక్రమాలను ప్రకటించడంపైనే అనడం సత్యదూరం కాదు.

నరేంద్ర మోదీ వక్తృత్వ ప్రతిభ సభలు, సదస్సుల ప్రారంభోపన్యాసాలు, స్నాతకోపన్యాసాలు, ఎన్నికల ప్రసంగాలు చేయడానికి బాగా ఉపయోగపడుతోంది. అయితే దేశాన్నికకుదిపేస్తున్న మతోన్మాద, కులతత్వ హింసాకాండ, వ్యవసాయరంగంలో విషాదాలు, విశ్వవిద్యాలయాలపై దాడులు మొదలైన సమస్యల గురించి ఆయనేమీ మాట్లాడటం లేదు. ఏ అంశాలలో ప్రధానమంత్రి జోక్యం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారో ఆ అంశాలపై ఆయన మౌనం వహిస్తున్నారు.

ఇటీవల ఒడిషాలో ఒక సభలో మాట్లాడుతూ, తనను అప్రతిష్ఠ పాలుచేయడానికి కుట్ర జరుగుతోందని మోదీ ఆరోపించారు. చాయ్‌వాలాగా జీవితాన్ని ప్రారంభించిన వ్యక్తి ప్రధానమంత్రి స్థాయికి ఎదగడాన్ని సహించలేకపోతున్నారని ఆయన అన్నారు. మీడియాలో ఇటీవల తనపై విమర్శలు వెల్లువెత్తుతుండటం వల్లే ఆయన ఈ విధంగా ఆక్రోశించారు. ఎన్నికల ప్రచార సభలలో తాను ఇస్తున్న హామీలకు, తన ప్రభుత్వం చేస్తున్న పనులకు మధ్య, అలాగే తను ఇస్తున్న నినాదాలకు, సామాన్య ప్రజల నిత్యజీవిత వాస్తవాలకు మధ్య కూడా పొంతన లేకపోవడం వల్లే తనపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయని మోదీ గుర్తించారా?

'మీడియా దృష్టిలో ఉండాలని ఆశించడం విద్వత్ కృషికి దోహదం చేయదని' ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త ఎం.ఎన్ శ్రీనివాస్ ఒకసారి ఈ వ్యాస రచయితతో అన్నారు. విద్యావేత్తలు, మేధావుల కంటే రాజకీయ నాయకులు సదా వార్తల్లో ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయితే శక్తిమంతులైన ప్రధానమంత్రులు కానివ్వండి లేదా విశ్వవిద్యాలయాల ఆచార్యులు కానివ్వండి ప్రచారానికి ప్రలోభపడితే అది ప్రయోజనకరమైన కృషికి ఆటంకమవుతుందని సహేతుకంగా చెప్పవచ్చు. గాంధీనగర్ నుంచి న్యూఢిల్లీ వచ్చిన తరువాత నరేంద్ర మోదీ తన బాధ్యతలను నిర్వహిస్తున్న తీరే అందుకు దృష్టాంతమనడంలో సందేహం లేదు.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో...) ◘

# నేల విడిచి సాములేల!

- కె.రామచంద్రమూర్తి

జాతీయస్థాయిలో ప్రధానమంత్రి కానీ, రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు కానీ మాట్లాడేతీరు చూసినవారిని ఆశ్చర్యం, ఆగ్రహం ఏకకాలంలో ఆవహిస్తాయి. దేశం సుభిక్షంగా ఉన్నట్టూ, అద్భుతమైన ప్రగతి జరుగుతున్నట్టూ, ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నట్టూ ప్రధాని మాట్లాడుతుంటే, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఉగాది పండుగ సందర్భంగా పంచాగ శ్రవణంతో ఆనందించి తమ పరిపాలన జనరంజకంగా ఉన్నట్లు భావిస్తున్నారు. బంగారు భవిష్యత్తు కావాలంటే భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కే ఓటు వేయాలంటూ ఎన్నికల సభలో అసోం ప్రజలకు నరేంద్ర మోదీ ఉద్బోధించారు. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్-టీఎంసీలో- టీ అంటే టెర్రర్ (ఉగ్రవాదం), ఎం అంటే మౌత్ (మృత్యువు), సీ అంటే కరప్షన్ (లంచగొండితనం) అంటూ మోదీ అభివర్ణిస్తే బీజేపీని భయానక్ జలీ పార్టీ (డేంజరస్‌లీ ఫ్రాడ్ పార్టీ-ప్రమాదకరమైన మోసకారి పార్టీ) అంటూ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బదులిచ్చారు. వీరిద్దరి ప్రసంగాలనూ పరిశీలించాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించి సీడీలను తెప్పించుకున్నది. ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రంలో సైతం వాస్తవ పరిస్థితుల గురించీ, ప్రజల జీవనస్థితిగతుల గురించీ చర్చించకుండా నోటికొచ్చిన నిందారోపణలు చేయటం, వాటికి దీటుగా సమాధానాలు చెప్పటం ఆశ్చర్యం కలిగిస్తుంది. నాలుగైదు సంవత్సరాల తర్వాత రైతులు ఆత్మహత్య చేసుకునే అవసరమే ఉండదంటూ తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు (కేసీఆర్) ప్రకటించారు. ఇసుకపైన ఆంక్షలు ఎత్తివేస్తున్నామనీ, ప్రజలు ఇసుక ఉచితంగా తీసుకుని ఇళ్లు కట్టుకోవచ్చునంటూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ముఖ్యనేతల మాటలు విన్నవారికి కరువుతో ప్రజలు అలమటిస్తున్నదీ, రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నదీ ఈదేశంలోనేనా అనే అనుమానం కలుగుతుంది. బంగారం కుదువపెట్టి పశుగ్రాసం కొంటున్న రైతులూ, నీళ్ల ట్యాంకర్ల దగ్గర పోలీసు పహారా ఏర్పాటు చేసిన ప్రభుత్వాలూ ఉన్న దేశంలో ప్రధానమంత్రిగానీ, ముఖ్యమంత్రులుగానీ కరువు గురించి అంతగా పట్టించుకున్నట్టు కనిపించకపోవటం ఆగ్రహం కలిగించటం సహజం

### మరాత్వాడా విలవిల

మహారాష్ట్రలోని మరాత్వాడాలో మూడు సంవత్సరాలుగా వరస కరువు కాటేస్తుంటే ప్రజలు విలవిలలాడుతున్నారు. 1971-72 నాటి కరువు తర్వాత అంతటి తీవ్రమైన అనావృష్టి పరిస్థితులు ఇప్పుడు దాపురించాయి. జాతీయ గ్రామీణ ఉపాధి పథకానికి (నరేగా) మాతృక (మహారాష్ట్ర ఎంప్లాయిమెంట్ గ్యారంటీ యాక్ట్) 1977లోనే రూపొందింది. మూడు సంవత్సరాల వరస దుర్భిక్షం కారణంగా బోర్లు వేసినా నీరు లేదు. ముఖ్యంగా లాటూరు పట్టణానికి డొంగార్గాం డ్యామ్ నుంచి ట్యాంకర్ల ద్వారా నీరు రవాణా చేయటాన్ని రైతులు వ్యతిరేకిస్తున్నారు. రైతులు దాడులు చేయకుండా ట్యాంకర్లను రక్షించేందుకు ప్రభుత్వం పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసింది. లాటూరులో నీరు సరఫరా చేసే ప్రాంతాలలో జనం పోట్లాడుకోకుండా నివారించేందుకు 144వ సెక్షన్ కింద నిషేధాజ్ఞలు విధించారు. వానలు పడనప్పుడు, భూగర్భ జలాలు అడుగంటినప్పుడు ఏమి చేయాలో పాలుపోని ప్రభుత్వం నిస్సహాయస్థితిలో పడిపోయింది. ఒక్క లాటూరు జిల్లాలోనే 2015లో 106మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంవత్సరం గడిచిన మూడు మాసాలలో 34మంది ప్రాణాలు తీసుకున్నారు. దిగులుగా కనిపించిన రైతులలో ధైర్యం నింపటానికి 'బేర్‌ఫుట్ సైకాలజిస్టులు' (మానసిక శాస్త్రవేత్తలు) వెలిశారు. ప్రతి రైతునూ కలిసి ఆత్మవిశ్వాసం కలిగించేందుకు విశ్వవిద్యాలయాల అధ్యాపకులూ, విద్యార్థులూ గ్రామాలలో పర్యటిస్తున్నారు. ఔరంగాబాద్‌లోని శ్రీరామానాందతీర్థ సంశోధన్ సంస్థాన్ రైతు ఆత్మహత్యలకు దారితీసిన పరిస్థితులను అధ్యయనం చేసి నివారణోపాయాలను సూచించే పనిలో మునిగివుంది. ప్రభుత్వం, పౌరసమాజం కొంతమేరకు స్పందిస్తున్న సూచనలు మరాత్వాడాలో కనిపిస్తున్నాయి.

### భారీ ప్రాజెక్టులపై కసరత్తు

తెలంగాణలో సైతం రైతుల ఆత్మహత్యలు నివారించడం ఎట్లాగో అంతుపట్టని ప్రభుత్వం వాటి గురించి మాట్లాడకుండా

భారీ నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం ఒక్కటే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారమని చెబుతోంది. ప్రాణహిత సహితంగా అనేక ప్రాజెక్టుల ఆకృతిని మార్చే ప్రయత్నంలో ఉన్నది. వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించవలసిన ఈ ప్రాజెక్టులలో ఎన్ని, ఎంతకాలానికి పూర్తవుతాయో తెలియదు. కరువు బాధిత ప్రాంతాలలోని ప్రజలను తక్షణం ఆదుకోవటానికి అవసరమైన చర్యలు తీసుకోవడం ప్రభుత్వ కర్తవ్యం. నిజానికి ప్రభుత్వం యావత్తూ ఈ పనిపైనే శక్తియుక్తులన్నిటినీ కేంద్రీకరించాలి. తెలంగాణలో మొత్తం 438 గ్రామీణ మండలాలు ఉంటే, వాటిలో 231ని కరువు మండలాలుగా ప్రకటించారు. ఇదివరకు ఉపాధిహామీ పథకం నిధులను కేంద్రం నేరుగా గ్రామీణాభివృద్ధి శాఖకు ఇచ్చేది. ఇప్పుడు రాష్ట్రప్రభుత్వం ద్వారా ఈ నిధులు అందచేస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయటంలో జాప్యం జరిగితే పని చేసినవారికి కూలీ వెంటనే అందదు. కూలీ అందకపోతే పనిచేయడానికి పేదలు ఉత్సాహం చూపించరు. ఈ కారణంగా పనిచేసేవారి సంఖ్య తగ్గిపోతుంది. కరువు సాయంగా రూ.2500 కోట్లు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం అభ్యర్థిస్తే కేంద్రం రూ.712కోట్లు ఇవ్వటానికి అంగీకరించింది. కరువు మండలాలలో మంచినీటి సదుపాయం కల్పించడం కోసం రెండు మాసాల కిందట రూ.56కోట్లు కేంద్రం విడుదల చేసింది. ఇటీవలే కరువు కాలంలో చేపట్టవలసిన పనుల కోసం రూ.328కోట్లు ఇచ్చింది. కరువు రక్కసి కోరల నుంచి ప్రజలను రక్షించడానికి తీసుకోవలసిన చర్యలు సంపూర్ణంగా తీసుకుంటున్న దాఖలా లేదు. పరిస్థితి తీవ్రతను ఉన్నతస్థాయిలోని వ్యక్తులు గుర్తించకపోతే దిగువస్థాయి అధికార యంత్రాంగం పట్టించుకోదు. తెలంగాణలో ఉపాధి హామీ పథకం పనులు చేసినవారికి ఆలస్యంగానైనా అందవలసిన మొత్తం అందుతోంది. దేశవ్యాప్తంగా ఈ పథకం కింద వేతనాలను ఈ సంవత్సరం 20శాతం పెంచారు.

ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం కేంద్రం నిర్దేశించిన వేతనం కాకుండా చేసిన పనిని కొలిచి అందుకు తగ్గట్టు కూలీ చెల్లిస్తున్నారు. ఉపాధి పథకం కింద కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు ఇంతవరకూ రూ.3,073కోట్లు మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం దీనికి పదిశాతం జోడించాలి. ఈ మొత్తంలో రూ.1,736కోట్లు సామాగ్రి కోసం ఖర్చు చేశారు. తక్కిన నిధులు నీరు-చెట్టు వంటి కార్యక్రమం కింద, చెరువులకు పూడిక తీసే పనికింద, ఇతర పనుల కింద ఖర్చు చేసినట్టు రాష్ట్రప్రభుత్వం చెబుతున్నది. ఉపాధి పథకం కింద రోజువేతనం రూ.180కాగా, ఆంధ్రప్రదేశ్‌లో చేసిన పనిని బట్టి రూ.127 దాకా ఇస్తున్నారు. సుమారు 83.5లక్షల కుటుంబాలు ఈ పథకం కింద లబ్ధి పొందుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 359 కరవు మండలాలున్నాయి. రూ.2,449 కోట్లు సాయం చేయవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థించగా కేంద్రం మంజూరు చేసిన మొత్తం కేవలం రూ.433 కోట్లు. ఇందులో ఇప్పటివరకూ విడుదల చేసింది రూ.140 కోట్లు. 2015 ఖరీఫ్‌లో వర్షాభావం వల్ల పంటలు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం రూ.730కోట్లు పెట్టుబడి రాయితీ ఇవ్వవలసి ఉండగా పైసా ఇచ్చినట్టు లేదు.

**నిజాయితీ కరువు**

నిధులు మంజూరు చేయటంలో, ఖర్చు చేయటంలో ప్రభుత్వాలకు పరిమితులు ఉండవచ్చు. కానీ కరువుతో తల్లడిల్లుతున్న రైతును ఆదుకోవడానికి ప్రభుత్వాలు శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తున్నాయనే స్పృహ రైతులో ఆత్మవిశ్వాసం పెంచుతుంది. ఈ దిశగా ప్రభుత్వాలు ఆలోచించడం లేదు. నేటి ప్రభుత్వాలే కాదు మునుపటి ప్రభుత్వాలు సైతం రైతుల ఆత్మహత్యలు నివారించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకునే ప్రయత్నం చేయలేదు. స్వామినాథన్ కమిటీ నివేదికను అమలుచేయాలన్న ఆలోచన లేదు. అది సాధ్యం కాదనుకుంటే ప్రత్యామ్నాయ మార్గం అన్వేషించే తాపత్రయం లేదు. ఇప్పటికీ జనాభాలో అరవై శాతం మంది గ్రామీణ ప్రాంతాలలో జీవిస్తున్నారు. వారిలో అత్యధికులు వ్యవసాయంపైనా, అనుబంధ వృత్తులపైనా ఆధారపడినవారే. వ్యవసాయాన్ని గిట్టుబాటు వ్యాసంగం చేసేందుకు చర్యలు తీసుకోవాలంటూ ప్రధాని ఇటీవల కొన్ని సమావేశాలలో మాట్లాడారుగానీ నిర్దిష్టమైన, సమగ్రమైన కార్యక్రమం ఏదీ రూపొందించలేదు. రైతుల కోసం ప్రధాని ప్రకటించిన బీమా పథకాలు వారి జీవితాలలో వెలుగులు నింపటానికి సరిపోవు. జలవనరుల అభివృద్ధి కోసం, వాన నీటిని నిల్వ చేయడం కోసం, వ్యవసాయాన్ని గిట్టుబాటు చేయటం కోసం జాతీయస్థాయిలో ఒక బృహత్ ప్రయత్నం జరగవలసి ఉన్నది. కేంద్ర ప్రభుత్వమే చొరవ తీసుకుని రాష్ట్ర ప్రభుత్వాలన్నిటినీ కూడదీసుకుని కరువు సమయాలలో ప్రజలను ఆదుకోవడానికి కొత్త ప్రణాళిక (మాన్యువల్) తయారుచేయాలి. రైతుల ఆత్మహత్యలను

నివారించడానికీ, వ్యవసాయాన్ని నష్టాల ఊబి నుంచి బయటపడవేయడానికీ తీసుకోవలసిన చర్యల గురించి సుదీర్ఘంగా చర్చించాలి. రైతుల కష్టాలు చూసి చలించిపోయి, ఉద్యమిస్తున్నవారికి కానీ అధికారంలో ఉన్నవారికి కానీ రైతులను ఆదుకోవడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి స్పష్టమైన అవగాహన లేదు. పంట రుణాలను తేలికగా చెల్లించగల కిస్తీలలో వసూలు చేయటం, వ్యవసాయ పెట్టుబడులలో సబ్సిడీ ఇవ్వటం, పశుగ్రాసం సరఫరా చేయటం, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయటం వంటి చర్యలు కొంత ఉపశమనం కలిగించవచ్చునేమోగానీ సమస్యలను సమూలంగా పరిష్కరించజాలవు. ఇందుకోసం రైతు నాయకులూ, రాజకీయ నాయకులూ, వ్యవసాయ, ఆర్థిక శాస్త్రవేత్తలూ, పౌరసమాజ ప్రతినిధులూ సమష్టిగా చర్చించి నిర్ణయాలు తీసుకోవలసిన ఆగత్యం ఉన్నది. ఈ సమస్యను సాకల్యంగా అర్థం చేసుకున్న పాలకులు ఎవ్వరూ ఊకదంపుడు మాటలు పలకలేరు. అరచేతిలో వైకుంఠం చూపించే ప్రయత్నం చేయరు. క్షేత్ర వాస్తవికతను విస్మరించి పలాయనవాదాన్ని ఆశ్రయించరు. ప్రజలను వేధిస్తున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిజాయతీగా, శక్తివంచన లేకుండా కృషి చేసేవారే ప్రజానాయకులు. ఇందుకు భిన్నంగా వ్యవహరించడం, వాస్తవాలను పట్టించుకోకుండా స్వప్న జగత్తులో విహరించడం సబబు కాదని తెలుసుకోవాలి.

(సాక్షి సౌజన్యంతో)

# చదువులో సగటు కంటే దిగువనే తెలుగు రాష్ట్రాలు

దేశవ్యాప్తంగా పదో తరగతి విద్యార్థుల విద్యాసామర్థ్యాలపై జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) చేసిన సర్వేలో తెలుగు రాష్ట్రాలు సగటు కంటే దిగువనే ఉన్నాయి. ఐదు సబ్జెక్టులలో విద్యార్థులను పరీక్షించగా, బాలుర కంటే బాలికలే మెరుగైన ప్రతిభ కనబరిచారు. గణితంలోనూ బాలికలదే పైచేయిగా ఉండటం విశేషం.


ఎన్‌సీఈఆర్‌టీ ప్రతి ఏటా 3, 5, 8 తరగతుల విద్యార్థుల్లో వివిధ పాఠ్యాంశాల్లో పరిజ్ఞానాన్ని పరీక్షించేందుకు దేశవ్యాప్తంగా సర్వే నిర్వహిస్తుంది. మొదటిసారిగా పదో తరగతి విద్యార్థులపై సర్వే చేశారు. దేశంలోని మొత్తం 33 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఆంగ్లం, గణితం, సైన్స్, సాంఘికశాస్త్రం, ఆధునిక భారతీయ భాషలపై 2015లో ప్రత్యేకంగా పరీక్ష నిర్వహించిన ఎన్‌సీఈఆర్‌టీ ఇటీవల నివేదికను విడుదల చేసింది. మొత్తం 7,216 ప్రయివేటు, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 2,77,416 మంది విద్యార్థులను పరీక్షించారు. ఒక్కో రాష్ట్రంలో 358 పాఠశాలల్లో ఈ సర్వే జరిగింది.

**తెలుగు రాష్ట్రాల్లో..**

- జాతీయ సగటు కంటే రెండు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు వెనకబడ్డారు. గణితం సహా అన్ని పాఠ్యాంశాల్లోనూ బాలికలే ముందంజలో ఉన్నారు
- జాతీయస్థాయిలో పట్టణ ప్రాంత విద్యార్థులు ముందంజలో ఉండగా, తెలుగు రాష్ట్రాల్లో మాత్రం గ్రామీణ విద్యార్థులే మెరుగ్గా ఉన్నారు
- జాతీయ స్థాయిలో సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ విద్యార్థులు అన్నివిధాలా ముందుండగా.. తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ ఎయిడెడ్ బడుల కంటే ప్రయివేటు పాఠశాల విద్యార్థులే ముందున్నారు
- విద్యార్థుల స్కోర్‌ను పరిశీలిస్తే తెలంగాణ విద్యార్థులు ఏపీ వారి కంటే మెరుగైన స్థానంలో ఉన్నట్టు స్పష్టమవుతుంది
- 400 పాయింట్లకు గాను 250 వస్తే సాధారణ స్కోరుగా పరిగణించారు

కాగా, రాష్ట్రాల మధ్య పోటీరీతిలో కాకుండా విద్యాప్రమాణాలపై నిర్వహించిన వివిధ ప్రామాణిక సర్వేల్లో మన పాఠశాల విద్యావ్యవస్థ ఇంకా అధ్వాన్నంగానే కొనసాగుతోంది. డిమాండ్ ఉన్న వృత్తివిద్యాకోర్సుల్లో పట్టభద్రులవుతున్నా ఎక్కువశాతం మంది పోటీ ప్రపంచానికి కావలసిన ఉద్యోగ నైపుణ్యాలను అందుకోలేకపోవటానికి సరైన పాఠశాల విద్య లేకపోవటం కూడా ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు.

# జనం జీవితాల ఎత్తు పెంచే పాలన కోసం ఇంకా ఎదురుచూపులే వంశపారంపర్య పాలన దిశగా తెలుగు రాష్ట్రాలు?



రాష్ట్రం విడిపోయాక ఏర్పడిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మొట్టమొదటి ప్రభుత్వాలు కూడా కేంద్ర ప్రభుత్వానికి కాస్త అటూఇటుగా మూడో ఏడులోకి అడుగుపెడుతున్నాయి. వీటికి కూడా ఇది నిష్పాక్షిక కీలక సమీక్షా సమయం. రాష్ట్ర విభజనను రెండు రాష్ట్రాలూ అవకాశంగా మలచుకోలేకపోయాయని మొట్టమొదటగా అంగీకరించాల్సిన వాస్తవం. భవనాలకు ఎన్ని అంతస్తులు కట్టాలి, విగ్రహాల్ని ఎన్ని అడుగులు లేపాలి, జెండా కర్ర ఎంత ఎత్తు ఉండాలి అని కృత్రిమ సంకేతాల ఎత్తుకొలతలు చూస్తున్నంతగా తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు జనం జీవన ప్రమాణాల్ని ఎంత బాగా పెంచాలి అని ఆలోచించలేక పోతున్నాయి. అంత ఆలోచనే చేసి ఉంటే నిరుద్యోగం, వలసలు, అవినీతి ఇంకా పెద్దఎత్తున కొనసాగుతూనే ఉండేవి కావు. నాసిరకం విద్య, ఆరోగ్యం కోసం కూడా ప్రజలు అప్పులు చేసి మరీ అవస్థలు పడాల్సిన పరిస్థితి ఉండేది కాదు. గ్రామాలు వృద్ధాశ్రమాలుగా తయారయ్యేవి కావు. మద్యం ఏరులై పారుతూండేది కాదు. రైతుల ఆత్మహత్యలు పెరిగేవి కావు. ఎటువంటి అధికారం లేని కార్పొరేటర్ పదవి కోసం కోట్లు ఖర్చు పెట్టేవారు కాదు. పదవుల కోసం, వ్యాపారాల కోసం గెలిచిన పార్టీ నుంచి అధికార పార్టీలోకి నిస్సిగ్గుగా ఫిరాయించేవారు కాదు.

ఎటువంటి తెలంగాణ రాష్ట్రం ఏర్పడాలి అనే ప్రజాస్వామిక చర్చకు ఉద్యమ సమయంలోనే అవకాశం ఇచ్చి ఉన్నా, రాష్ట్రం విడిపోతే ఆంధ్రప్రదేశ్‌కు ఏం చేయాలి అనే ప్రశ్నకు పరిష్కారాలను వెతికే విజ్ఞతను ప్రదర్శించి ఉన్నా ఈవేళ రెండు రాష్ట్రాల్లో పరిస్థితి ఇంకా మెరుగ్గా ఉండేది. రెండు తెలుగు రాష్ట్రాలకు రోడ్‌మ్యాప్ అందించిన లోక్‌సత్తా గళం బలంగా వినిపించకుండా అణగదొక్కారు. చివరికి ఎన్నికల సమయాల్లో భావోద్రేకాల మధ్య హామీలు, ఉచితాల తాయిలాలతో గెలిచిన పార్టీలు అధికారంలోకి వచ్చాయి. కొత్త రాష్ట్రాల్లో కొంచెం తేడాతో పాత రాజకీయాన్నే కొనసాగిస్తున్నాయి.

హైదరాబాద్ అండను కోల్పోయిన నూతన ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాను అందించాలని, అది సాధ్యమయ్యే అవకాశాలు తక్కువ కాబట్టి రాయలసీమకు ప్రత్యేక హోదా కల్పించి, వెనకబడిన ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణకు ప్రత్యేక సాయాన్ని అందించాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అసెంబ్లీలో ప్రతిపాదించారు. ఏపీ ప్రత్యేక హోదాకు పార్లమెంటులో అంగీకరించి, ఎన్నికలలో ప్రచారం చేసుకుని గెలిచిన బీజేపీ, తెలుగుదేశం పార్టీలు ఆ తర్వాత ఏరుదాటాక తెప్ప తగలేసినట్టు వ్యవహరించాయి. ఇతర రాష్ట్రాల వల్ల సమస్యలు వస్తాయనుకుంటే కనీసం వెనకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకన్నా పారిశ్రామిక పన్ను రాయితీల్ని అడగాలని, ఇది మోదీ ప్రభుత్వం ఒక్క కలం పోటుతో చేసేయొచ్చని లోక్‌సత్తా పదేపదే చెబితే, చివరికి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజధాని అమరావతి ప్రాంతానికి మాత్రమే పన్ను రాయితీల్ని కోరారు. ఆంధ్రప్రదేశ్ స్టార్టప్, అమరావతి ఇంక్యుబేషన్ అంటూ ఇటీవల అమరావతే తనకు ముఖ్యమని తేల్చి చెప్పేశారు. హైదరాబాద్‌లో చేసిన తప్పే అక్కడ చంద్రబాబు మళ్లీ చేస్తున్నారు. గుంటూరు జిల్లాలోని మిగతా ప్రాంతాలు, రాష్ట్రంలోని మిగతా జిల్లాలు అమరావతి చుట్టూ తిరుగుతూనే ఎదగాలని ఆయన ప్రభుత్వం చెబుతోంది. అభివృద్ధిని, పాలనను కేంద్రీకరించటంతోపాటు అభివృద్ధి ఫలాలను ప్రజలు అందుకునేలా, సృజనాత్మకంగా సంపద సృష్టిలో వారు భాగస్వాములయ్యేలా చేసేందుకు కావలసిన విద్య, ఆరోగ్య రంగాలను మరింత అధ్వాన్నం చేశారు. స్థానిక ప్రభుత్వాలను, సహకార వ్యవస్థను గాలికొదిలేశారు. యువతకు ఉద్యోగాలను, సాగునీటి ఆయకట్టు స్థిరీకరణకు కావలసిన పారిశ్రామిక రాయితీలు, పోలవరం బహుళార్థ ప్రాజెక్టు మీద కాకుండా అమరావతి చుట్టూ రియల్ ఎస్టేట్ మీద కేంద్రీకరించి పాలన సాగుతోంది. కాపుల రిజర్వేషన్ పోరాటం వచ్చినా, ఇంకొందరు అలాంటి ఆందోళనలకు సిద్ధంగా ఉన్నా ఆయన మేలుకోలేదు. పార్టీకి విరాళాలిచ్చాం, ఎన్నికలలో ఖర్చు చేశాం అనే నెపాలతో అధికార పార్టీ నేతలు కోట్లు దోచేస్తుంటే, జీతాలు భారీగా పెంచినా ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాల దోపిడీ యథావిధిగానే కొనసాగుతోంది. ఏ భారీ అవినీతి కేసును ఛేదించాలన్నా వెనకాల అధికార పార్టీ నీడ కనిపిస్తోంది. ఓటుకు కోట్లు కేసులో ఇరుకున్న చంద్రబాబు కేంద్ర ప్రభుత్వాన్నే కాదు, రాష్ట్రంలోని అవినీతిని కూడా గట్టిగా ప్రశ్నించి చర్యలు తీసుకోలేకపోతున్నారు. ప్రతిపక్ష వైసీపీ వైఫల్యం వల్ల చంద్రబాబుకు వ్యక్తిగత ఆదరణ కొనసాగుతోందిగానీ, రాష్ట్రంలో చాలా అసంతృప్తి నెలకొంది. ఆనవాయితీకి భిన్నంగా ప్రతి పథకానికీ తన పేరు పెట్టుకుంటున్నారు. తెదేపా వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ పేరున రెండోమూడో పథకాలుంటే చంద్రబాబు పేరున పదికిపైగానే పథకాలున్నాయి. ప్రత్యేక హోదా సహా ఏ అంశంపై ఒక్క అఖిలపక్ష సమావేశాన్ని కూడా ఏర్పాటు చేయలేదు. తెలంగాణలో తుడిచిపెట్టుకుపోవటం, వయసు పెరగటం వంటి కారణాల వల్ల త్వరలో ఆంధ్రప్రదేశ్‌లో బాధ్యతల్ని త్వరలో వారసునికి అప్పచెప్పేందుకు చంద్రబాబు సన్నద్ధమవుతున్నట్టు కనిపిస్తోంది. వారసుడంటే పార్టీకి, రాష్ట్రానికి సమర్థవంతమైన సారథ్యాన్ని అందించేవాడని కాదు. తన కుమారుడు లోకేష్‌కు ముఖ్యమంత్రి పగ్గాలు అప్పగించటమే చంద్రబాబు దృష్టిలో సరైన వారసత్వం. సృజనాత్మకతకు, నిర్మాణాత్మకతకు తలుపులు మూసేసి పార్టీని కుటుంబ సొంత ఎస్టేట్ స్థాయికి దించేయటంతో సదాశయంతో స్థాపించిన తెలుగుదేశం విస్తరణకు అవకాశాలు ఉన్నకొద్దీ పరిమితమై పోతున్నాయి.

ఇక తెలంగాణలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు పరిస్థితి చంద్రబాబుతో పోలిస్తే కొంత సౌకర్యవంతంగా ఉంది. తెలంగాణ

రావటానికి కేసీఆర్ ప్రధాన కారణం కావటంతో దళితుడ్ని ముఖ్యమంత్రిని చేస్తానన్న మాట తప్పినా ప్రజల నుంచి పెద్దగా ప్రశ్నలు రాలేదు. తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షకి నీరు, నిధులు, ఉద్యోగాలు ప్రధాన కారణం కాబట్టి అందుకోసం చేసే ప్రయత్నాల్లో కొన్ని అడుగులు కేసీఆర్ మంచివే వేశారు. మిషన్ కాకతీయ, పెట్టుబడుల ఆకర్షణకి వేగంగా చర్యలు, గ్రామజ్యోతి వంటి కార్యక్రమాలు ఉద్యమస్ఫూర్తికి అద్దం పట్టాయి. కానీ సాగునీటి ప్రాజెక్టుల విషయంలోకొచ్చేసరికి ఆకాంక్షలు అసంబద్ధ రీతిలోకి మారాయి. లక్షల కోట్ల ప్రాజెక్టులను కనీస చర్చ లేకుండా, పెట్టుబడికి-ఫలితాలకు పొంతన లేకుండా ఏకపక్షంగా చేపట్టటం తెలంగాణకే ప్రమాదకరంగా మారుతుందన్న ఆలోచన లేకుండా పోయింది. తెలంగాణ ఉద్యమంగానీ, నినాదాలుగానీ ప్రజలు మెరుగైన జీవితాల కోసం పడే ఆరాటానికి కోడ్ పదాలే తప్ప అవే అంతిమం కావు. తెలంగాణకొచ్చే నీటి వాటాను నికరంగా తీసుకోవాల్సిందే, కానీ ఆ నీటిని ప్రజలకు ఏరకంగా అందిస్తే మెరుగైన ఉపాధి, ఆహారధాన్యాల ఉత్పత్తి, ఆదాయాల పెరుగుదల సాధ్యమవుతుందో ఆలోచన చేయకపోతే అది ప్రజావ్యతిరేకమవుతుంది. సాటివారికి కూడా మన లాగే అవసరాలు, ఆశలు ఉంటాయని గుర్తించటమే నిజమైన సంస్కృతీసంప్రదాయాలు. అన్ని వర్గాల ప్రజల అవసరాల్ని, ఆశల్ని నెరవేర్చేలా పాలన లేకుండా పైకి ఆచారాలను ప్రతిబింబించే కార్యక్రమాలను ప్రజాధనం వెదజల్లి నిర్వహించి ప్రయోజనం ఏమిటి? ఉద్యమంలో పాల్గొన్నవారు, తెలంగాణ క్షేమం కోరేవారు చెప్పే మాటల్ని వినే ఓపికను కూడా కేసీఆర్ ప్రదర్శించకపోవటం విచారకరం. గతంలో కాస్త ప్రమాణాలు పాటించిన జర్నలిస్టులు కూడా మనకెందుకన్నట్టు ఒకటికిరెండు పొగడ్తల్ని జోడించి కథనాల్ని వదులుతున్నారు. దీంతో వ్యవస్థీకృత నిజాలు చెప్పేవారు తెలంగాణలో కరువయ్యారు. హైదరాబాద్ సిటీ బస్సుల్లో స్త్రీ, పురుష ప్రయాణీకుల మధ్య అడ్డంగా ఇనప కంచెలాంటి ఏర్పాటు చేయించిన కేసీఆర్ దానిపై మహిళా ప్రయాణీకులు ఏమనుకుంటున్నారో ఒక్కసారి తెలుసుకుంటే తన నిర్ణయాల్లో చాలావాటిపై పునరాలోచన చేసుకుంటారు. విద్య, ఆరోగ్య రంగాలు, పరిమితమైన ప్రభుత్వోద్యోగాల భర్తీ తర్వాత లక్షలాది యువతకు ఉపాధి చూపటం, నీటిపారుదల ప్రాజెక్టులపై వెచ్చించిన డబ్బుకు తగ్గ విలువను క్షేత్రస్థాయిలో చూపటం కేసీఆర్ ప్రభుత్వం ముందున్న పెను సవాళ్లు. వీటిపై ఇంతవరకూ ఆయన లోతైన ఆలోచన చేయలేదు. తెలంగాణలో అన్ని పార్టీలనూ నిర్వీర్యం చేసి తెరాస ఒక్కటే ఉండేలా చూసుకుంటే, ఈ సవాళ్లను ఎదుర్కోకపోయినా 2019లో గట్టెక్కగలననుకుంటున్నట్టు కనిపిస్తోంది. చేదోడువాదోడుగా ఏర్పాటుచేసుకున్న కొడుకు, కూతురు తెలివైనవారు కావటం, మేనల్లుడు కార్యసాధకుడు కావటం చంద్రబాబుతో పోలిస్తే కేసీఆర్‌కు కలిసొస్తోంది. క్రమంగా తన కుమారుడు కేటీఆర్‌ను ముఖ్యమంత్రి పదవిలోకి తెచ్చేందుకు కేసీఆర్ అడుగులు వేస్తున్నట్టు సంకేతాలు కనిపిస్తున్నాయి. కానీ తెలుగుదేశంలాంటి సంస్థాగతంగా బలమైన పార్టీయే ముక్కలైపోయినప్పుడు అలాంటి సాంప్రదాయ పార్టీ తెరాసకు కూడా ఎప్పుడైనా అదే పరిస్థితి రావొచ్చు. అప్పుడు మళ్లీ పాత కథే.




కాబట్టి అప్రమత్తత చాలా అవసరం.

ఏ పార్టీ గెలిచినా ముఖ్యమంత్రి పార్టీయే, సర్పంచ్ పనులు కూడా ముఖ్యమంత్రే చేస్తారు అనే రాజకీయ, పాలనా పద్ధతులు సృష్టించే వివరిణామాల మధ్య, సమర్థులైనా మౌనప్రేక్షకుల్లా ఉన్న కోట్లాది సామాన్య యువతకు, కార్యకర్తలకు సవాలు విసురుతూ వంశపారంపర్య యువనాయకులు తెలుగునాట వచ్చే ఎన్నికలకు సారథ్యం వహించే అవకాశాలున్నాయి. ఎన్నికలకు ఒక సంవత్సరం ముందు నుంచీ తెలంగాణ, ఏపీ మధ్య నీటిసమస్యనో, మరో చిన్న గొడవనో భూతద్దంలో చూపుతూ ఘర్షణగా మార్చి తెరమీదకు తెచ్చి అధికార పార్టీలు సహా సాంప్రదాయ పార్టీలు లబ్ధి పొందే ప్రయత్నం చేయవచ్చు. ఇప్పటికైతే, రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు పరిమితంగానే అయినా ఇంకా దిద్దుబాటు అవకాశాలు మిగిలేవున్నాయి.

మిగిలిన సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలంటే, ఆంధ్రప్రదేశ్‌కు, ఉత్తర తెలంగాణకు ప్రత్యేక హోదాతో పన్ను రాయితీలు, నిధుల కోసం రెండు రాష్ట్రాల ప్రభుత్వాలూ కలిసికట్టుగా కేంద్రంపై పోరాడి సాధించుకోవాలి. ఒకవేళ ఇతర రాష్ట్రాలు అడ్డం కొడతాయేమోనన్న భయం ఉంటే లోక్‌సత్తా ఇప్పటికే సూచించినట్టు ఉత్తరాంధ్ర, రాయలసీమ, ఉత్తర తెలంగాణ సహా దేశవ్యాప్తంగా వెనకబడిన జిల్లాలన్నిటికీ ప్రత్యేక హోదా కల్పించే ప్రతిపాదనను ముందుకు తేవాలి. విభజన చట్టంలోని అంశాలను అమలుచేసేలా గట్టి ప్రయత్నం చేయాలి. నీటిసమస్య పరిష్కారానికి సహకరించుకుంటూ ఇరు రాష్ట్రాలకు మేలు చేసే పోలవరాన్ని వేగంగా పూర్తి చేయించుకోవాలి. రైతు భద్రతకు, ఆహారోత్పత్తికి చర్యలు తీసుకుంటూనే వ్యవసాయేతర రంగాలలో పెద్దఎత్తున ఉద్యోగాలను సృష్టించే పరిశ్రమలను అన్ని ప్రాంతాలలో తెచ్చేందుకు అభివృద్ధిని వికేంద్రీకరించాలి. విద్య, వైద్యారోగ్యంలో ప్రపంచంలోనే అధ్వాన్నంగా ఉన్న దేశంలో మిగతా రాష్ట్రాల కంటే అధ్వాన్నంగా ఉన్న పరిస్థితి నుంచి బైటపడేందుకు రాజీలేని ప్రణాళికాబద్ధ పోరాటం చేయాలి. ఈ రెంటితో సహా ఉమ్మడి జాబితాలో ఉన్న అంశాలలో సమూల మార్పుల కోసం అవసరమైతే రాష్ట్రాలకు స్వయంప్రతిపత్తి కోసం కేంద్రాన్ని డిమాండ్ చేయాలి. చిన్న రాష్ట్రాల వల్ల ఫిరాయింపులు పెరుగుతున్నాయన్న భయాలకు ఆస్కారం లేకుండా ముఖ్యమంత్రిని ప్రజలే ఎన్నుకునేలా ప్రత్యక్ష ఎన్నిక పద్ధతిని ప్రవేశపెట్టి ఎమ్మెల్యేల మీద ఆధారపడకుండా చేయాలి. ప్రజలకు రోజువారీ సేవలు సక్రమంగా అందేందుకు, అవినీతి నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు కొత్త జిల్లాలు చాలవు. వార్డు స్థాయిలోకి పాలనను వికేంద్రీకరించి, ప్రభుత్వ కార్యాలయాల్లో సర్వీస్ గ్యారంటీ చట్టం అమలు చేయాలి. మహిళల భద్రత, సత్వర న్యాయం కోసం లోక్‌సత్తా కృషితో వచ్చిన స్థానిక న్యాయాలయాలను ఏర్పాటు చేయాలి. తెలుగు ప్రజలకు నిజమైన సాధికారతను, భవిష్యత్తును ఇచ్చే ఈ సంస్కరణల కోసం తన వంతుగా ఎటువంటి తోడ్పాటునందించటానికైనా పార్టీ రాజకీయాలకతీతంగా లోక్‌సత్తా సిద్ధంగా ఉంది. ◘

# బుద్ధుడి జీవితం - ప్రజాస్వామిక నాయకత్వం

*నూతన ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని నిర్ణయించటం వెనక బౌద్ధ విలువల్ని పునరుజ్జీవింప చేయటం, ఆసియాలోని బౌద్ధమత దేశాలతో వాణిజ్య సంబంధాలను పెంపొందించుకోవటం ప్రధాన లక్ష్యాలని రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు ప్రకటించింది. ఇటీవల అంబేద్కర్ 125వ జన్మదినోత్సవం సందర్భంగా కూడా అమరావతికి అంబేద్కర్‌కు అవినాభావ సంబంధం ఉందని బౌద్ధ కోణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. అందుకే అక్కడ అంబేద్కర్ విగ్రహంతోపాటు, స్మారక భవనం వంటివి ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. వీటన్నింటినీ బేరీజు వేసిన ఆలోచనాపరులు, చివరకు దళిత మేధావులు కూడా అమరావతి చుట్టూ కొన్ని ఆశల్ని, ఆకాంక్షల్ని పెంచుకుంటూ ప్రచారం చేస్తున్నారు. ఒక్క అమరావతే కాకుండా ఏపీలోని పలు ప్రాంతాల్లో బౌద్ధ ముద్రలున్నాయి. అలాగే తెలంగాణతో కూడా బౌద్ధానికి చాలా అనుబంధం ఉంది. పురావస్తు తవ్వకాల్లో బౌద్ధ ఆనవాళ్లు బయటపడుతూనే ఉన్నాయి. హుస్సేన్ సాగర్ మధ్యలో ఉన్న బుద్ధ విగ్రహం హైదరాబాద్‌కు సంకేతంగా మారింది. బుద్ధుడు తమవాడు అని దళితులు, అంబేద్కరిస్టులతోపాటు సంపన్నులు, సాంప్రదాయ రాజకీయ నాయకులు కూడా తరచూ చెప్పుకుంటున్నారు. ఇక ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుద్ధుడి మీద పేటెంట్ హక్కులు భారతదేశానివేనని చాటిచెప్పేందుకు వీలున్నప్పుడల్లా ప్రయత్నిస్తూ పొరుగుదేశాలతో ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలను మెరుగుపరుచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. బుద్ధుడిని పునరావిష్కరించి సరికొత్త అవసరాలకనుగుణంగా వినియోగించుకునేందుకు అటు కేంద్రం, ఇటు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయి. బౌద్ధసంస్కృతి పరిరక్షణకు నిధుల్ని కూడా గణనీయంగా విడుదల చేస్తున్నాయి. ఈరకంగా దళితులను ఆకట్టుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. మంచిదే. కానీ తెలుగు రాష్ట్రాల్లో, మనదేశంలో రాజకీయాలు, పరిపాలన, నాయకత్వం, సామాజిక జీవితాల్లో బుద్ధుడు చెప్పిన పాటించిన విలువలు ఏమేరకు ఉన్నాయి? బౌద్ధ జపం చేస్తున్న నేతలు, సామాజిక కార్యకర్తలు ఆ విలువల్ని (మళ్లీ) ప్రతిష్టించటం కోసం చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తున్నారా? ఈ అంశాలపై ఆలోచన పెంచేందుకే మే 21న బుద్ధుడి జన్మదినోత్సవాన్ని, కేంద్రంలో, తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుత ప్రభుత్వాలు మూడో ఏడులోకి అడుగుపెట్టటాన్ని సందర్భంగా ఉపయోగించుకుని బుద్ధుని జీవితం, వ్యక్తిత్వంపై ఈ వ్యాసం..*



'బుద్ధుడు పీడిత ప్రజల విముక్తి ప్రదాత, గొప్ప రాజకీయ చింతనాపరుడు' అంటాడు మార్క్స్, ఏంగెల్స్‌ల మిత్రుడు సీఎఫ్ కోపెన్. 'బుద్ధుని ప్రస్తావన వచ్చినప్పుడు అప్రయత్నంగానే చేతులు ముకుళితమవుతాయి' అని చెబుతాడు స్వామి వివేకానంద. 'ఏసుక్రీస్తును మినహాయించి, బుద్ధుని కంటే పవిత్రుడు, ఆకర్షణీయమైన ప్రవక్త మరొకరు లేరు' అంటాడు బౌద్ధాన్ని తీవ్రంగా వ్యతిరేకించే బార్తలెమీ సెంట్ హిల్లరీ. 'భారతదేశంలో పుట్టినవారిలోకెల్లా అత్యంత మహామహుడు బుద్ధుడొక్కడే. బుద్ధుని మించినవారు మరొకరు లేరు' అని అభిప్రాయపడతాడు ఎ.ఎల్ భాషమ్. 'గుడ్డి విశ్వాసాల స్థానంలో అధ్యయనాన్ని, హేతుబద్ధతని ప్రవేశపెట్టటం వల్లే బౌద్ధ విలువలను పాటించే దేశాల్లో పుస్తకాలు ఎక్కువగా ప్రచురితమవుతుంటాయి, నాణ్యమైన చదువు, సమ్మిళిత అభివృద్ధి కనిపిస్తుంది' అని పలువురు విద్యావేత్తలు అంటుంటారు.. 2500కి పైగా సంవత్సరాల తర్వాత కూడా ఒక వ్యక్తిని ప్రపంచంలోని నలుదిక్కులా నిండుమనసుతో స్మరించుకుంటున్నాఏయంటే ఆయన వ్యక్తిత్వం ఎంత ప్రభావవంతమయినదో అర్థమవుతుంది. మతమనే పదానికి ఈనాడున్న సంకుచిత అర్థాన్ని దాటి ఆలోచిస్తే శాక్యముని గౌతముడు ప్రపంచంలోని మత ప్రవక్తలందరికీ శిఖరప్రాయుడని చెప్పవచ్చు. ఆయన జీవితం, వ్యక్తిగత ప్రవర్తన, ప్రచార పద్ధతి, అంతిమ విజయం ఇవన్నీ లోకోత్తరమయినవి. ఆయనలో అత్యున్నత రాజలక్షణాలు, మౌనుల జ్ఞానసంపద, లక్ష్యానికైన సర్వత్యాగం చేసిన వీరుని దృఢదీక్ష ఇవన్నీ మేళవించాయి. సునిశితమైన మేధస్సు, ప్రశాంత వీక్షణం, ప్రసంగ నైపుణ్యం, తన సిద్ధాంతాల పట్ల చెక్కుచెదరని విశ్వాసం అన్నీ ఆయన మహనీయతకు దోహదం చేశాయి. వీటికి తోడు మాటలో, ప్రవర్తనలో సాత్వికత, మర్యాద, ఔదార్యం, కరుణ ఆయన వ్యక్తిత్వానికి వన్నె తెచ్చాయి. క్రీస్తుకు 500 సంవత్సరాల ముందు నుంచే, మహమ్మద్‌కి 1100 సంవత్సరాల ముందు నుంచే బుద్ధుడు మిషనరీలను పంపాడు. దమ్మం, ప్రేమ, ఉప వసథ (కన్ఫెషన్) ఇలా బౌద్ధం నుంచి ఒక్కో మతం ఒక్కో అంశాన్ని స్వీకరించింది. బౌద్ధం ప్రభావం లేని



మతం ఈరోజు ప్రపంచంలోనే లేదు. గొప్ప సత్యాలు తెలిసిన వారెవరూ వాటిని దాచుకోరాదని ఆదర్శరాజ్యంలో ప్లేటో చెప్పటానికి 150 ఏళ్లకు ముందే బుద్ధుడు చెప్పాడు. స్వయంగా కళాసృష్టి చేయకపోయినా, బుద్ధుని జీవితమే ఒక కళాఖండం. ఆయన నెలకొల్పిన బౌద్ధం ఒక కళానిలయం. ఊహల్లో, చిత్రాల్లో కౌశలాన్ని చూపించే కళాకారుల్ని మనం చూడవచ్చు. కానీ తన నిత్యజీవితంలోని అసంకల్పిత కదలికల్లో సైతం బుద్ధుడు అనాయాస కళాత్మకతను ప్రదర్శించేవాడు. నాయకులను, అనుచరులను, స్త్రీలను, పురుషులను అందరినీ బుద్ధుని వ్యక్తిత్వం పరవశులను, పరిశుద్ధులను గావించేది. సమాజం కోసం తన జీవితాన్ని ధారవోసిన బుద్ధుడు తన ధర్మంలోనే తనకు ఎలాంటి స్థానాన్ని ఆపాదించుకోలేదు. రెండు పిటకాల్ని మాత్రమే గ్రంథస్థం చేసిన కాశ్యపుడు, బుద్ధుని ఇతర అనుచరులు బుద్ధుని జీవితచరిత్రను గ్రంథస్థం చేయకపోవటమే ఇందుకు నిదర్శనం. బుద్ధుడు తన తర్వాత వారసుని నియమించటానికి తిరస్కరించటమే వారలా చేయటానికి కారణం. బౌద్ధ ధర్మం బుద్ధుడి సొంత ఆస్తి కాదు. వ్యక్తిగత ఇష్టాయిష్టాలకు అక్కడ ఆస్కారం ఉండదు. వారసుని నియమించవలసిందిగా బుద్ధుని అనుయాయులు రెండుమూడు పర్యాయాలు కోరారు. ప్రతిసారీ బుద్ధుడు తిరస్కరించాడు. 'ధర్మానికి వారసుడు ధర్మమే' అని సమాధానమిచ్చాడు. సిద్ధాంతం దానంతట అదే జీవించాలిగానీ మానవుని అధికారానికి లోబడి కాదు, మానవుని అధికారానికి లోబడి మనగలిగేది సిద్ధాంతం కాజాలదు అని స్పష్టం చేశాడు. ధర్మాన్ని నడిపించటానికి ఆ ధర్మసంస్థాపకుని పేరును ప్రతిసారీ ప్రస్తావించవలసివచ్చినట్టయితే అది ధర్మమే కాదు అని బుద్ధుడు వారసత్వ ప్రతిపాదనను తిరస్కరించాడు. అయితే బౌద్ధానికి నాంది పలకటమేకాకుండా నూరుశాతం ఆచరించిన వ్యక్తిగా బుద్ధుని జీవితాన్ని పరిశీలించటం స్ఫూర్తిమంతంగా ఉంటుంది. తర్వాత తరాలవారు చేర్చిన మార్మిక గాథలన్నిటినీ పరిహరించి పరిశీలిస్తే సిద్ధార్థుడి జీవితంలోని వివిధ ఘటనల్లో ఆయన ఆచరణాత్మక కాలాతీత వ్యక్తిత్వ విశిష్టత కనిపిస్తుంది.

హిమాలయ సానువులలోని నేటి నేపాల్‌లో కపిలవస్తునగరంలో క్రీపూ 563లో శుద్ధోదన, మాయాదేవి రాజదంపతులకు సిద్ధార్థుడు జన్మించాడు. సహజసిద్ధంగానే సిద్ధార్థుడు అంతర్ముఖ స్వభావం కలిగినవాడు. ఎంత నెమ్మదయినవాడో, అంత రాజీపడని సమూల పరివర్తనవాది. జన్మ, జరమరణాల్ని, శృంగారాది శారీరక సౌఖ్యాలను, మళ్లీ అంతలోనే కలిగే సంవేదనలను, వీటన్నిటినీ అధిగమించటానికి ఆధ్యాత్మిక ప్రయత్నాలను సిద్ధార్థుడు సునిశితంగా పరిశీలించేవాడు. ఇంత పరిశీలనాశక్తి ఉండబట్టే ఆయన ప్రకృతికి, జీవరాసులకు అత్యంత సన్నిహితంగా ఉండేవాడు. ఇలాంటి మానసిక స్థితిలోనే సిద్ధార్థునికి 16వ ఏట వివాహమైంది. అయితే ఒక కర్తవ్యదీక్షకు పురికొల్పే సంఘటన ఆయన 28వ ఏట దాకా జరగలేదు. సరిహద్దుగా ఉన్న రోహిణీ నది నీటిపంపకం విషయంలో శాక్యుల రాజ్యానికి, కొలియుల రాజ్యానికి మధ్య ఏటా ఘర్షణలు జరుగుతుండేవి. శాక్యవంశీయుడైన సిద్ధార్థుని 28వ ఏట ఆ ఘర్షణ యుద్ధం వరకూ వచ్చింది. యుద్ధం ద్వారానే తేల్చుకోవాలని శాక్య సంఘం తీర్మానించింది. ఇరువైపుల ప్రతినిధులూ సంభాషణలు జరిపి శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకోవాలని గౌతముడు సూచించాడు. కానీ సేనాధిపతి ఆ ప్రతిపాదనను ఒప్పుకోలేదు. ఓటుకు పెట్టారు. సిద్ధార్థుని ప్రతిపాదన వీగిపోయింది. దాంతో అంతా యుద్ధానికి సిద్ధం కావాలని సేనాధిపతి ప్రకటించాడు. సిద్ధార్థుడు దానికి అంగీకరించలేదు. శాక్యసంఘ నియమం ప్రకారం సంఘ తీర్మానాన్ని వ్యతిరేకించిన సిద్ధార్థుని కుటుంబానికి దేశ బహిష్కరణ శిక్ష విధించారు. 'శిక్ష ఏదైనా నా వరకే పరిమితం చేయండి. నా కుటుంబాన్ని శిక్షించవద్దు. నేను పరివ్రాజకుడినై రాజ్యాన్ని వదిలి వెళ్లిపోతాను' అని సిద్ధార్థుడు అభ్యర్థించాడు. శాక్యసంఘం అందుకు సమ్మతించింది. గౌతముడు పరివ్రాజకుడై మహాభినిష్క్రమణం చేశాడు. స్వచ్ఛందంగా శిక్షననుభవించడానికి నిర్ణయించుకున్నందున, కలిమికి బదులు లేమిని, సౌఖ్యాలకు బదులు యాచనని, ఆవాసానికి బదులు నిర్వాసాన్ని ఎంచుకున్నాడు. అతను మన:పూర్వకంగా చేసిన మహత్తర త్యాగం అది. విశ్వచరిత్రలోనే అసమాన ధైర్యసాహసోపేత చర్య అది. "అటువంటి మహనీయుని కుమారునిగా పొందిన తల్లి ఎంతటి ధన్యురాలో, అతని తండ్రి ఎంతటి ధన్యుడో గదా! అటువంటివానిని భర్తగా పొందిన అతని భార్య ఎంతటి చరితార్థురాలో'' అన్న శాక్యమహిళ గౌతమి పలుకులు యదార్థమయినాయి. ఏడాది తర్వాత తన శిక్ష రద్దయినా కూడా గౌతముడు తిరిగి వ్యక్తిగత కుటుంబ జీవితంలోకి అడుగుపెట్టలేదు. అంతవరకూ వ్యష్టిస్థాయిలోనే ఉన్న ఆయన

మహోన్నత తత్వం ఆనాటి నుంచి సమష్టిస్థాయిలోకి మారింది. సామాజికమైన, విశ్వవ్యాప్తమైంది. తల్లి తన గర్భంలో ఉన్న శిశువుకు కూడా బౌద్ధధర్మాన్ని ఇప్పించమని కోరిందంటే బుద్ధుని మహనీయత అప్రభుతులను చేస్తుంది. భాగ్రాదేశంలో యువరాజు బోధి తల్లి తన గర్భస్థ శిశువుకు బౌద్ధం ఇమ్మని అడుగుతుంది. జన్మించి, పెద్దవాడయ్యాక ఆ బిడ్డ జీవితాంతం బుద్ధుని అనుచరునిగా ఉంటాడు. పరివ్రాజ సంస్కృతి బుద్ధుడి నాటి సమాజంలో సాధారణమే అయినప్పటికీ బుద్ధుడి జీవనస్థాయి గల వ్యక్తి పరివ్రాజకుడిగా మారటం మాత్రం అసాధారణమైన విషయమే. అలాగే పరివ్రాజక జీవితాన్ని విడిచిపెట్టే అవకాశం వచ్చినా కొనసాగించాలని నిర్ణయించుకోవటం, తాను కోరుకున్న సత్యదర్శనం కలిగిన తర్వాత కూడా ఇంటి గురించి ఆలోచించకుండా సమాజం గురించి ఆలోచించటం కొన్ని కీలకమయిన అంశాలను ముందుకు తెస్తాయి. సిద్ధార్థుడి కాలంలో సమాజం చాలా అల్లకల్లోలంగా ఉండేది. యజ్ఞయాగాదుల పేరుతో నర,జంతుబలులు, వావివరసలు లేని పశుసంస్కృతి, బహిరంగ రతికేళీలు, బానిసత్వపు వర్ణవ్యవస్థ, సోమసురాపానీయాలు, జూదం తదితర వికృత లక్షణాలుగల ఛాందసమతం సమాజాన్ని శాసిస్తూ ఉండేది. కర్మకాండల పేరుతో కామ, క్రోధ, మద, మాత్సర్యాలు ప్రకోపించిన ఇంద్రియలోలత్వంతో సాగుతున్న ఛాందస యాగ అమానుష సామాజిక పరిస్థితులే సిద్ధార్థుడనే వ్యక్తిని బుద్ధుడిగా మార్చాయి. వైదిక ధర్మాన్ని సిద్ధార్థుడు క్షుణ్ణంగా, అనుభవోపేతంగా పరిశీలించాడు. తనకు ముందున్న అన్ని మతవిశ్వాసాలనూ అతను స్పృశించాడు. కానీ ఏవీ అతనికి సంతృప్తిని ఇవ్వలేదు. శరీరం వివర్ణమయినా, శిథిలమవుతున్నా సిద్ధార్థుడు విసుగెరగకుండా సత్యాన్వేషణ కొనసాగించాడు. చివరకు 35వ ఏట (క్రీపూ 528లో) గయలోని బోధివృక్షం కింద 49 రోజుల తీవ్ర అంతర్మథనం అనంతరం సిద్ధార్థునికి జ్ఞానోదయం అయింది. సిద్ధార్థుడు బుద్ధుడయ్యాడు. అది సకల సంపూర్ణ వికాసమే తప్ప ప్రత్యేక ధ్యానపద్ధతి కాదు. దు:ఖోపశమనమే తప్ప ప్రత్యేకమైన మోక్షం కాదు.

తాను తెలుసుకున్న సత్యాన్ని ప్రజలకు రాజుగా పంచాలా, ప్రచారకుడిగా పంచాలా అన్న తర్కవితర్కంతో బుద్ధుడు చాలాసేపు నైరంజని నదీ ఒడ్డున పచార్లు చేస్తాడు. చివరకు భిక్షుమార్గాన్నే ఎంచుకుంటాడు. ఇక ఆనాటి నుంచి బుద్ధుని జైత్రయాత్ర మొదలైంది. ఛాందస ఆచారాల వికృత వాదం స్థానంలో బుద్ధుడు ప్రకృతి వాదాన్ని ప్రవేశపెట్టాడు. వైదిక మతంలోని వర్ణవ్యవస్థను ప్రశ్నించిన మొట్టమొదటి వ్యక్తి బుద్ధుడు. బుద్ధుని హేతువాద, మానవవాద ప్రచారం దెబ్బకు హింసాత్మక విరాట్ దేవతా స్వరూపాలన్నీ నేలకూలనారంభించాయి. వైదిక మహోపాధ్యాయుల భార్యలే బౌద్ధధర్మాన్ని బహిరంగంగా ఉచ్ఛరించనారంభించారు. బుద్ధుడు కులీనుడగుట వల్ల బౌద్ధధర్మం ఆకర్షణీయంగా మారిందన్న వాదనలో కొంత అర్థం ఉన్నప్పటికీ, బౌద్ధ ధర్మ విశ్వవిఖ్యాతికి అది మూలకారణం మాత్రం కాదు. బుద్ధుడు చెప్పినంత హేతుబద్ధంగా, శాస్త్రీయంగా, ఆచరణాత్మకంగా ఏ ప్రవక్తా ధర్మబోధ చేయలేదు. అల్పజన హితమైన మతాన్ని బహుజన హితంగా మార్చిన మొట్టమొదటి వ్యక్తి బుద్ధుడు. మానవుడే మార్గంగా, మానవుడే లక్ష్యంగా సాగిన మొట్టమొదటి వ్యవస్థీకృత దార్శనికుడు బుద్ధుడు. దానికితోడు తన జీవితమే ఒక సందేశంగా బుద్ధుడు జీవించినతీరు ప్రజానీకాన్ని ఎంతగానో ఆకట్టుకుంది.

బుద్ధుని జీవితమంతా క్రియాశీలమైనది. పిన్నలను, పెద్దలను, సంపన్నులను, సామాన్యులను, పేదలను, విద్యావంతులను, విద్యావిహీనులను, జైనులను, అజీవకులను, గృహస్తులను, సన్యాసులను, స్త్రీలను, పురుషులను చివరకు వైదిక పూజారులను సైతం విశేషసంఖ్యలో బుద్ధుడు తన బౌద్ధం వైపు తిప్పుకోగలిగాడు. అన్నివర్గాల నుంచి విభిన్న జీవిత ధోరణులకు చెందిన అశేష ప్రజానీకం ఆయనకు శిష్యులయ్యారు, భిక్షువులయ్యారు, ఉపాసకులయ్యారు. బుద్ధుడు తన ప్రథమ ఉపన్యాసాన్ని (ధర్మచక్రప్రవర్తన) చేసిన కొద్దికాలంలోనే మగధ, కోసల, కౌశాంబి రాజ్యాలు, శాక్యవజ్జి, మల్లలు లాంటి గణతంత్ర రాజ్యాలు బౌద్ధాన్ని స్వీకరించాయి. మహారాజులైన బింబిసారుడు, కోసల ప్రసేనజిత్తు, కౌశాంబి ఉదయనుడు బౌద్ధులయ్యారు. కుల, వర్గ విచక్షణ లేకుండా బుద్ధుడు అందరినీ సంఘంలో చేర్చుకున్నాడు. థేరగాథలోని ఉల్లేఖనల ప్రకారం బందిపోటు దొంగ అంగుళిమాలుడు, పాకీస్త్రీ సునీత, మాంసభక్షకుడు స్వపాకుడు, చేపలుపట్టే స్వాతి, గోపాలకుడు నందుడు, మంగలి ఉపాలి వీరందరూ సంఘంలో చేరారు. వైశాలి రాజనర్తకి అంబపాలి (ఆమ్రపాలి), వ్యభిచారిణి కుమార్తె విమల, బానిస కూతురు పూర్ణ, వేటగాని కూతురు చాపా వీరంతా భిక్షిణులైనారు. నిమ్నవర్గానికి చెందిన సునీతనుద్దేశించి బుద్ధుడు ఇలా అంటాడు: 'చిత్తశుద్ధితో నా ధర్మాన్ని ఆశ్రయించు. నిర్వాణం ఏ ఒక్క కులానికి చెందిన ప్రత్యేక సౌకర్యం కాదు. గాలి అన్ని కులాలకూ సమానమైనట్టే నా మార్గాన్ని అందరూ అనుసరించవచ్చు."

బుద్ధుని ప్రచారపద్ధతి కూడా చాలా విశిష్టంగా ఉండేది. సారిపుత్రుడు, మహామొగల్లానుడు తదితరుల ధర్మసేనాధిపతుల సాయంతో బుద్ధుడు తన ధర్మాన్ని విస్తరింపచేశాడు. ఏం చెప్పినా తాను ఆచరించి చూపే వ్యక్తి కావటంతో బుద్ధుడు సంపూర్ణ నాయకుడిగా తన దళాన్ని నడిపించగలిగాడు. క్రమశిక్షణ విషయంలో బుద్ధుడు రాజీలేని వ్యక్తి అని ఆయన నిత్యకృత్యాలు, ప్రచార జీవితం తెలుపుతాయి. సంవత్సరంలో 9నెలలు శాక్యముని గ్రామగ్రామానికి వెళ్లి ధర్మప్రచారం చేసేవాడు. వ్యాధిగ్రస్తులను, బాధాతప్తులను పరామర్శించేవాడు. కరవు, కాటకాలున్న ప్రాంతాల్లో ప్రత్యేకంగా పర్యటనలు చేసేవాడు. వైదిక మతాచార్యులు చేసే బోధలకు పూర్తి విరుద్ధమైన పద్ధతుల్లో

బుద్ధుడు తన ధర్మాన్ని వివరించేవాడు. ఆ పూజారులు సూత్రరూపంలో, బహుక్లుప్తంగా బోధచేసేవారు. బుద్ధుడు అలాకాక వివరంగా ధర్మబోధ చేసేవాడు. కొద్దిమంది శిష్యులకు రహస్యంగా పాఠం చెప్పటం, అదీ మార్మిక భాషలో మాట్లాడటం ఛాందస మతాచార్యుల పద్ధతి. బుద్ధుడు అలాకాక జనసమూహాలను ఉద్దేశించి ప్రసంగించేవాడు. అందరికీ బోధపడే పద్ధతిలో మాట్లాడేవాడు. తన మాటలు శ్రద్ధగా విననివారు, జ్ఞాపకశక్తి తగినంతగా లేనివారి కోసం పదేపదే పునశ్చరణ చేసేవాడు. శ్రోతల స్థాయికి తాను దిగివచ్చి మాట్లాడేవాడు. నైతిక జీవనం వల్ల కలిగే ఆరోగ్యం, సంతోషం, సంతృప్తి, దంబాచారాల వల్ల కలిగే హాని, కామవాంఛల వల్ల కలిగే నష్టం, వాటిని నియంత్రించటం వల్ల కలిగే ఆనందం ఇత్యాదులు మాట్లాడేవాడు. శ్రోతల మనసులో భావోద్రేకాలు నశించి ప్రశాంతస్థితిని చేరుకున్న మీదట బౌద్ధంలోని తాత్విక సూత్రాలను బోధించేవాడు. కథలు, సామెతలు, చారిత్రక ఉదంతాల ద్వారా వివరించేవాడు.

ఈ విధంగా 45 సంవత్సరాల పాటు కాలినడకన అవిశ్రాంతంగా తథాగతుడు తన దమ్మబోధ గావించాడు. బుద్ధుని తేజస్సును, యశస్సును చూసి ఓర్చుకోలేక ఆయనకు దుర్నడతిని అంటగట్టి, ఆయనపై హత్యాయత్నాలకు పాల్పడ్డవారంతా మట్టికొట్టుకుపోయారు. 'నాకు పిచ్చి ఎక్కించేవారూ, నా గుండెలు చీల్చేవారూ, నా రెండు కాళ్లూ పట్టి ఆవలి ఒడ్డుకు విసిరేసేవారూ ప్రపంచంలో ఎవరైనా ఉన్నారని అనుకోను' అని ఒకానొక సందర్భంలో అళవాకుడిని ఉద్దేశించి బుద్ధుడు అన్నమాటలు ఆయన అచంచల ఆత్మవిశ్వాసాన్ని తెలియచేస్తాయి. అసహనపరుల యెడల బుద్ధుడు ఎంతో సంయమనాన్ని పాటించేవాడు. హృదయసంబంధమైన గాఢత కలిగివుండటం వల్లే ఆయన విజయాలన్నీ పరిపూర్ణస్థాయిలో ఉండేవి. నిరంతర అప్రమత్తతను బోధిస్తూ సాగుతున్న బుద్ధుని జీవయాత్రలో ఆఖరి మజిలీ పావ గ్రామం. రుజాగ్రస్తుడైన శాక్యముని అక్కడి నుంచి నేపాల్ తూర్పు ప్రాంతంలోని కుశీనగరానికి అతికష్టం మీద చేరుకున్నాడు. ఆఖరు క్షణాల్లో కూడా సుబద్ధుడు అనే వ్యక్తికి ధర్మబోధ చేస్తాడు. తన శిష్యులకు ఆయన చెప్పిన ఆఖరు మాటలు "అన్ని మిశ్రమ పదార్థాలూ నశించక తప్పదు. అలాగే నేనూ మరణిస్తున్నాను. జ్ఞానం పొందండి. శ్రద్ధతో మీ నిర్వాణాన్ని మీరే సాధించుకోండి". క్రీపూ 483వ సంవత్సరం వైశాఖ పూర్ణిమ రోజున అర్థరాత్రి తథాగతుడు కన్నుమూశాడు. ఆ సన్నివేశం పాళీ గ్రంథంలో ఇలా వర్ణితమైంది– "సూర్యుడు పగలు మాత్రమే ప్రకాశిస్తాడు. చంద్రుడు రాత్రివేళలోనే కాంతులీనతాడు. యోధుడు సాయుధుడైనప్పుడే ప్రకాశిస్తాడు. బ్రాహ్మణుడు ధ్యానసమాధిలో ఉన్నప్పుడే కాంతివంతంగా కనిపిస్తాడు. కానీ బుద్ధుడు రాత్రి, పగలు ప్రకాశిస్తాడు". విశ్వానికి నిరంతరాయమైన అలాంటి వెలుగు కాబట్టే తన తర్వాత ఎన్ని వేల సంవత్సరాలు గడిచినా, ఎన్ని కోట్లమంది జన్మించినా బుద్ధుడు శిఖరాయమానుడిగానే కొనసాగుతున్నాడు.

## యశోధన ధీశక్తి

బుద్ధుని గురించి చెప్పుకునేటప్పుడు తప్పనిసరిగా ప్రస్తావించవలసిన వ్యక్తి ఆయన భార్య యశోధర! కర్తవ్య నిర్వహణలో, నిబద్ధతలో ఆమె బుద్ధునికి ఏమాత్రం తీసిపోదు. బుద్ధుడు తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలకు భార్యగా, తల్లిగా, వ్యక్తిగా ఆమె ప్రతిస్పందించి నిలదొక్కుకున్న తీరు చరిత్రాత్మకం. ఇల్లు విడిచి వెళ్లిన భర్త బుద్ధుడిగా రాజప్రాసాదానికి వచ్చినప్పుడు యశోధర ఎంతో ఆత్మవిశ్వాసంతో, ఆత్మగౌరవ భావనతో సంభాషిస్తుంది. ఆమె జీవించిన దాదాపు ఎనిమిది దశాబ్దాలూ మనకు ఈరోజు క్షణికంగా అనిపించవచ్చు. కానీ రోజు తర్వాత రోజు అన్నట్టుగా యవ్వన, ప్రౌఢ, వృద్ధాప్యాలను ఒంటరితల్లిగా దాటటానికి ఆమె మానసికంగా ఎంత శ్రమించివుంటుందో ఒక్కక్షణం ఆగి ఆలోచిస్తే అర్థమవుతుంది. ఆరోజు రాత్రి తనువు చాలించనున్నట్టు చెప్పటానికి ఆమె బుద్ధుని దగ్గరకు వస్తుంది. భార్యాభర్తల ఆఖరి సమాగమం అది. కానీ యశోధరలో ఎటువంటి కలతా కనిపించదు. ఎంతో ఆత్మస్థయిర్యంతో మాట్లాడుతుంది. తనువు చాలిస్తున్నట్టుగా చెబుతుందే తప్ప అందుకు బుద్ధుని అనుమతిని ఆమె కోరదు. జీవితంలోని అన్ని వేదనలనూ ఆమె జయించింది. తనకు ఆ మార్గాన్ని చూపించి శక్తినిచ్చినందుకు బుద్ధునికి కృతజ్ఞతలు చెప్పటానికి మాత్రమే యశోధర వచ్చింది తప్ప, ఆయన శరణం కోరటానికి రాలేదు. పైగా 'నాకు నేనే శరణం' (మై శరణం అత్తనో) అని ప్రకటించింది. బుద్ధుడు కోరుకుంది కూడా అదే. నిన్ను నువ్వు తెలుసుకునేందుకు నేను సహాయపడతానని చెప్పాడే తప్ప ఎల్లవేళలా నువ్వు నన్ను శరణువేడాలని ఆయన ఎవ్వరికీ, ఎన్నడూ చెప్పలేదు. ఆ బుద్ధత్వాన్ని ధీశక్తితో తన జీవితకాలంలోనే యశోధర సాధించింది. బుద్ధుని నిజమైన సహచరిగా, సమవుజ్జీగా ఆమె చరిత్రలో నిలిచిపోయింది.

"హంతకుడు హంతకుని బారిన పడవలసి వస్తుంది
జయించినవాడు అపజయం పాలవ్వాల్సివస్తుంది
నిందించేవారు నిందలకు గురికావలసి వస్తుంది
చర్య పరిణామం వల్ల చెడుపు చేసేవారికి చెడు జరుగుతుంది
అందుకే, ధర్మమే వ్యక్తికి, సమాజానికి కూడా విముక్తి మార్గం"

**– గౌతమ బుద్ధుడు**

ఇప్పటికైనా మతభావన లేకుండా బుద్ధుడి ప్రజాస్వామిక నాయకత్వ లక్షణాన్ని, అధ్యయనాన్ని, హేతుబద్ధతని, నాగరిక విలువల్ని, వివక్ష లేకుండా అందరికీ ఎదిగే అవకాశాల్ని కల్పించే సంస్కృతిని, వికేంద్రీకరణతో, సంఘాలతో ప్రజల చుట్టూ తిరిగే పద్ధతుల్ని, నిరాడంబరతను ఆచరణలోకి తెచ్చేందుకు, నివారించదగ్గ బాధలను తొలగించేందుకు మన పాలకులు ప్రయత్నం ప్రారంభించాలి. ◘

# ప్రత్యేక హోదాపై తెదేపా, బీజేపీ రాజకీయ డ్రామాలు

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, రైల్వే జోన్‌పై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఎందుకు మాట్లాడటం లేదని లోక్‌సత్తా పార్టీ ఏపీ ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ ప్రశ్నించారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రజలను మభ్యపెడుతూ తెలుగుదేశం, బీజేపీలు డ్రామాలు ఆడుతున్నాయన్నారు. విశాఖపట్నంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో బాబ్జీ పాల్గొన్నారు. రాష్ట్రంలో సమస్యలు పేరుకుపోతుంటే చంద్రబాబు తప్పించుకుని తిరుగుతున్నారన్నారు. కేంద్రంలో బీజేపీ తన రాజకీయ అవసరాలు చూసుకుంటుంటే, రాష్ట్రంలో చంద్రబాబు ఎమ్మెల్యేలను కొనుగోలు చేయటంలో బిజీగా ఉన్నారన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా అవసరం లేదని కేంద్ర మంత్రులు హెచ్‌పీ చౌదరి, జయంత్ సిన్హా చేసిన ప్రకటనలు ముమ్మాటికీ తెలుగు ప్రజలను కించపరచటమేనన్నారు. ప్రతిసారీ పార్లమెంటు సమావేశాల్లో బీజేపీ కేంద్ర నాయకులు ఏదోక ప్రకటన చేసి ప్రజలను రెచ్చగొడుతున్నారని, పార్లమెంటు సాక్షిగా తీసుకున్న నిర్ణయాలకు విలువలేకపోతే ప్రజాస్వామ్యానికి ఏం విలువ ఉంటుందని ప్రశ్నించారు. ఏపీకి ప్రత్యేక హోదా కల్పించే ప్రత్యేక నిబంధనేదీ పునర్విభజన చట్టంలో లేదని మంత్రి చెప్పటం శోచనీయమన్నారు. విభజనానంతరం ఏర్పడిన రాష్ట్రాలకు ఆదాయలోటును పూడ్చేందుకు నిధుల సాయం అందించాలన్న ప్రత్యేక నిబంధనేమీ చట్టంలో లేదని, కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటాలను పొందిన తర్వాత కూడా ఆదాయలోటు ఉందని గమనిస్తే ఆ లోటును పూడ్చటానికి ఆర్థిక సంఘం సిఫార్సు చేస్తుందని కేంద్రం చెప్పిందాకా రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. ఏపీకి కేంద్రం ప్రత్యేక సాయం చేయటం లేదు, ఆదాయ లోటు ఉన్న పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలకు కూడా ఆర్థిక సాయం ఇచ్చిందని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ ఏడాది క్రితమే పత్రాలతో సహా బైటపెట్టినా పాలకులు మేలుకోలేదన్నారు. విచక్షణారహితంగా రాష్ట్రాన్ని విడదీస్తున్నప్పుడు వెంకయ్యనాయుడు, సుష్మా స్వరాజ్ ప్రత్యేక హోదాను ఎందుకు చట్టంలో చేర్చలేదని ప్రశ్నించారు. మూడు రైల్వే బడ్జెట్‌లు ముగిసినా చట్టంలోనే ఉన్న విశాఖ రైల్వే జోన్‌ను ఎందుకు ప్రకటించలేదని అడిగారు. రాష్ట్ర విభజన రోజున సందర్భంగా చేసిన ప్రతి ప్రకటనకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉండాల్సిందేనని స్పష్టంచేశారు. స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని తాకట్టు పెడితే కాంగ్రెస్‌కు పట్టినగతే బీజేపీ, టీడీపీకి



కూడా పడుతుందని, కేంద్రంపై పూర్తిస్థాయి ఒత్తిడి తెచ్చి ప్రత్యేక హోదాను చంద్రబాబు సాధించాల్సిందేనని బాబ్జీ డిమాండ్ చేశారు.

లోక్‌సత్తా పార్టీ విశాఖ నగర నాయకుడు ఎంఎస్‌ఎన్ మూర్తి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యను వ్యాపారంగా మార్చేసిందని, లక్షలాది మంది పట్టభద్రులు నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని, వైద్యరంగం అధ్వాన్నంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. ◘

## ప్రజాసమస్యలపై పోరు కొనసాగిస్తాం : లోక్‌సత్తా



లోక్‌సత్తా కార్యాలయంలో మేడే ఉత్సవాల్లో పాల్గొన్న నాయకులు

ఎన్నికలకు దూరంగా ఉంటున్నా ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటం కొనసాగిస్తామని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పాండురంగారావు స్పష్టంచేశారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన మే డే ఉత్సవాలలో ఆయన మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో పార్టీని బలోపేతం చేసేందుకు చర్యలు ప్రారంభించామన్నారు. విద్య, ప్రజారోగ్యం అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఆ దిశగా కార్యక్రమాలను చేపడతామన్నారు. పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకుగాను జిల్లా, రాష్ట్ర కమిటీలను పునర్వ్యవస్థీకరిస్తామన్నారు. సభ్యత్వ నమోదు, జిల్లాల పర్యటన త్వరలో చేపట్టబోయే కార్యక్రమాలని వివరించారు.


# ఏపీ పరిశ్రమల శాఖలో భారీ అవినీతి, బైటపెట్టిన లోక్‌సత్తా



ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖలో దొంగలు పడ్డారని, కొందరు అధికారులు సిండికేట్‌గా ఏర్పడి కోట్ల రూపాయల అవినీతికి పాల్పడుతున్నారని లోక్‌సత్తా పార్టీ ఆరోపించింది. ప్రజాధనం దుర్వినియోగానికి బాధ్యులైన అధికారులపై సీబీఐ విచారణ జరిపించాలని పార్టీ అధికార ప్రతినిధి కూసంపూడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పరిశ్రమల శాఖలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న అధికారులే ముఠాలాగా తయారై అవినీతికి పాల్పడుతున్నారని, దీనికి ఐఏఎస్‌ల అండ ఉందని అన్నారు. ఈ ఇంటిదొంగల కుంభకోణంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఎస్పీ టక్కర్‌కు సచివాలయంలో లోక్‌సత్తా పార్టీ నేతలు బంతు సాంబిరెడ్డి, గంగాభవానీ తదితరులతో కలిసి విజ్ఞాపన పత్రం సమర్పించారు.

అనంతరం శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ, పరిశ్రమల శాఖలో రాయితీలు, ప్రోత్సాహకాలను బోగస్ కంపెనీల పేరుతో మంజూరు చేసి నకిలీ బ్యాంకు ఖాతాల్లోకి మళ్లించి దోచుకుంటున్నారని తెలిపారు. అంతేకాకుండా ఒక యూనిట్‌కు రెండుమూడుసార్లు రాయితీలు ఇచ్చి భారీ కుంభకోణాలకు పాల్పడుతున్నారన్నారు. హుద్‌హుద్ తుపాను సందర్భంగా ప్రభుత్వం రూ.2వేల కోట్లు విడుదల చేస్తే వాటిని అధికారులు జవాబుదారీతనంలేకుండా ఖర్చుచేశారన్నారు. దీనిపై గత ఏడాది అక్టోబర్‌లోనే ఏసీబీ డైరెక్టర్ జనరల్ మాలకొండయ్యకు, విజిలెన్స్ కమిషన్ డీఐజీ సీఎస్ఆర్‌కే రాజుకు ఫిర్యాదు చేశామన్నారు. విశాఖపట్నంలో బ్రాండిక్స్‌కు, ఓషియన్ ఇండియాకు రెండుసార్లు నష్టపరిహారం చెల్లించారన్నారు. ఇలా అనేక కంపెనీలకు నిబంధనలకు విరుద్ధంగా కోట్ల రూపాయలను విడుదల చేసి అధికారులు వాటా తీసుకున్నారన్నారు. పరిశ్రమ శాఖ అధికారులపై ఆ శాఖ తీసుకునే చర్యల్ని వెల్లడించటానికి కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్ విముఖత చూపారని ఆరోపించారు. ఆర్‌టీఐ ద్వారా జేడీ చల్లపల్లి రామిరెడ్డి తదితర అధికారుల అవినీతి బయటపడినా పరిశ్రమల శాఖ డైరెక్టర్ కార్తికేయ మిశ్రా వారిని కాపాడుతూ వచ్చారని, ఇప్పుడు తప్పనిసరి పరిస్థితుల్లో అధికారులను సస్పెండ్ చేశారు తప్ప వారి అరెస్టు, విచారణ, ఆస్తుల జప్తుపై నానుస్తున్నారని అన్నారు (లోక్‌సత్తా ఫిర్యాదు తర్వాత రావత్‌ను తప్పించారు, మిశ్రాను వివరణ కోరారు). గతంలో రైతు సంఘాల నేతల సహకారంతో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ బైటపెట్టిన రూ.1000 కోట్ల కుంభకోణంలో అధికారులను తూతూమంత్రంగా సస్పెండ్ చేసి తిరిగి విధుల్లోకి తీసుకున్నట్టుగా ఇప్పుడు కూడా నాటకాలాడుతున్నారన్నారు. అవినీతి అధికారులను వెంటనే అరెస్టు చేయాలని, వారి ఆస్తుల్ని జప్తు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, ఐఏఎస్‌ల నిర్లక్ష్యంపై విచారణ జరగాలని కోరామని, తక్షణం దీనిపై సమావేశం నిర్వహించవలసిందిగా ప్రధాన కార్యదర్శి ఆదేశించారని శ్రీనివాస్ తెలిపారు. ◘

# రాజకీయాలపై ఆసక్తితో 'కింగ్స్'కి




సామాజిక శాస్త్రాలలో పీజీ కోర్సులు చేసేవారికి లండన్ కింగ్స్ కాలేజీ-ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఏడాదిపాటు అందించే 'మాస్టర్స్ ఆఫ్ రిసెర్చ్' కోర్సు పూర్తి చేసే అవకాశం ఈ ఏడాది హైదరాబాదీ గరిమా గోయల్‌కి దక్కింది. ఈ కోర్సు మన విశ్వవిద్యాలయాలు అందించే ఎంఫిల్‌లాంటిది. ప్రపంచం నలుమూలల్నుంచి వచ్చే వేలాది దరఖాస్తుల్లో పదిమందిని ఎంపికచేస్తారు. ఆ పదిమందిలో ఒకరికి బెయిలీ గిఫోర్డ్ బహుమతి అందిస్తుందీ సంస్థ. ఈ బహుమతిని అందుకున్న గరిమకు ఏడాదిపాటు పరిశోధనకు 30వేల పౌండ్లు (రూ.28.9లక్షలు) అందిస్తారు. బీహార్‌కు చెందిన గరిమకు టీజేజీ నుంచి రాజకీయాల పట్ల ఆసక్తి ఎక్కువ. హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. "ఒక్క వ్యాపారంలోనే కాదు, జీవితంలోని ప్రతి అంశంలోనూ రాజకీయాల ప్రభావం ఉండటం గమనించా. అందుకే రాయిటర్స్‌లో జర్నలిస్టు ఉద్యోగాన్ని వదిలేసి ఓయూలో ఎంఏ రాజనీతి శాస్త్రం చదవటం మొదలుపెట్టా. ప్రధానంగా భారత వర్తమాన రాజకీయాలు, ఆర్థిక, సామాజిక స్థితిగతులపై నా పరిశోధన ఉంటుంది. అంకెల సాయంతో రాజకీయాల లోతులు చూసే విశ్లేషకురాలిగా నిలదొక్కుకోవాలని అనుకుంటున్నా" అని గరిమ చెప్పారు. ◘

# లైబ్రరీల పునరుజ్జీవనానికి లోక్‌సత్తా పార్టీ యూత్ కార్యక్రమం








చదవటం నాగరికతకు చిహ్నం, లోక్‌సత్తా కొత్త రాజకీయ సంస్కృతిలో భాగం. అన్ని రంగాలకూ మాతృకలాంటి రాజకీయ రంగంలో మేధావులు, ఆలోచనాపరులు ఉండకూడదనే బలమైన తప్పుడు వాదనకు లోక్‌సత్తా ఎంత ఎదురీదుతోందో వేరే చెప్పనక్కర్లేదు. సరే, ఈ మధ్య లోక్‌సత్తా పార్టీ యువకార్యకర్తలు కొందరు గ్రంథాలయాల పరిస్థితి ఎలా ఉందో తెలుసుకునేందుకు హైదరాబాద్‌లోని ప్రభుత్వ లైబ్రరీలను సందర్శించింది. జీహెచ్‌ఎంసీ వాళ్లు చూపిస్తున్న 88 లైబ్రరీల్లో అనేకం గత కొన్నేళ్లలో మూతపడ్డాయి లేదా నామమాత్రంగా ఉన్నాయని ఈ పరిశీలనలో తేలింది. అసలు ఎన్ని లైబ్రరీలు పనిచేస్తున్నాయో జీహెచ్‌ఎంసీ వద్దే సరైన సమాచారం లేదు. లోక్‌సత్తా బృందం వెళ్లిన లైబ్రరీలు తెరిచి ఉండే సమయం ఉదయం 8.00 గంటల నుంచి 11.00, సాయంత్రం 5.00 నుంచి 8.00 వరకేనట. ఇలాంటి లైబ్రరీలో పోస్టింగ్ పడితే సోమరి సుఖాన్ని పొందొచ్చు లేదా సొంత వ్యాపారాలు చేసుకోవచ్చు అనిపించకమానదు. మన నుంచి రూ. 424 కోట్లు లైబ్రరీ సెస్సు వసూలు చేసిన జీహెచ్‌ఎంసీ మనకు ఏం చేసిందో ఫోటోల్లో చూడవచ్చు. సిటీ సెంట్రల్ లైబ్రరీలో సర్వే చేస్తుండగా లోక్‌సత్తా యూత్ తీసిన చిత్రాలివి. వీటిని చూసి అవాక్కవకుండా పరిష్కారం కోసం లోక్‌సత్తా ప్రయత్నం ప్రారంభించింది. వారంలో 2గంటల పాటు స్థానిక యువత నుంచి సమయం తీసుకుని లైబ్రరీలను ప్రక్షాళన చేస్తామని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా వినియోగిస్తూ హైదరాబాద్‌ని గ్రంథాలయాలున్న నాగరిక నగరంగా తీర్చిదిద్దుతామని, ఈ అనుభవాలను ఉపయోగించి మిగతా ప్రాంతాల్లోనూ లైబ్రరీల పునరుజ్జీవన కార్యక్రమాన్ని చేపడతామని లైబ్రరీలను సందర్శించిన బృందానికి నాయకత్వం వహించిన లోక్‌సత్తా నేత నరసింహ తెలిపారు. ▫

# పవర్‌ఫుల్ మేయర్ సీటులో సాదిక్ ఖాన్



లండన్ మేయర్ అంటే మన హైదరాబాద్, విజయవాడల్లోలా అధికారాలు లేని ఉత్సవ విగ్రహంలాగా కాకుండా చాలా ప్రాధాన్యత కలిగివుండి ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నికవుతారు. తాజా ఎన్నికల్లో సామాన్య కుటుంబం నుంచి వచ్చిన సాదిక్ ఖాన్ లండన్ మేయర్‌గా ఎన్నికయ్యారు. ఈయన పాకిస్తాన్‌కు చెందిన ఓ బస్సు డ్రైవర్‌కుమారుడు. లండన్ మేయర్‌గా ఎన్నికైన తొలి ముస్లింగా కూడా ఈయన రికార్డు సృష్టించారు. లండన్‌లో ప్రజలందరికీ ఇళ్ల నిర్మాణం ఈసారి ఎన్నికల ప్రధానాంశంగా ముందుకొచ్చింది. ఇటీవలి మన హైదరాబాద్ మునిసిపల్ ఎన్నికల్లో ముఖ్యమంత్రి, మంత్రులు ఈ విషయాల్ని మాట్లాడితే, లండన్‌లో మేయర్ అభ్యర్థులు తమ గృహ నిర్మాణ ప్రణాళికల్ని ప్రజల ముందు చర్చకు పెట్టారు. ముస్లిం అభ్యర్థిని ఎన్నుకోవటం వల్ల ఐసిస్ ముప్పు వస్తుందన్న కనజర్వేటివ్ పార్టీ అభ్యర్థి ప్రచారాన్ని ప్రజలు పట్టించుకోలేదు. చివరకు ప్రధానమంత్రి డేవిడ్ కామరన్ విజ్ఞప్తిని కూడా తోసిపుచ్చి భద్రత, స్థానికతలకే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చి ఆధునిక భావాలున్న ముస్లింగా తనను తాను ప్రచారం చేసుకున్న లేబర్ పార్టీ అభ్యర్థి సాదిక్‌ను గెలిపించారు. ఖాన్ మానవహక్కుల న్యాయవాదిగా పనిచేశారు, ఎంపీగా, మంత్రిగా కూడా సేవలందించారు.

# విద్యా విజ్ఞానాలకు మిషన్ వట్టికోట

- డాక్టర్ రవికుమార్ చేగొని
ప్రధాన కార్యదర్శి, తెలంగాణ గ్రంథాలయ సంఘం

తెలంగాణ ప్రాంతం 200 సంవత్సరాలకుపైగా (1724-1948) ఆసఫ్‌జాహీల పాలనలోను, అంతకుముందు దాదాపు 200 ఏళ్లు (1518-1687) కుతుబ్‌షాహీల అధికారంలో ఉన్నది. స్వతంత్ర భారతదేశంలో సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అంతర్భాగంగా 57 ఏళ్లు (1956-2014) కొనసాగింది. ఐదు శతాబ్దాలపాటు ముస్లిం, ఆంధ్ర పాలకుల పరిపాలనలో ఉన్న తరువాత ఇప్పుడు మన ప్రాంత యాస, భాష, చరిత్ర, సంస్కృతి, విద్యకు పునర్ వైభవం కల్పించుకోవడానికి పూనుకున్నాము.

కొమర్రాజు లక్ష్మణరావు (మునగాల దివాను), నాయని వెంకట రంగారావు (మునగాల రాజా), రావి చెట్టు రంగారావు (హైదరాబాద్ మున్సబ్) సహకారంతో హైదరాబాద్ నగరంలో 1901లో శ్రీ కృష్ణ దేవరాయ ఆంధ్ర భాషా నిలయం ప్రారంభమయింది. 1904లో మాడపాటి హనుమంతరావు సహకారంతో హన్మకొండలో రాజ రాజ నరేంద్ర ఆంధ్ర భాషా నిలయం ఏర్పడింది. ఈ గ్రంథాలయాల ఏర్పాటు తెలంగాణ ప్రాంతంలో గ్రంథాలయ ఉద్యమానికి నాంది పలికింది. అదేవిధంగా ఆంధ్ర జన సంఘం, ఆంధ్ర మహాసభల కృషి ఫలితంగా సూర్యాపేట, నల్గొండ, వరంగల్, దేవరకొండ, జోగిపేట మొదలైన ప్రాంతాల్లో ఏర్పడ్డాయి. ఇవన్నీ ప్రజలను విద్యావంతులను చేసి వారిలో స్వాతంత్ర్య కాంక్షను చిగురింపచేశాయి. తెలంగాణ ప్రాంతంలో గ్రంథాలయ ఉద్యమవ్యాప్తికి కృషి చేసిన మహనీయులు చాలామంది ఉన్నారు. వారిలో మాడపాటి హనుమంతరావు, కోదాటి నారాయణరావు, బూర్గుల రామకృష్ణ రావు, సురవరం ప్రతాపరెడ్డి, కె.వి రంగారెడ్డి, కాళోజి నారాయణరావు, రావుబహద్దూర్ వెంకట రామిరెడ్డి, వట్టికోట ఆళ్వారు స్వామి అత్యంత ప్రముఖులు. వీరి అకుంఠిత కృషి మూలంగానే తెలంగాణలో గ్రంథాలయోద్యమం ఉవ్వెత్తున కెరటంలా ఎగిసిపడింది.

స్వాతంత్ర్యం వచ్చినప్పుడు తెలంగాణలో విద్యావంతులు ఐదుశాతం మంది మాత్రమే ఉన్నారు. 1960 నాటికి వీరి సంఖ్య 22శాతానికి పెరిగింది. 2014లో తెలంగాణ జనాభాలో 68.5శాతం మంది విద్యావంతులు ఉన్నారు. మరి ఇప్పుడు, అంటే 2016లో గ్రంథాలయాల పరిస్థితి ఏమిటి? 1980-90 దశకం అనంతరం ఎక్కడా కొత్త గ్రంథాలయాలను ఏర్పాటు చేయలేదు. ఉన్న గ్రంథాలయాలు అద్దె భవనాలలో, శిథిలావస్థలో ఉన్న పాత భవనాలలో ఉన్నాయి. పెరుగుతున్న జనాభాకు




అనుగుణంగా పౌర గ్రంథాలయాలను ఏర్పాటు చేయలేదు. అపరిమితంగా పెరిగిపోతోన్న విజ్ఞానాన్ని గ్రంథాలయాల ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావలసిన బాధ్యత ప్రభుత్వంపైన ఉన్నది.

మౌల్వి సయ్యద్ హుస్సేన్ బిల్గ్రామి, ముల్లా అబ్దుల్ కయ్యుమ్‌ల సంయుక్త కృషి ఫలితంగా నిజాం నవాబు 1885లో అసఫియ గ్రంథాలయాన్ని స్థాపించారు. ఇదే తదనంతర కాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయంగా రూపొందింది. నాటి నుంచి నేటి వరకు పాఠకుల మన్ననలను పొందుతూ ఉంది. భారతదేశంలో గ్రంథాలయాల అభివృద్ధికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు గ్రంథాలయ చట్టాలు తీసుకొచ్చాయి. దేశంలోనే రెండవ గ్రంథాలయ చట్టం (1955) చేసిన ఘనత హైదరాబాద్ రాష్ట్రానిది. తర్వాత 1960లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ చట్టంగా అమలులోకి రాబడింది. ప్రతీ నెల ప్రతీ పౌరుడు తన ఇంటి పన్ను, ఆదాయ పన్నుతో పాటు గ్రంథాలయ పన్ను కూడా చెల్లిస్తుంటాడు. ఈ గ్రంథాలయ పన్ను ఒక రూపాయిలో 8 పైసలుగా ఉన్నది.

ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో రెండు ప్రాంతీయ గ్రంథాలయాలు (వరంగల్, నిజామాబాద్) ఉన్నాయి. వీటితోపాటు తొమ్మిది జిల్లా కేంద్ర గ్రంథాలయాలు, 562 శాఖా గ్రంథాలయాలు, 165 గ్రామీణ గ్రంథాలయాలు, 497 పుస్తక నిక్షిప్త కేంద్రాలు ఉన్నాయి. అదేవిధంగా, హైదరాబాద్ మహానగరంలో నగర కేంద్ర గ్రంథాలయం, దాని నిర్వహణలో 86 శాఖా గ్రంథాలయాలు ఉన్నాయి.

మరి ఈ గ్రంథాలయాలకు పుస్తకాలు, పత్రికలు కొనడం సంతృప్తికరంగా జరగడం లేదు. అసలు అత్యధిక గ్రంథాలయాలలో కనీస సౌకర్యాలైన నీరు, విద్యుత్తు, కుర్చీలు, బల్లలు మొదలైనవి కొరవడ్డాయి. వాటిని సమకూర్చాల్సిన బాధ్యత ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వాలపై ఉన్నదని మరి చెప్పనవసరం లేదు. పౌర గ్రంథాలయాల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు ఏవిధంగా ఉన్నాయో చూస్తే స్వచ్ఛభారత్ కార్యక్రమం ఏ విధంగా పనిచేస్తుందో తెలుస్తుంది సుమా! తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన ఉద్యోగాలు సాధించేటందుకు నిరుద్యోగ యువత ఏ విధంగా ప్రయత్నం చేస్తుందో ప్రస్తుత పరిస్థితుల్లో నగర కేంద్ర గ్రంథాలయం, జిల్లా కేంద్ర గ్రంథాలయాలను చూస్తే మనకు తెలుస్తుంది. కూర్చునేందుకు సరైన వసతి లేక పలువురు యువజనులు తమ ఇంటి వద్ద నుంచే కుర్చీలు తెచ్చుకుంటున్నారు. ఆరుబయట చెట్ల కింద పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. కనీస గ్రంథాలయ సదుపాయాలు కల్పించలేకపోవడమంటే వారి విజ్ఞాన సముపార్జన హక్కును కాలరాచివేయడమే కాదూ? రాష్ట్రవ్యాప్తంగా 1987 నుంచి నేటివరకు నూతన గ్రంథాలయాలు స్థాపించిన దాఖలాలు లేవు. అంతేకాదు, 1993 నుంచి నేటివరకు ఒక గ్రంథ పాలకుడిని కూడా నియమించిన సందర్భాలు లేవు. రాష్ట్రవ్యాప్తంగా 1040 గ్రంథాలయ పాలకులు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 466 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని రెండు ప్రాంతీయ గ్రంథాలయాల్లో 119 గ్రంథ పాలకులు ఉండాలి. అయితే వాటిలో 62 ఉద్యోగాలు ఖాళీలుండటం గమనార్హం. వీరందరూ దరిదాపు పది సంవత్సరాల్లో ఉద్యోగ విరమణ పొందేవారే. అర్హత గల గ్రంథ పాలకులను నియమించకుండా అర్హత లేని ఉద్యోగుల చేత గ్రంథాలయాలను నడుపుతుండటం వల్ల ఒక గ్రంథ పాలకుడే రెండు మూడు గ్రంథాలయాలను నిర్వహించవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. లైబ్రరీ అటెండర్లు, క్లర్కులు గ్రంథాలయాలు నిర్వహించటం వల్ల నాణ్యమైన సమాచారాన్ని అందించటంలో పౌర గ్రంథాలయాలు విఫలమవుతున్నాయి.

గ్రంథాలయాలు అభివృద్ధి చెందాలంటే గ్రంథాలయ సెస్సును గ్రంథాలయాలకు కేటాయించాలి. అదేవిధంగా జిల్లా గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్‌ల, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ నియామకాలు రాజకీయ జోక్యం లేకుండా జరగాలి. రాజకీయ నిరుద్యోగులకు ఉద్యోగం ఇచ్చే విధంగా కాకుండా గ్రంథాలయాల మీద అవగాహన, వాటి నిర్వహణలో అనుభవమున్న వారిని ముఖ్యంగా కవులు, డాక్టర్లు, టీచర్లు, శాస్త్రవేత్తలను నియమించాలి. తద్వారా అవినీతి, స్వార్థానికి తావు లేకుండా గ్రంథాలయాల అభివృద్ధికి వారు పాటుపడతారు.

పదహారేళ్ల వసిప్రాయంలోనే ప్రజాకవి కాళోజి నారాయణరావుగారు ఊరూరా, గ్రామగ్రామాన గ్రంథాలయ ఉద్యమానికి నాంది పలికారు. ఆనాడు అలా ఏర్పాటైన గ్రంథాలయాలు ప్రజలను చైతన్యవంతులను చేయడంలో ప్రముఖ పాత్ర వహించాయి. మరి నేడు అవి చరిత్రలో కలిసిపోవలసినదేనా? వట్టికోట ఆళ్వార్ స్వామి లాంటి గొప్పవారు పుస్తకాల కట్టలను నెత్తిమీద పెట్టుకొని గ్రామగ్రామానా తిరుగుతూ వాటిని ప్రజలకు అందించిన ఘనత ఈ తెలంగాణ గడ్డది. బూర్గుల రామకృష్ణ రావు, కొండా వెంకట రంగారెడ్డి, సురవరం ప్రతాపరెడ్డి వంటి వారు తెలంగాణ అంతటా గ్రంథాలయాల స్థాపనకు, ఆ జ్ఞానమందిరాల అభివృద్ధికి చేసిన సేవ అనితరసాధ్యమయినది. ఆ మహనీయుల ఆశయాలను సాధించవలసిన, వారి వారసత్వం కొనసాగించవలసిన బాధ్యత ప్రతి తెలంగాణ బిడ్డపై ఉన్నది.

'గ్రంథాలయాలు విశ్వవిద్యాలయాలకు గుండె వంటి'వని సర్వేపల్లి రాధాకృష్ణన్ అన్నారు. మరి తెలంగాణ సమాజానికి గ్రంథాలయాలు (ప్రజా విశ్వవిద్యాలయాలు) నయనాలు, గుండెలాగా పనిచేస్తాయనడంలో అతిశయోక్తి లేదు. ప్రపంచానికి మహోన్నత విద్యావిజ్ఞానాలను అందించిన తక్షశిల, నలంద, ధర్మపురి విశ్వవిద్యాలయాలకు చదువుకోవడానికి వివిధ దేశాల నుంచి విద్యార్థులు వచ్చేవారు. ఆ విశ్వవిద్యాలయాల్లో అద్భుత గ్రంథ సంచయం కలిగిన గ్రంథాలయాలు ఉండటం వల్లే ప్రపంచం మొత్తం నుంచి విద్యార్థులు వచ్చేవారంటే సత్యదూరం కాదు. నలంద విశ్వవిద్యాలయంలో ఉన్న గ్రంథాలయం పేరు 'ధర్మ ఘనజ్'. మూడంతస్తుల భవనంలో ఉండేది. విలువైన పుస్తకాలు, వివిధ భాషల, విషయ పరిజ్ఞానం కలిగిన వ్రాతప్రతులు అందులో ఉండేవి.

శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయం, రాజరాజనరేంద్ర ఆంధ్ర భాషానిలయంతోపాటు సికింద్రాబాద్‌లో ఆంధ్ర సంవర్ధిని గ్రంథాలయం, సూర్యాపేటలో ఆంధ్ర విజ్ఞాన ప్రకాశిని గ్రంథ నిలయం, హైదరాబాద్ సిద్ధి అంబర్‌బజార్‌లో శ్రీ వేమన ఆంధ్ర భాషానిలయం, అఫ్జల్‌గంజ్‌లో బాల సరస్వతి ఆంధ్ర భాషానిలయం, కుక్కునూర్‌లో దేశోద్ధారక ఆంధ్ర భాషానిలయం, ఖమ్మంలో విజ్ఞాన నికేతన్ మొదలైన గ్రంథాలయాలకు ఎంతో చారిత్రక ప్రశస్తి ఉన్నది. ఈ జ్ఞాన మందిరాలను మనం మరవకూడదు. ఈ గ్రంథాలయాల స్థాపన, అభివృద్ధికి మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి మొదలైన మహనీయులు ఎంతో కృషి చేశారు. వారు దాదాపు 100 గ్రంథాలయాలు తెలంగాణ గ్రామాల్లో ఏర్పాటు చేయటం జరిగింది. నాటి ఈ పౌర గ్రంథాలయాలు తెలంగాణ ప్రజల్లో స్వేచ్ఛా భావనను,

స్వాతంత్ర్య కాంక్షని రగుల్కలిపాయి. వారిని చైతన్యపరిచి, స్వాతంత్రోద్యమంలో ముందడుగు వేసేలా పురికొల్పాయి.

విద్యాలయం విద్యా సముపార్జనా ప్రదేశం. దేవాలయం దైవానికి నెలవు. ప్రతి ఏడాది గుళ్లుగోపురాలు, విద్యాలయాలు లక్షల సంఖ్యలో పెరుగుతూ ఉన్నాయి. అయితే జ్ఞానమందిరాలైన గ్రంథాలయాల సంఖ్య లక్షల మాట దేవుడెరుగు, వందల సంఖ్యలో కూడా పెరగని దుస్థితి. కాలంలో వచ్చిన మార్పులకనుగుణంగా (చేతి వ్రాతప్రతులు, ప్రింటింగ్, ఎలక్ట్రానిక్, డిజిటల్, వర్చ్యువల్) గ్రంథాలయాలు కూడా రూపొందాలి. అధునాతన పద్ధతుల ద్వారా ప్రతి పాఠకునికి ఉపయోగపడే విధంగా, తెలంగాణలోని పౌర గ్రంథాలయాలు అభివృద్ధి చెందాలి. తెలంగాణ పౌర గ్రంథాలయాలు దేశంలోని అన్ని రాష్ట్రాలకు చుక్కాని వలే ఉండే విధంగా ప్రభుత్వం కృషి చేయాలి.

నూతన తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఈ రాష్ట్రంలో శాస్త్ర, సమాచార, సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందాలి. మరి ఇక్కడ సమాచార రంగం అభివృద్ధి చెందాలంటే విజ్ఞాన సమాచారాన్ని అందించే జ్ఞాన భాండాగారాలు అంటే గ్రంథాలయాలు అభివృద్ధి చెంది తీరాలి. గ్రంథాలయాలలో సంచితమైన జ్ఞాన సమాచారాన్ని ప్రతి ఒక్క పౌరుడికి అందుబాటులో ఉండేలా తెలంగాణ ప్రభుత్వం కృషి చేయాలి. తెలంగాణ ఐటీ శాఖ తన విధి నిర్వహణలో అద్భుత ప్రతిభను కనబర్చుతుంది. పరిశ్రమలు, ఐటీ కంపెనీలు, కార్పొరేట్ పరిశ్రమలు, బహుళ జాతి సంస్థలు తమకు నచ్చిన లాభాల్లో కనీసం 2శాతాన్ని తమ సామాజిక బాధ్యతగా గ్రంథాలయాలకు ఇవ్వాలి.

మన రాష్ట్రంలో ప్రపంచస్థాయి నగరాలను అభివృద్ధి చేసుకోవాలంటే ఉన్నత విలువలు గల నాణ్యమైన సమాచారం ప్రతి పౌరునికీ అందించాలి. అలా అభివృద్ధి చెందాలంటే గ్రంథాలయాలను విరివిగా నెలకొల్పాలి. తద్వారా సమాచార విప్లవాన్ని అభివృద్ధి చేయాలి. అప్పుడు మాత్రమే తెలంగాణ భారతదేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా వెలుగొందగలదు. తెలంగాణ గ్రామగ్రామాన గ్రంథాలయాలు నెలకొల్పాలి. మన ముఖ్యమంత్రి సాగు, తాగు నీటి సమస్యల పరిష్కారానికి మిషన్ కాకతీయ, మిషన్ భగీరథను ప్రారంభించినట్టే విద్యా, విజ్ఞానాల వికాసానికి మిషన్ వట్టికోట (గ్రామగ్రామాన గ్రంథాలయాల స్థాపన) అమలుకు పూనుకోవాలి.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

# ప్రభుత్వ బడికి తగ్గుతున్న విద్యార్థులు

తెలంగాణలోని ప్రభుత్వ బడుల్లో ఈ ఏడాది 50,724 మంది విద్యార్థులు తగ్గిపోయారు. ప్రయివేటు పాఠశాలల్లో మాత్రం గత ఏడాది కంటే ఈ సంవత్సరం సుమారు 1,62,000 మంది పెరిగారు. జిల్లా పాఠశాల విద్యాసమాచారం (డైస్) ఈ వివరాల్ని వెల్లడించింది. 2015-16 డైస్ నివేదిక ప్రకారం, తెలంగాణలో సర్కారు బడుల సంఖ్య 28,562. ప్రయివేటు పాఠశాలల సంఖ్య 11,517. ప్రయివేటు స్కూళ్లు ఇంత తక్కువగా ఉన్నా, వీటిలో చదివే విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండటం గమనార్హం. ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 27,65,220 మంది ఉండగా, ప్రయివేటులో 31,56,199 మంది ఉన్నారు. అంటే దాదాపు 4 లక్షలమంది ప్రయివేటు స్కూళ్లలోనే అధికంగా చదువుతున్నారు. ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మొత్తం 2,908 మంది తగ్గారు.

2015-15తో పోల్చుకుంటే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఎక్కువగా 37,317 మంది పిల్లలు తగ్గారు. ప్రయివేటు బడుల్లో మాత్రం గత సంవత్సరం కంటే ఈసారి 1,62,569మంది పెరిగారు. తమ పిల్లల్ని ఆంగ్ల మాధ్యమంలో చదివించేందుకే తల్లిదండ్రులు పిల్లల్ని చదువు ప్రారంభంలోనే ప్రయివేటు స్కూళ్లలో చేరుస్తున్నారని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల వాదన. అందుకే అంగన్‌వాడీ కేంద్రాలను పాఠశాల విద్యాశాఖలో విలీనం చేయాలని వారు కోరుతున్నారు. 2009లో విద్యాహక్కు చట్టం వచ్చాక ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య తగ్గుతూ ప్రయివేటులో పెరుగుతున్నాయని, చట్టంలోని లోపాల వల్ల ఆచరణలో విరుద్ధ ఫలితాలు వస్తున్నాయని లోక్‌సత్తా తొలినుంచీ చెబుతోంది. ఈ సమస్య పరిష్కారం కేవలం మాధ్యమం వల్ల, శాఖల విలీనం వల్ల పరిష్కారం కాదు. ప్రభుత్వ స్కూళ్లు మరీ దారుణంగా ఉండటంతో మంచి చదువు అందుతుందనే భ్రమలో మాత్రమే తల్లిదండ్రులు ప్రయివేటు స్కూళ్లకు పంపుతున్నారు తప్ప అక్కడ కూడా సరైన చదువు అందటం లేదని 'అసర్' వంటి సర్వేలు తెలియచేస్తున్నాయి. ప్రయివేటులో కూడా ఆంగ్లంరాని ఉపాధ్యాయులే భాషను, భావాన్ని వక్రీకరించి పాఠాలు చెబుతున్నారు. మూలాలు తెలియకుండా లెక్కలు బోధిస్తున్నారు. పిల్లలు తర్కించి ప్రశ్నించటాన్ని ప్రోత్సహించటం లేదు. కాబట్టి ఉపాధ్యాయ పోస్టులకు, సంఘాలకు మాత్రమే ఉపయోగపడుతున్న ప్రస్తుత పాఠశాల విద్యావ్యవస్థను సమూలంగా మార్చి ఎన్‌రోల్‌మెంట్‌కన్నా విద్యాప్రమాణాల్ని పెంచటం, ఖచ్చితంగా ఫలితాల మూల్యాంకనం చేసే ఏర్పాటు చేయటం అవసరం.

# జేపీ ఆనాడే హెచ్చరించినా నిద్ర నటించిన ఏపీ సర్కారు

కేంద్రప్రభుత్వం చట్టబద్ధంగా అన్ని రాష్ట్రాలకూ ఇచ్చినట్టు పన్నుల వాటాలు, ఇతర సాయాలను ఇచ్చిందే తప్ప ఆంధ్రప్రదేశ్‌ను విభజించినందుకు ప్రత్యేకించి చేసిన సాయమంటూ ఏమీ లేదని ఏపీ ఆర్థిక శాఖ వర్గాలు తాజాగా పేర్కొన్నాయి. ఏపీకి రెండేళ్లలో రూ.70వేలకోట్లకు పైగా సాయం చేసినట్టు కేంద్ర మంత్రులు చెప్పటం, ఇంకా ఎక్కువ చేశామని బీజేపీ జాతీయ నేతలు చెప్పటంపై ఆ శాఖ విస్మయం వ్యక్తం చేసింది. 2014-15లో రూ.35వేల కోట్లు, 2015-16లో రూ.43,467కోట్లు కేంద్రం నుంచి వచ్చిన మాట వాస్తవమేనని, అయితే ఇది 14వ ఆర్థికసంఘం సిఫార్సు మేరకు ఇతర రాష్ట్రాలకు చేసినట్టే అందించిన నిధులు తప్ప ఏపీకి ప్రత్యేకించి చేసిన సాయం కాదని ఆ వర్గాలు పేర్కొన్నాయి.. సంతోషం. కానీ ఈ వాస్తవాల్ని సంబంధిత పత్రాలను మీడియా ద్వారా విడుదల చేసి మరీ లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ 2015, అక్టోబర్‌లోనే హెచ్చరించినా ఏపీ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదు? ఈ వివరాలను ప్రకటించినప్పుడు, అంతకు ముందు ప్రణాళికా సంఘం కొనసాగుతున్నప్పుడే లోక్‌సత్తా 'తెలుగు భవిత' కార్యక్రమం నిర్వహించినప్పుడు పాలకులు నిద్ర నటించకుండా ముందే మేలుకొని ఉంటే, రాష్ట్రానికి ఇంత దగా జరిగిఉండేది కాదు గదా? యువతకు ఉద్యోగావకాశాలు పెరిగివుండేవి కదా?

**2015, అక్టోబర్ 23న జేపీ విడుదల చేసిన మీడియా రిలీజ్:**

**"రెవిన్యూ లోటును పూడ్చటం కూడా ఆంధ్రప్రదేశ్‌కే ప్రత్యేకం కాదు, ఆర్థిక సంఘం పత్రం విడుదల**

ఇతర రాష్ట్రాలకు ఇవ్వనిది పిసరంత కూడా రాష్ట్ర విభజన వల్ల హైదరాబాద్‌ని కోల్పోవటం వల్ల నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కి ఇవ్వలేదని జేపీ స్పష్టం చేశారు. చివరికి ఆంధ్రప్రదేశ్ రెవిన్యూ లోటును పూడ్చటంలో కూడా కేంద్రప్రభుత్వ ప్రత్యేక సాయం, సానుభూతి, తెలుగువారి పట్ల ప్రేమ ఏమీ లేవన్నారు. ఇందుకు సంబంధించి 14వ ఆర్థిక సంఘం నివేదికలోని వివరాలని జేపీ విడుదల చేశారు. 2015-20 గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద ఆంధ్రప్రదేశ్‌కే కాకుండా కేంద్రం నుంచి 42శాతం నిధులు బదిలీ చేసినా రెవిన్యూలోటు ఉన్న అన్ని రాష్ట్రాలకూ ఆర్థిక సాయం అందిస్తున్నట్టు ఆ డాక్యుమెంట్‌లో స్పష్టంగా ఉందని, రెవిన్యూ లోటు భర్తీ కింద వచ్చే ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌కు రూ.22,113 ఇస్తుండగా, పశ్చిమ బెంగాల్‌కి రూ.11,760 కోట్లు, చిన్న రాష్ట్రమైన కేరళకి రూ.9519 కోట్లు ఇస్తున్నారని, ఈ మాటను చాలా స్పష్టంగా తెలుగు ప్రజలు గుర్తించాలని అన్నారు.

ఐఐటీ, ఐఐఐటీ, ఐఐఎం వంటివి ప్రతి రాష్ట్రానికీ ఇస్తున్నారని, పెట్రోలియం వర్సిటీ ఒక్కటే అదనంగా వచ్చిందని, దాని వల్ల ఏం ఒరుగుతుందో చూడాల్సుందని జేపీ అన్నారు. ఏపీ నగరాలకు అమృత్ పథకం పెట్టాం, స్మార్ట్ సిటీల సాయం అందిస్తాం, 24 గంటలు విద్యుత్తు ఇచ్చే రాష్ట్రాలలో ఏపీని చేర్చాం వంటివి మభ్యపెట్టే మాటలని, ఇలాంటి సాయాలు అన్ని రాష్ట్రాలకూ అందుతున్నాయని అన్నారు. ఈ మాటలు అబద్ధమైతే రుజువు చేయాలని సవాలు చేశారు.

**రాయలసీమ, ఉత్తరాంధ్ర 7 జిల్లాలు ప్రత్యేక హోదా రాష్ట్రాల కంటే వెనకబడి ఉన్నాయి**

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాకు కావలసిన మూడు నాలుగు అర్హతల్లో ఒక్కటే ఉందని చెబుతున్నారని, అయితే రాష్ట్రంలోని 13 జిల్లాల్లో రాయలసీమ, ఉత్తరాంధ్రకు చెందిన 7 జిల్లాలు ప్రత్యేక హోదా కలిగిన రాష్ట్రాల కంటే అధ్వాన్న స్థితిలో ఉన్నాయని జేపీ గణాంకసహితంగా వివరించారు. ప్రకాశం జిల్లాలోని మార్కాపురాన్ని కూడా రాయలసీమలో భాగంగా గుర్తించాలన్నారు. ప్రత్యేక హోదా కలిగిన చిన్న రాష్ట్రాలు సిక్కిం, మిజోరాం, నాగాలాండ్ వంటి వాటిని మినహాయించి **ఆంధ్రప్రదేశ్‌తో పోల్చదగిన అసోం, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూకాశ్మీర్ గణాంకాలను, రాయలసీమ గణాంకాలను జేపీ పోల్చి చూపుతూ మరో పత్రాన్ని జేపీ విడుదల చేశారు.**

'శిశుమరణాల (ప్రతి 1000కి) రేటు అసోం, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూకాశ్మీర్ రాష్ట్రాలలో వరసగా 55, 38, 36, 41 ఉండగా, రాయలసీమలో 44.5 ఉంది. ఆడపిల్లల అక్షరాస్యత 66,76,70,56 ఉండగా, రాయలసీమలో 56.5 ఉంది. మంచినీళ్ల సదుపాయం లేమి 45, 44, 41, 51 ఉండగా, రాయలసీమలో 71 శాతం ఉంది. పేదరికంలో ఉన్న జనాభా ఆ రాష్ట్రాల్లో 32, 8, 11, 10 ఉండగా, రాయలసీమలో 28శాతం ఉంది' అని జేపీ వివరించారు. ఉత్తరాంధ్ర వివరాలు త్వరలో సమగ్రంగా వివరిస్తానన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తానికీ ప్రత్యేక హోదా ఇవ్వటం

ఇతర రాష్ట్రాల అభ్యంతరం వల్ల సాధ్యం కాకపోతే వెనకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ, ఉత్తర తెలంగాణ జిల్లాలకు ప్రత్యేక హోదా కల్పించాలని, ప్రత్యేక హోదాకు జిల్లాను యూనిట్‌గా తీసుకుని దేశవ్యాప్తంగా వెనకబడిన జిల్లాలన్నిటికీ ప్రత్యేక హోదా కల్పించినా తమకు అభ్యంతరం లేదని జేపీ చెప్పారు".'

## ఆరోజు జేపీ విడుదల చేసిన సంబంధిత పత్రాలు:

**Table: Comparison of socio-economic status of Rayalaseema with Special Category States**

| Parameter \ State/Region | Assam | Himachal Pradesh | Uttarakhand | Jammu & Kashmir | Rayalaseema |
|---|---|---|---|---|---|
| Area ('000 sq. km, Census, 2011) | 78.43 | 55.67 | 53.48 | 222.2 | 67.4 |
| Population (in millions, Census, 2011) | 31.20 | 6.86 | 10.08 | 12.54 | 15.18 |
| Population Density (per sq. km, Census, 2011) | 398 | 123 | 189 | 56 | 225 |
| Infant Mortality Rate (per 1000 live births, 2011, SRS Bulletin 2012) | 55 | 38 | 36 | 41 | 44.5 (Annual Plan of AP 2013-14) |
| Literacy Rate (in percentage, Census, 2011) | 72.19 | 82.8 | 78.82 | 67.16 | 66.34 |
| Female Literacy Rate (in percentage, Census, 2011) | 66.27 | 75.93 | 70.01 | 56.43 | 56.5 |
| % Non-availability of drinking water source within premises (Census, 2011) | 45.2 | 44.5 | 41.7 | 51.8 | 70.99 |
| % of HH without latrine facility (Census, 2011) | 35.1 | 30.9 | 34.2 | 48.8 | 60.58 |
| % of Population Below Poverty Line (Planning Commission, 2011-12) | 31.98 | 8.06 | 11.26 | 10.35 | 28 (2007-08, Srikrishna Committee Report) |
| Per Capita Net State Domestic Product (current prices 2009-10 in Rs, MoSPI Press Release) | 27197 | 50365 | 59584 | 30582 | 42320 |
| Installed Capacity of Power Utilities (in MW, as on 30.06.2011, All India Installed Generation Capacity Report, Ministry of Power) | 978.84 | 2826.72 | 2455.24 | 2296.14 | 1840 Power Generation Installed Capacity (Srikrishna Committee |

**Table 11.3 : Grants-in-aid for Revenue Deficit (2015-20)**

*(Rs. crore)*

| State | 2015-16 | 2016-17 | 2017-18 | 2018-19 | 2019-20 | 2015-20 |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| Andhra Pradesh | 6609 | 4930 | 4430 | 3644 | 2499 | 22113 |
| Assam | 2191 | 1188 | Nil | Nil | Nil | 3379 |
| Himachal Pradesh | 8009 | 8232 | 8311 | 8206 | 7866 | 40625 |
| Jammu & Kashmir | 9892 | 10831 | 11849 | 12952 | 14142 | 59666 |
| Kerala | 4640 | 3350 | 1529 | Nil | Nil | 9519 |
| Manipur | 2066 | 2096 | 2091 | 2042 | 1932 | 10227 |
| Meghalaya | 618 | 535 | 404 | 213 | Nil | 1770 |
| Mizoram | 2139 | 2294 | 2446 | 2588 | 2716 | 12183 |
| Nagaland | 3203 | 3451 | 3700 | 3945 | 4177 | 18475 |
| Tripura | 1089 | 1089 | 1059 | 992 | 875 | 5103 |
| West Bengal | 8449 | 3311 | Nil | Nil | Nil | 11760 |
| **Total State** | **48906** | **41308** | **35820** | **34581** | **34206** | **194821** |

*Source: 14th Finance Commission Report*

ఇప్పటికైనా మేలుకొని తెలుగు ప్రజల బాగు కోసం కేంద్రంపై నిర్దిష్ట డిమాండ్లతో పోరాడటానికి బాధ్యత తీసుకుని కలిసివస్తారా? లేక ఇంకా అబద్ధాలు, రాజకీయ డ్రామాలనే కొనసాగిస్తారా? ◻

# పౌరులు గాలికొదిలేస్తే తప్ప నగరాలు అంతరించిపోవు : లోక్‌సత్తా



వచ్చే ఐదేళ్లలో బెంగళూరు జీవయోగ్యంకాని నగరాల జాబితాలో చేరిపోతుందన్న వార్తలు దురదృష్టకరమని లోక్‌సత్తా పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు డా॥ అశ్విన్ మహేష్ అన్నారు. ఆ వార్తలు వాస్తవ సమస్యల్ని లేవెనెత్తినా, వాటిని అతిగా చిత్రీకరించాయి తప్ప పరిష్కారం దిశగా ప్రయత్నాలను ప్రోత్సహించటం లేదన్నారు. భారత్ సిలికాన్ వ్యాలీగా, హరిత నగరంగా పేరుగాంచిన బెంగళూరు ఐదేళ్లలో జీవించేందుకు వీలుకాని స్థితిలోకి మారనుందని భారత విజ్ఞాన శాస్త్రాల సంస్థ (ఐఐఎస్‌సీ) అధ్యయనం చేసిన హెచ్చరికపై అశ్విన్ స్పందించారు.

ఐఐఎస్‌సీ అధ్యయనం ప్రకారం, గత 40 ఏళ్లలో బెంగళూరులో ప్రమాదకరస్థాయిలో నిర్మాణాలు చోటుచేసుకున్నాయి. 525శాతం వృద్ధి సాధించింది. బెంగళూరులోని వృక్షసంతతిలో 78శాతం క్షీణించింది. జలవనరులు 79శాతం నాశనమయ్యాయి. పట్టణీకరణ కారణంగా చెట్లు, చెరువులు కనుమరుగైపోయాయి. ఆర్థికబూమ్ గత రెండు దశాబ్దాలలో నగరాన్ని చాలామేర ధ్వంసం చేసింది. గత 25 ఏళ్లలో నగర జనాభా 40లక్షల నుంచి కోటికిపైగా చేరింది. వెర్రిగా, అర్థంలేనిరీతిలో సాగిన అభివృద్ధి దుష్పరిణామాలు భవిష్యత్తులో హానికరంగా మారనున్నాయని ఐఐఎస్‌సీ సెంటర్ ఫర్ ఎకలాజికల్ స్టడీస్‌కు చెందిన ప్రొఫెసర్ టీవీ రామచంద్ర హెచ్చరించారు. నగర క్షీణతకు బెంగళూరు అభివృద్ధి ప్రాధికార సంస్థ (బీడీఏ)నే తప్పుపడుతున్నారు. జనసమ్మర్థాన్ని నియంత్రించి పర్యావరణాన్ని కాపాడుకోకపోతే మూల్యం చెల్లించకతప్పదని ఐఐఎస్‌సీ హెచ్చరించింది.

బెంగళూరు విస్తరణలో, జీవనవిధానంలో అనేక తప్పులు చోటుచేసుకున్నాయని, అయితే నగరాన్ని మెరుగుపరిచే బాధ్యతను స్వీకరించేందుకు తనలాగే ముందుకొచ్చేవారి సంఖ్య పెరుగుతుండటం ఆశావహ పరిణామమని అశ్విన్ అన్నారు. ఇలా ప్రజలు సరైన ఆలోచనలతో కృషి ప్రారంభిస్తే బెంగళూరు వచ్చే ఐదేళ్లలో మృతనగరంగాకాక, అమృత నగరంగా మెరుగుపడుతుందన్నారు. నష్టం జరిగాకయినా రాజకీయ వ్యవస్థ మేలుకొని మార్పు కోసం పౌరులకు సహకార మందించటం ప్రారంభించిందని, ఇది మున్ముందు మరింత పెరుగుతుందని ఆశిస్తున్నట్టు చెప్పారు. అందుకే మాకెందుకులే అని పౌరులు అనుకునేంత వరకూ నగరాలకు ఏమీ ధోకా ఉండదని తాను విశ్వసిస్తున్నట్టు అశ్విన్ అన్నారు.

## స్మార్ట్ చిత్తూరు నిర్మాణం ప్రతి పౌరుడి బాధ్యత

సురక్షిత చిత్తూరు నిర్మాణం ప్రతి పౌరుని బాధ్యతని, ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వామి కావటం వల్ల స్మార్ట్ చిత్తూరు నిర్మాణం సాధ్యమవుతుందని జిల్లా ఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస్ అన్నారు. అశ్విన్ మహేష్ రూపొందించిన స్మార్ట్ చిత్తూరు ఫర్ స్మార్ట్ జనరేషన్ అప్లికేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చిత్తూరు పీపుల్స్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో ఈ కార్యక్రమం జరిగింది. మనదేశంలోనే మొట్టమొదటిసారిగా ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థను కంప్యూటరీకరించిన అంతర్జాతీయ స్థాయి శాస్త్రవేత్త అశ్విన్ అని, ఆయన సేవల్ని వినియోగించుకోవటంతోపాటు ఆయన స్ఫూర్తితో యువత ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఒక ప్రాంత అభివృద్ధికి సంబంధించి ప్రణాళిక అమలుకు సామాజిక, ఆర్థిక బలం ముఖ్యమని, సమాజంలో నెలకొన్న సవాళ్లను ఎదుర్కొని దీర్ఘకాలిక ప్రయోజనాలను సాధించటానికి ఇలాంటి సాంకేతిక పరిజ్ఞానం తోడ్పాటునిస్తుందని అశ్విన్ అన్నారు. నగర ప్రముఖులు పార్థసారథి నాయుడు, పద్మనాభ నాయుడు, చిత్తూరు పీపుల్స్ యాక్షన్ కమిటీ నాయకులు రాంబాబు, శివకుమార్, గౌతం, హేమంత్, నిఖిల్, పవన్, చంద్రిక, తిరుపతి అభయ క్షేత్రం విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ▫

## Dr JP's Letter to Loksatta People



**Dear Loksatta family,**

Loksatta emerged as a movement in a special context to meet the emerging challenges in the evolution of our democracy. If we recall, the discourse until Loksatta's emergence was anti-political, dividing the society between "them" (those who were in power) and "us" (those who were unhappy with the outcomes of our politics and governance). Politics was treated as pejorative and most polite people shunned political engagement of any kind. Loksatta for the first time has successfully argued that true politics is a noble endeavour, and the only substitute to bad politics is more politics and better politics. The second major contribution of Loksatta is a robust, evidence-based, logical analysis and a creative, constructive approach to institutional reform to change the incentives in public governance. In other words, we have never seen it as a fight between angels and demons. We recognized that players in the state structure were as much victims as they were villains, and the way out is institutional reform to enhance their capacity to deliver, and strengthen accountability.

With this change in approach to addressing governance crisis, Loksatta deliberately shunned the traditional Indian methods of agitation, bandhs, rastaroko and other obstructive, but eye-catching tools. We have always firmly believed that in a democratic republic, the freedoms we enjoy and the franchise we exercise are the only tools for bringing about transformation. These refreshing, rational and liberal approaches have helped in some way to shape our public discourse and achieve several significant, but insufficient reforms.

**Some of Loksatta's accomplishments have been:**

- Disclosure of criminal antecedents of candidates, which finally led to the candidate disclosure law in 2003.
- Improvement in voter registration after years of struggle and relentless pursuit.
- Political funding law in the wake of Tehelka scam.
- Strengthening the anti-defection provisions.
- Limiting the size of the Cabinet.
- Right to Information Act
- National Health Mission
- Local Courts law enacted in 2009.
- Autonomy of cooperatives through the 97th Constitutional amendment.
- A sound Lokpal Legislation.
- Cancellation of 2G spectrum licenses, and competitive bidding of natural resource allocation.
- $99^{th}$ amendment of the constitution about NJAC (subsequently quashed by supreme court)

We founded Loksatta Party in 2006, as we sensed the need to create a platform for new politics, and to bring the youth, middle classes, and politically marginalized sections into the mainstream. Only when these classes yearn for new politics will change be accelerated. Once these disenfranchised classes become vocal and play a creative role, established parties will

be forced to change their ways and improve our democracy. In most societies that is how change happens. If reform parties gain sufficient traction, major parties will either respond to people's urges, or they will be eventually marginalized, and new political forces will replace them. Clearly, while Loksatta brand of electoral politics is highly respected, the vote share is still too low to force systemic change.

In retrospect, we have witnessed significant change over the years. We have been an important influence in changing the attitude of our society toward politics and political participation. We have never treated politicians and parties as untouchables. We worked with parties and governments with dignity, openness and integrity, and on our terms. It is this engagement that is central to our successes in improving our democracy. In the last two decades, Indian politics has however become a spectator sport only during election time and it has moved far away from working for the nation and its people. As a result, there are millions of well-meaning citizens and particularly youngsters who have ended up becoming professional protestors with no meaningful outcomes.

Loksatta was formed with a longterm vision of political reforms towards nation building. We have experienced that electoral politics have become an impediment in our journey to bring about a meaningful change. Over the past two decades, India has witnessed moderate economic growth, and a few governance reforms have been put in place. However in some other respects there is decline. Illegitimate expenditure in elections has skyrocketed; creeping centralization has diminished the capacity of states to refashion instruments of governance; local governments have been completely marginalised; and education and healthcare for ordinary people are both expensive and of appallingly poor quality.

The time has come for all of us to take into account these changes over two decades, restrategise and rejuvenate ourselves as **Loksatta 2.0.** Given India's complexity and current political and social realities, no federal government has the ability to engineer alone the kind of change that is required. Our economic growth project is in jeopardy unless there is realistic hope of opportunity to participate in, and benefit from such growth for the 80% people who are on the margins of wealth creation. While states have more money and titular power, they have no capacity or flexibility to refashion instruments of governance to ensure better delivery. We now have the wisdom from the past two decades to take note of the current context and sharpen our focus on governance reform.

Loksatta will step away from the electoral politics for the time being until the conditions are conducive for Loksatta brand of politics. This has not been an impulsive decision and I have spent many sleepless nights introspecting to truly understand nation's current situation, the strategies needed to energize the nation, and our strengths and opportunities. I believe we should play to our strengths for the best possible outcomes for the nation.

While we are away from elections, we will still continue to work for political transformation and build people movements to strengthen our democracy. Loksatta party will continue to operate as a non-electoral movement for the time being. **Loksatta 2.0** is re-aligning to bring about the desired outcomes at a faster pace. While we will continue to pursue our stated reform agenda, some of Loksatta's immediate priorities in the changed context will be:

a) Strengthening and restructuring federalism to enable states to deliver

b) Universal Healthcare and Quality Education

c) Accountability to tax payers at local level

I need your time, energy and support even more now on this journey to help transform India.

With warm regards,


**Dr. Jayaprakash Narayan**

# ఒక (అవి) నీతి కథ

- అన్నపూర్ణ. ఎ

అందరికీ ఎదిగే అవకాశాలున్న సుస్థిరాభివృద్ధి భారత్‌ను నిర్మించటం కోసం ఈదేశంలోని ప్రజల్ని పౌరులుగా తయారుచేసేందుకు లోక్‌సత్తా రెండు దశాబ్దాలుగా పోరాడుతోంది. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అంతకుముందు ఇంకో ఇరవై ఏళ్లుగా కూడా దాదాపు అదే పనిలో ఉన్నారు. ఇటీవల భారత్‌కు వచ్చిన సుప్రసిద్ధ అమెరికన్ రాజకీయ తత్వవేత్త మైఖేల్ శాండర్స్ కూడా మనదేశానికి ఇదే పరిష్కారమని తేల్చి చెప్పేశారు. ప్రజల్ని పౌరులుగా తయారుచేయటం కోసం భారతదేశ విద్యావ్యవస్థ, మీడియా బాధ్యత తీసుకోవాలని, ఇందుకోసం తగిన ప్రక్షాళన చేసుకోవాలని ఆయన సూచించారు. పౌరసత్వమే ఏ దేశానికైనా అంతిమంగా రక్షణ అనేది సారాంశం. ఏ దేశమైనా పౌరుల బాధ్యత ఏమిటి? సంపాదన లేక ఆస్తి కలిగినవారు సకాలంలో పన్నులు చెల్లించడం. అలా కట్టనివారు ఎంత కష్టపడి సంపాదించినా అక్రమంగా దాచుకోవటమే అవుతుంది. అంతవరకూ వారు సాధించిన పేరుప్రతిష్టలు నశించిపోతాయి. ఒక వ్యక్తి మంచి పౌరుడిగా, పౌరురాలుగా తయారుకావాలంటే చుట్టుపక్కల వాతావరణం, తల్లిదండ్రుల పెంపకం ముఖ్యమని మనం ఒక నీతికథను వింటూ వచ్చాం.

కన్నబిడ్డలు బుద్ధిమంతులుగా ఎదగడానికి మంచినడవడికతో తాను సుఖపడుతూ సమాజానికి మేలు చేయడానికీ 'తోటకూరనాడే చెప్పివుంటే' అనేది ఆ కథా సారాంశం... ఈ రోజు ఇంట్లో కూర ఏమీ లేదు, బజారుకి వెళ్లి తేవాలంటే చేతిలో పైసలు సరిపోయినన్ని లేవు, ఏం చేయాలా అని తపన పడుతోంది ఒక తల్లి. వెంటనే కుమారుడికి ఒక ఆలోచన వచ్చింది. 'పెరట్లో పొరుగింటివాళ్లు ఆకుకూరలు కాయగూరలు పండిస్తారు. వాళ్లు చూడకుండా తోటకూర తెచ్చుకుంటే సరి' అనుకున్నాడు. వెంటనే గోడ దూకి తోటకూర దొంగతనంగా తెచ్చేసి తల్లి చేతికిచ్చాడు. ఆవిడేంచేసింది, 'నువ్వెంత తెలివిగలవాడివిరా కన్నా' అంటూ తెగ మెచ్చుకుని కూర వండి తినిపించింది. అలా మొదలైన కుమారరత్నం చేతివాటం అతడ్ని గజదొంగగా మార్చింది. చివరకు జైలు పాలయ్యాడు. అప్పుడు అమ్మగారికి జ్ఞానోదయమైంది. అయితే ఏం లాభం, జరగాల్సిన నష్టం జరిగిపోయింది గదా! చిన్ననాడే దొంగతనం తప్పు అని ఆ తల్లి చెప్పి ఉంటే అది అలవాటుగా మారకుండా, అతనికి శిక్ష పడకుండా ఉండేది. ఇదీ ఆ కాలాతీత కథ పునశ్చరణ.




ఆ తల్లిని ఆనాడు అందరూ చీవాట్లు పెట్టారు. నీ కొడుకు అలా మారడానికి నువ్వే కారణం, అనుభవించు అంటూ కఠినంగా మాట్లాడారు. మరి ఇప్పుడు? తల్లి ప్రమేయం లేకుండానే కలిసివచ్చిన కాలం, పరిస్థితులు, వచ్చిపడే అవకాశాలు అంతులేని విచక్షణారహిత సంపదను సమకూర్చి పెడుతున్నాయి. ప్రజలతో, ప్రజాసేవతో సంబంధం లేకుండా ఉన్నత పదవులు దక్కుతున్నాయి.అడ్డదారుల్లో ఉక్కిరిబిక్కిరి చేస్తున్న అవకాశాలు స్వార్థపరుడిగానూ బలహీనుడిగానూ మారుస్తున్నాయి. ఇంకా సంపాదించాలనే వ్యామోహమూ పెరిగింది. ఇది ఈనాటి (అవి)నీతి కథ. 'ఉన్న వ్యవస్థలో మాది కష్టార్జితమే గదా, వ్యవస్థను మార్చటం మా బాధ్యత కాదు, మా కష్టార్జితాన్ని ఏరకంగానైనా ఖర్చుచేసుకోవచ్చు లేదా దాచుకోవచ్చు' అని వాదించవచ్చు. కానీ, సంపదకు అవకాశం కల్పించిన వ్యవస్థకు న్యాయం చేయకుండా నిర్లక్ష్యం చేయటం ఘోరమైన తప్పిదం కాదా? వ్యవస్థ తప్పుడు మార్గంలో వెళ్తుంటే ఎప్పుడో జీవిత చరమాంకంలో దానధర్మాలు చేస్తే సరిపోతుందా, వ్యవస్థను మార్చాల్సిన బాధ్యత వ్యవస్థ నుంచి రెండు చేతులా సంపాదించుకుంటున్నవారికి లేదా? నేటి నైతికతే రేపటి చట్టం అవుతుంది, మరి చట్టబద్ధమే అయినా అనైతిక సంపాదనను ఎలా సమర్థించుకుంటారు? దేశభక్తి, జన్మభూమి వంటి అంశాల దాకా కూడా వెళ్లనక్కర్లేదు, కనీసం సమాజం పట్ల కొంత బాధ్యతను ప్రదర్శించటం, ప్రదర్శించేవారికి అండగా నిలబడటం, ఉన్న వ్యవస్థలో మంచిని పరిరక్షించే బాధ్యతలో భాగంగా సంపాదన మీద, ఆస్తుల మీద పన్ను కట్టటం ప్రతి ఒక్కరి విధి. ఈ మాత్రం కూడా చేయకుండా ఈదేశంలో సంపాదించిన డబ్బును విదేశాలకు రహస్యంగా తరలించటం దేశద్రోహమే మరి!

ఇటీవల బయటకు వచ్చిన పనామా పత్రాల అలజడికి ఎవరూ స్పృహ తప్పి పడిపోలేదుగానీ ఎన్నో అనుమానాలను

అవి బలపరిచి దిమ్మెరపోయేలా చేశాయి. మన ఇంటిగుట్టును ఎవరో బైట పెడితే తప్ప మన నేరాలు బైటపడటం లేదు. పనామా పత్రాలు కావచ్చు, అగస్టా కుంభకోణం కావచ్చు. పనామా పత్రాలలో పేర్కొన్న వారికి విరుద్ధంగా, సామాన్యులు కొద్దోగొప్పో ఆస్తులున్నవారు సకాలంలో పన్ను చెల్లిస్తున్నారు. చివరికి కాయకష్టం చేసేవారు కూడా వాళ్లు కొనే ప్రతి వస్తువు మీదా పన్ను చెల్లిస్తారు పాపం! (సబ్బుబిళ్ల, తలనూనె, పళ్లు తోముకునే పేస్టులాంటి నిత్యావసరాల ద్వారా). కానీ అత్యంత శ్రీమంతులు సంపాదనాపరులు బినామీల పేరుతో భద్రంగా దాచుకుంటున్నారు.

ఒక సినిమా నటునికి కోట్లాదిమంది అభిమానులున్నారని రోజురోజుకూ పెరుగుతున్నారని ఫేస్‌బుక్‌లు, ట్విట్టర్లు, లింకులు లెక్కలేనన్ని సంఖ్యల్ని కలిపి చెబుతుంటారు. అలాంటి వ్యక్తి గుజరాత్ రాష్ట్రానికి స్వచ్ఛ భారత్ (స్వేచ్ఛా భారత్ అనే వస్తుంది నాకు అదేంటోగానీ) అంబాసిడర్. ఇది చాలదు, చాలా చిన్న పదవి అనుకుని బాధపడిపోయి ఆయనకు రాష్ట్రపతి పదవిని రెడీ చేశారంటూ ఒక ఛానల్ వారు చెప్పారు. కల్యాణ్ జ్యుయెలరీ యజమాని ఇచ్చిన విందుకి వాడిన బంగారు పళ్లాల ఖరీదు 65 కోట్లుట.. అని (అవి బహుమానంగా ఇచ్చారని) మరో పత్రిక ఎడిటోరియల్ రాసింది. పనామా సునామీ పుణ్యాన ఇప్పుడు ఎన్నో బైటకు వస్తున్నాయి.

ఉన్నత పదవులకు, గౌరవాలకు అర్హత ప్రజాసేవ అనుకునే అమాయకులు ఇంకా ఉన్నారా?..కాదండీ బాబూ, మరోటి ఉంది అని పచ్చిగానే చెబుతూ బాహాటంగానే పదవులు, దేశ వనరులు పంచుకుంటున్న స్థాయికి దిగజారిపోయింది పరిస్థితి. రాజకీయాలంటే కేవలం స్వదేశంలో పదవులు, కుట్రలు, కుతంత్రాలు, ఎత్తులుపైఎత్తులు మాత్రమే కాకుండా అందినంత దోచుకోవడం, దేశాలు దాటించేసి దాచుకోవడం. ఇందుకోసం పోటాపోటీగా సెంటిమెంట్‌లను, నటనను పండించేస్తున్నారు.

ఒక సినిమాలో హీరోగారు ధనవంతులను, అవినీతిపరులను భయపెట్టి డబ్బు గుంజి పేదలకు, నిస్సహాయులకు పంచిపెట్టే రాబిన్ హుడ్‌లాగా వ్యవహరించి నప్పుడు ఆ క్యారక్టర్‌ని చూసి ఆదర్శప్రాయం అనుకుని మురిసిపోయాం. నిజజీవితంలో కూడా అలాగే వాళ్లు చేస్తారన్నట్టు నమ్మడానికి ఇష్టపడుతూ గుడ్డిగా నమ్ముతుంటాం. కానీ సినిమాలో క్యారక్టర్‌ని పోషించినంత ఈజీగా నిజజీవితంలో విజ్ఞతను, ప్రజాస్వామిక నాయకత్వాన్ని ఆచరించి చూపటం కష్టం. తప్పు చేసినవారి బండారం బయటపడి ఎప్పటికైనా తలదించుకోవలసిన పరిస్థితి వస్తుంది. అయితే తాము చేసింది తప్పు కాదు, అది చాలా చిన్న విషయం అని అందర్నీ నమ్మించేందుకు వాళ్లు ప్రయత్నిస్తూనే ఉండటం విచారకరం. ఏవో లొసుగుల్ని చూపి

***ఒక సినిమాలో హీరోగారు ధనవంతులను, అవినీతిపరులను భయపెట్టి డబ్బు గుంజి పేదలకు, నిస్సహాయులకు పంచిపెట్టే రాబిన్ హుడ్‌లాగా వ్యవహరించి నప్పుడు ఆ క్యారక్టర్‌ని చూసి ఆదర్శప్రాయం అనుకుని మురిసిపోయాం. నిజజీవితంలో కూడా అలాగే వాళ్లు చేస్తారన్నట్టు నమ్మడానికి ఇష్టపడుతూ గుడ్డిగా నమ్ముతుంటాం. కానీ సినిమాలో క్యారక్టర్‌ని పోషించినంత ఈజీగా నిజజీవితంలో విజ్ఞతను, ప్రజాస్వామిక నాయకత్వాన్ని ఆచరించి చూపటం కష్టం.***

తాము చేసింది చట్టపరమైన తప్పు కాదని వాళ్లు నిరూపించవచ్చు, కానీ రహస్యంగా డబ్బును వేరే దేశానికి తరలించటంలోనే వాళ్లు తప్పు చేశారనే వాస్తవం తేటతెల్లమవుతుంది. సినీ నటుల ప్రాభవం కొంతవరకేనని వాళ్లు ఎక్కడినుంచో దిగిరారనీ తెలుసుకోలేనంత అమాయకులు కారు ప్రజలు. సమయం వచ్చినప్పుడు బుద్ధిచెప్పగలరు.

విచారించాల్సిన సంగతేమిటంటే, విదేశాలు బైటపెట్టాక ఇక తప్పదన్నట్టు మనదేశ నేర విచారణ సంస్థలు మేలు కొంటున్నాయి. అప్పుడు కూడా సాక్ష్యాలు సక్రమంగా ఉండవు. విచిత్రంగా, ప్రభుత్వాలు మారితే అదే పోలీసు అధికారులు కొత్త వివరాలను బైటపెడతారు, సాక్షులు మాటమారుస్తారు. మన కళ్ల ముందు జరిగిన ఎన్నో సంఘటనల్లో చట్టాలు కూడా చూస్తూ ఊరుకున్నాయి. జైలుశిక్ష పడిన సందర్భాలలో కూడా వీఐపీ నేరస్తులకు చీమ కూడా కుట్టకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. చట్టాలు వారికి బెయిల్ ఇచ్చి స్వేచ్ఛను ప్రసాదించాయి తప్ప వారి ఆస్తులను స్వాధీనం చేసుకోలేదు. పనామా సునామీ విదేశాలలో కొంత ప్రకంపన సృష్టించిందిగానీ మనదేశంలో మాత్రం వారం రోజుల ఈవెంటే. అవినీతిని అంతం చేస్తానన్న ప్రధానమంత్రి పనామా గురించి మాత్రం మాట్లాడటం లేదు. జేపీ సూచించినట్టు, కనీసం ఇలాంటి కుంభకోణాలు మున్ముందు రాకుండా, ఇక ముందు మనదేశం నుంచి డబ్బు రహస్యంగా ఇతర దేశాలకు తరలిపోకుండా ఎన్నికల సంస్కరణలు, పన్ను వ్యవస్థలో మార్పులు, రియల్ ఎస్టేట్ రంగంలో ప్రక్షాళన, జాతీయస్థాయి నుంచి జిల్లావరకూ పటిష్ట అవినీతి నిరోధక వ్యవస్థల ఏర్పాటు వంటి పరిష్కారాల గురించి కూడా ప్రధాని ఎక్కడా ప్రస్తావించటం లేదు. సంపద మాది, అనుభవించేది మరొకరా అని ప్రజలు ఈ పరిష్కారాల కోసం తిరగబడితే, తమ భవితను కాపాడుకునేందుకు యువత ఈ పరిష్కారంలో భాగమవుతూ పోరాడితే అప్పుడు, అప్పుడు మాత్రమే అగస్టా, పనామా వంటి కుంభకోణాల సీరియళ్లకు ముగింపు సాధ్యమవుతుంది. ◘

# ఆరోగ్యశ్రీలో 72.64శాతం నిధులు ప్రయివేటుకే



***పథకాన్ని ప్రారంభించిన నాటి నుంచి ఈ ఏడాది జనవరి వరకు తేల్చిన గణాంకాల ప్రకారం, మొత్తం రూ.3734 కోట్లు ఖర్చుచేయగా, ఇందులో ప్రయివేటు ఆసుపత్రులు సొంతం చేసుకున్నది రూ.2712.55 కోట్లు. సర్కారు దవాఖానాలకు దక్కింది రూ.1021.29 కోట్లే!***

ఆరోగ్యశ్రీ ద్వారా గత ఎనిమిదేళ్లలో ఖర్చు చేసిన మొత్తం వ్యయంలో 72.64శాతం నిధులు ప్రయివేటు/కార్పొరేటు ఆసుపత్రుల పరమయ్యాయి. పథకాన్ని ప్రారంభించిన నాటి నుంచి ఈ ఏడాది జనవరి వరకు తేల్చిన గణాంకాల ప్రకారం, మొత్తం రూ.3734 కోట్లు ఖర్చుచేయగా, ఇందులో ప్రయివేటు ఆసుపత్రులు సొంతం చేసుకున్నది రూ.2712.55 కోట్లు. సర్కారు దవాఖానాలకు దక్కింది రూ.1021.29 కోట్లే! ఆరోగ్యశ్రీ నిధులను సొమ్ము చేసుకోవడంలో కరీంనగర్‌జిల్లా ప్రయివేటు ఆసుపత్రులు (రూ.376.84కోట్లు) ముందుండగా.. ఆ తర్వాతి స్థానాల్లో వరంగల్ (రూ.365.68కోట్లు), హైదరాబాద్ (రూ.343.91కోట్లు). రంగారెడ్డి (రూ.341.03కోట్లు) జిల్లాల ప్రయివేటు ఆసుపత్రులు ఉన్నాయి. ఆరోగ్యశ్రీలో ఇప్పటివరకు 14,24,582 శస్త్రచికిత్సలు జరగ్గా, ఇందులో ప్రయివేటు ఆసుపత్రుల్లో చేయించుకున్నవి 10,10,815. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కేవలం 4,13,767 శస్త్రచికిత్సలు జరిగాయి. సాధారణ చికిత్సలు తప్ప అత్యవసర, కీలకమైన శస్త్రచికిత్సలన్నీ ప్రయివేటు/కార్పొరేట్‌లోనే జరుగుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిపుణులైన వైద్యులున్నా ప్రయివేటు వైపే రోగులు మొగ్గుచూపుతున్నారు. గత ఎనిమిదేళ్లలో సర్కారు దవాఖానాలపై విశ్వాసం సడలిపోయిందనటానికి ఈ గణాంకాలే ఉదాహరణ.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం కూడా ఆరోగ్యశ్రీలో ఇదే ధోరణి కొనసాగుతోంది. గత రెండేళ్ల గణాంకాలను పరిశీలించినా.. 2014లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 70,566 శస్త్రచికిత్సలకుగాను రూ.180.15కోట్లు ఆరోగ్యశ్రీ ద్వారా చెల్లించగా, ప్రయివేటు ఆసుప్రతులకు 1,62,019 శస్త్రచికిత్సలకుగాను 432.23 కోట్లు చెల్లించారు. 2015లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 75,030 శస్త్రచికిత్సలు జరపగా అందుకోసం రూ.189.10 కోట్లు ఇచ్చారు. అదే ప్రయివేటు ఆసుపత్రుల్లో 1,78,917 శస్త్రచికిత్సలు చేసి రూ.484.55కోట్లు చెల్లించారు.

**ప్రయివేటులో కరీంనగర్, సర్కారులో హైదరాబాద్**

ఆరోగ్యశ్రీ పథకం కింద అత్యధిక శస్త్రచికిత్సలు చేసి ఎక్కువమొత్తంలో నిధులు పొందిన ప్రయివేటు ఆసుపత్రుల్లో కరీంనగర్ జిల్లా ముందుంది. హైదరాబాద్‌లోనే పేరున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులుండగా.. రాజధానిని పక్కకునెట్టి ఎనిమిదేళ్లలో మొత్తం 1,49,868 చికిత్సల్ని కరీంనగర్ ఆసుపత్రులు నిర్వహించాయి. గత ఏడాది కూడా కరీంనగర్ జిల్లాలోని ప్రయివేటు ఆసుపత్రులే అత్యధికంగా 26,527 శస్త్రచికిత్సలు నిర్వహించి రూ.70.13కోట్లు ఆరోగ్యశ్రీ ద్వారా ఆర్జించాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్సలను పరిశీలిస్తే, సర్కారు వైద్యంలో హైదరాబాద్ జిల్లా ఆసుపత్రులు గత ఎనిమిదేళ్లలో మొత్తం 77,735 శస్త్రచికిత్సలు నిర్వహించి అత్యధికంగా రూ.179.63కోట్లు ఆరోగ్యశ్రీ నిధులు పొందాయి. తర్వాతిస్థానాల్లో రంగారెడ్డి (రూ.158.74కోట్లు), వరంగల్ (రూ.137.95కోట్లు), మహబూబ్‌నగర్ (రూ.118కోట్లు) జిల్లాల ఆసుప్రతులు నిలిచాయి. మిగిలిన జిల్లాల సర్కారు దవాఖానాలన్నీ రూ.100కోట్ల లోపే ఆర్జించాయి. సర్కారు వైద్యంలో హైదరాబాద్‌లోని ఉస్మానియా, గాంధీ, నీలోఫర్ ఆసుపత్రులపైనే రోగులు అధికంగా ఆధారపడుతున్నారు.

ఈ పరిస్థితిని మార్చి ప్రభుత్వ వైద్య రంగాన్ని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలంగాణ ప్రభుత్వం చెబుతోంది. ◘




హైదరాబాద్‌లోని పడాల రామరెడ్డి లా కళాశాల వార్షికోత్సవ కార్యక్రమంలో
ముఖ్య అతిథిగా పాల్గొన్న లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్










Posting Date 22-05-2016
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on May16th 2016




Book-Post
PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

To

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad